ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-2-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 2 పేజీలు: 10+4 వెల: 6.50




## భళా త్రిష!

అండర్ 19 ఐసిసి వరల్డ్ కప్ మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన భద్రాద్రి క్రీడాకారిణి

2లో

# రాష్ట్రంలో బిసిలే ఎక్కువ



ఆదివారం తెలంగాణ కులగణన సర్వే వివరాలు తెలియజేస్తున్న మంత్రులు ఉత్తమ్, పొన్నం, దామోదర

## జనాభాలో ఎస్సీలు 17%, ఎస్టీలు 10.45%, బిసిలు 46.25%

### ముస్లిం మైనారిటీ బిసిలను కలిపితే మొత్తం 56.33%

### సామాజిక న్యాయం కోసం ఈ చరిత్రాత్మక సర్వే: మంత్రి ఉత్తమ్

### సర్వే నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందించిన ప్రణాళికా సంఘం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి2:** తెలంగాణలో కులగణన, సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడం తెలిసిందే. ప్రణాళిక సంఘం ఆదివారం సర్వే నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందించింది. 3.54 కోట్ల మందిని సర్వే చేసి ఈ నివేదిక రూపొందించినట్టు ప్రణాళిక సంఘం అధికారులు తెలిపారు. 96.9 శాతం కుటుంబాలను సర్వే చేసినట్టు వివరించారు. 3.1 శాతం మంది సర్వేలో పాల్గొనలేదని వెల్లడించారు. కులగణన సర్వే వివరాలు ఇలా ఉన్నాయి... ఎస్సీల జనాభా-(61,84,319)17.43శాతం, ఎస్టీల జనాభా-(37,05,929)10.45శాతం, బిసిల జనాభా-(1,64,09,179) 46.25 శాతం,ముస్లి మైనారిటీ బిసిలు-10.08శాతం, ముస్లిల మైనారిటీ బిసిలతో కలిపి మొత్తం బిసిలు-56.33శాతం, ముస్లిం మైనారిటీ ఓసీలు-2.48 శాతం,మొత్తం ముస్లిం మైనారిటీలు-(44,57, 012) 12.56 శాతం, ముస్లిం మైనారిటీ ఓసీలు కలుపుకొని మొత్తం ఓసీల జనాభా-(56.01. 539)15.79 (ఇతర ఓసీలు 13.31శాతం) శాతం ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన సర్వేలో పాల్గొన్న జనాభా 3,54,77, 554 మంది, సర్వే నివేదిక ప్రకారం రాష్ట్రంలో సర్వేలో పాల్గొన్న మొత్తం కుటుంబాలు -1,12, 15,134 ఉన్నాయి. సర్వే నివేదిక ప్రకారం రాష్ట్రంలో పురుషులు- 1,79,21,183 (50.51 శాతం), మహిళలు-1,75,42,597(49.45శాతం) థర్ జెండర్-13,774(0.04శాతం) ఉన్నారు. సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయలతో పాటు 50 రోజుల వ్యవధిలో సమగ్రమైన కుల గణన నిర్వహించిన తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన రికార్డును నమోదు చేసుకుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రజల కిచ్చిన హామీని తూ.చ తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు రావడం చరిత్రాత్మక సందర్భంగా ఆయన అభివర్ణించారు. ప్లానింగ్ శాఖా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వే వివరాలను పుస్తకం రూపంలో >>2



## 15 లోగా పంచాయతి ఎన్నికల షెడ్యూలు!

### 'స్థానిక' ఎన్నికల్లో కొత్త రిజర్వేషన్ల అమలు

### కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై చర్చకు ప్రత్యేక అసెంబ్లీ

### రేపు ఉదయం కేబినెట్ భేటీ, 11 గంటలకు అసెంబ్లీ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి2:** తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం జెట్ స్పీడ్‌తో కదులుతోంది. కీలకమైన బీసీ రిజర్వేషన్లను తేల్చే అంశాన్ని చివరి అంఖానికి చేరింది. ఫిబ్రవరి 4న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. కులగణన నివేదికపై చర్చించనుంది కేబినెట్. అదేరోజు తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. సభలో కులగణన నివేదికపై స్వల్పకాలిక చర్చ నిర్వహిస్తారు. ఇప్పటికే కేబినెట్ సబ్‌కమిటీకి కుల గణన నివేదిక అందింది. బిసి రిజర్వేషన్ల పెంపుపై ఒక నిర్ణయం తీసుకుని, పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని రేవంత్‌రెడ్డి సర్కార్ యోచిస్తుంది. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపే అవకాశం ఉంది. ఈ మేరకు తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నగారా మోగనుంది.

కొత్త ఓటరు జాబితా ఇప్పటికే సిద్ధమైంది. అలాగే కుల గణన సైతం పూర్తయింది. దీంతో త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో కులగణన సర్వే ప్రకారం స్థానిక సంస్థలఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం సర్వంసిద్ధం చేస్తోంది.

ఈ క్రమంలో ఫిబ్రవరి 15లోపు స్థానిక >>2

# ఆగని 'ఫుడ్ టెర్రర్'



### సర్వవ్యాప్తంగా ఆహార కల్తీలు

### విద్యార్థుల ఆరోగ్యంతో పరాచికాలు

### తాజాగా ధర్మపురిలో 20 మందికి అస్వస్థత

### వరుసగా ఘటనలున్నా అధికారుల నిర్లక్ష్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా అధికారుల వైఫల్యాలతో నిత్యం ఎక్కడో చోట ఆహార కల్తీతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతునానరు. రాష్ట్రంలో నిత్యం ఏదో ఓ మూల గురుకుల పాఠశాలల్లో ఆహార కల్తీ ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. తాజాగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. కళాశాలలో భోజనం చేసిన తర్వాత విద్యార్థులంతా వరుసగా అనారోగ్యానికి గురయ్యారు. ఈ ఘటనలో దాదాపు 20 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలైనట్లు తెలుస్తోంది. కల్తీ ఆహారం తీసుకున్న విద్యార్థినులంతా వరుసగా వాంతులు, విరోచనాలు, తల తిరగటం వంటి సమస్యలతో బాధపడగా, వారందరినీ స్థానిక ఆసుపత్రికి తరలించారు. వారిని పరిశీలించిన వైద్యులు వారికి వెంటనే చికిత్సను అందించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి కారణం ఆహార కల్తీగా వైద్యులు తేల్చారు. కాగా ఇటీవలే నారాయణపేట జిల్లాలోని ధన్వాడ బాలుర పాఠశాలలో ఆహార కల్తీ జరిగింది. ఈ ఘటన మర్చిపోక ముందే మరోసారి ధర్మపురి పట్టణంలో ఆహార కల్తీ జరగటంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం మార్పు రావట్లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురుకులాలు, హాస్టళ్లలో ఆహార కల్తీ, నాణ్యమైన ఆహారం అందించట్లేదనే విషయంపై దృష్టిసారించిన తెలంగాణ సర్కార్ డైట్ ఛార్జీలను పెంచింది. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో డైట్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీలను సైతం భారీగా పెంచింది. అన్ని రకాల గురుకులాలు, వివిధ శాఖలకు చెందిన అనుబంధ హాస్టల్లో పెంచిన చార్జీలను అమలు చేస్తున్నారు. గతంలో 3 నుంచి 7వ తరగతి వరకు రూ. 950 గా ఉన్న డైట్ చార్జీలను ఏకంగా రూ.1,331 కి పెంచారు. అలాగే 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1,100 గా ఉన్న డైట్ చార్జీలను రూ.1,540కు పెంచింది తెలంగాణ సర్కార్. ఇదే కొవలో ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.1,500 నుంచి 2,100 కు డైట్ ఛార్జీలను పెంచిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 7,65,700 మంది హాస్టల్ విద్యార్థులకు పెంచిన చార్జీలను అందిస్తోంది.

విద్యా సంస్థల్లో నాణ్యమైన భోజనం అందించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షించే చర్యల్లో భాగంగా చార్జీలను పెంచింది. ప్రతీ బడిలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సిందిగా స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఈ నేపథ్యంలో వసతి గృహాలకు, హాస్టళ్లకు నెల చివర్లో బిల్లులైతే అందుతున్నాయి కానీ, చాలా హాస్టళ్లు, పాఠశాలలో విద్యార్థుల భోజనం విషయంలో రాజీ పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పిల్లల ఆరోగ్యం ఆహారం విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికి రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ పాయిజింగ్ ఘటనలపై మరింత అప్రమత్తమైంది.



ఆదివారం ముంబయిలో క్రికెట్ ఆడుతున్న బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్

## ముంబయిలో క్రికెట్ ఆడిన రిషి సునాక్

**ముంబయి, ఫిబ్రవరి 2:** బ్రిటన్ మాజీ ప్రధాని రిషిసునాక్ ముంబయిలో పర్యటించారు. దక్షిణముంబయిలోని పార్సీ జింఖానాగ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతూ ఎంజాయ్‌చేసారు. ఈ విషయం ఆయన ఎక్స్‌వేదికగా వెల్లడిస్తూ టెన్నిస్ బాల్‌క్రికెట్ ఆడకుండా నాముంబయి పర్యటన ఎప్పుడూ ముగియదని వ్యాఖ్యలు పోస్టుచేసారు. జైపూర్‌లో ఐదురోజులపాటు జరుగుతున్న సాహిత్య ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు రిషిసునాక్ భారత్‌కు వచ్చారు. శనివారం అక్కడ జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం ముంబయికి చేరారు. స్థానిక పార్సీ జింఖానాకు >>2



## దేశంలోనే అత్యంత 'ఫ్రెండ్లీ' బడ్జెట్

### మధ్యతరగతి ఆదాయ వర్గాలకు గొప్ప ఊరట కల్పించాం

### ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** దేశచరిత్రలో అత్యంత ఫ్రెండ్లీ బడ్జెట్‌కొత్త బడ్జెట్ అని ప్రధానిమోడీ అన్నారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ రూ.12 లక్షల ఆదాయం ఉన్నవాళ్లకు ఇంత భారీ ఉపశమనం ఎప్పుడూ లేదని చెపుతూ ఢిల్లీకి అతిపెద్ద ఆపద 'ఆప్‌ద' అని ప్రభుత్వం 11 ఏళ్లు వృథాచేసిందని అన్నారు. నెహ్రూకాలంలో ఎవరికైనా రూ.12 లక్షల జీతం ఉంటే అందులో పావువంతు పన్నుకేపోతున్నదని, ఒకవేళ నేడు ఇందిరా గాంధీ పాలన ఉంటే అదే జీతానికి రూ.10 లక్షలు పన్ను చెల్లించాల్సి వచ్చేదని ఎద్దేవాచేసారు. 12 ఏళ్లక్రితం కాంగ్రెస్ హయాంలోకూడా ఆ మొత్తానికి రూ.2.60 లక్షలు పన్నుగా పోయేదని ఇపుడు ఆ పరిస్థితి లేదని ప్రధాని అన్నారు. పేదలు రైతులు యువత మహిళల సాధికారతకు మోడీ ఇచ్చిన గ్యారంటీలను ఈబడ్జెట్ నెరవేరుస్తున్నదని భరోసా ఇచ్చారు.

ఈసారి దేశరాజధానిలో డబుల్‌ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందని ధీమా వ్యక్తంచేసారు. బిజెపిపై కేజ్రీవాల్‌పార్టీ తప్పుడు ప్రచారంచేస్తోం దని తాము మురికివాడలను కూల్చేయబోమని పథకాలను నిలిపివేయబోమని తెలిపారు.



ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాదాపూర్ డిసిపి వినీత్, క్రైం డిసిపి నరసింహా

### హైదరాబాద్ శివార్లలో కాల్పుల ఘటన

## బత్తుల ప్రభాకర్ అరెస్టు

### మూడు పిస్తోళ్లు, 451 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం

### మొత్తం 80కి పైగా కేసులు, 28 కేసుల్లో మోస్ట్ వాంటెడ్

### జైల్లో ఉన్నప్పుడు మరో ఖైదీతో వైరం

### శత్రువు జైలు నుంచి విడుదలైన వెంటనే చంపాలని పథకం

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** గచ్చిబౌలి ప్రీజం పబ్ కాల్పుల ఘటనలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్‌ను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బత్తుల ప్రభాకర్ మొత్తం80కిపైగా చోరీ, దోపిడీల్లో నిందితుడు కాగా, 28 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. ప్రభాకర్ నేరాలచిట్టా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. 2022లో విశాఖపట్నం సంట్రల్ జైలుకు తరలిస్తుండగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు నాటినుంచిగాలిస్తున్నారు. హైదరా బాద్‌కు మకాం మార్చిన బత్తుల ప్రభాకర్ నగరపరిసరాల్లోని ఇంజనీరింగ్ కళాశాలల్లో చోరీలకు >>2

## నేడు అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ నిరసనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి2:** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షకు నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నిరసనకు పిలుపునిచ్చింది. రెండు రోజులపాటు ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈమేరకు ఆదివారం టిపిసిసి ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు ట్యాంక్‌బండ్ డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ధర్నా చేపట్టింది. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.







ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో అత్యధికంగా పుణ్యస్నానాలకు తరలి వచ్చిన భక్తులు

# 33 కోట్లు దాటిన మహా కుంభ్ భక్తులు

**మహాకుంభ్‌నగర్,(యుపి), ఫిబ్రవరి 2:** మహాకుంభ్‌మేళా క్రమంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు. మౌని అమావాస్యరోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తం అయిన యుపి సర్కారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పకడ్బందీ ఏర్పాట్లుచేస్తోంది. ఎలాంటి తప్పిదంలేకుండాచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం సీనియర్ ఐఎఎస్‌లను రంగంలోకి దింపింది. జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా ఫిబ్రవరి ఒకటవ తేదీవరకూ ప్రయాగరాజ్‌లో సుమారు 33కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యుపి ప్రభుత్వం అంచనావేసింది. శనివారం ఒక్కరోజే 2.15 కోట్లమంది రాగా ఆదివారం సాయంత్రానికే 90 లక్షలమందికిపైగా పుణ్యస్నానాలుచేసారు. వసంతపంచమి సందర్భంగా సోమవారంనుంచి ఆరుకోట్లమంది వస్తారని అంచనావేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడికూడాపెరుగుతుంది.
వివిధ రంగాలప్రముఖులు ఇప్పటికే ప్రయాగరాజ్‌కు వచ్చి వెళ్లగా ఈనెల ఐదోతేదీ ప్రధానిమోడీ రాకకోసం విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. మౌని అమావాస్యరోజున కోట్లాదిమంది ప్రయాగరాజ్ రావడం సెక్టార్2లోజరిగిన తొక్కిసలాటలో 30 మందిచనిపోయిన క్రమంలో క్రౌడ్‌మేనేజ్‌మెంట్‌పై అధికారులు మరింత ఫోకస్ పెంచారు. 2019లో అర్ధకుంభమేళా సమయంలోపనిచేసిన ఐఎఎస్ అదికారులు ఆశీష్‌గోయల్, భానుచంద్రగోస్వామిలను రంగంలోకి దించారు. ఇద్దరూ మేళా అధికారి విజయ్‌కిరణ్ ఆనంద్‌తోకలిసి పనిచేస్తారు. అదనపు డిజిపి భానుభాస్కర్‌కూడా రద్దీనియంత్రణ చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఆయన ఘాట్లన్నీ కూడా పరిశీలించారు. స్నానాలుచేసాక ఘాట్‌లవద్ద కాలక్షేపం చేయవద్దని సూచించారు. ఘాట్‌లవద్దభోజనాలు వద్దని చెపుతున్నారు. విశ్రాంతికోసంభక్తులు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లాలని మైక్‌లలోప్రకటనలుచేసారు. కుంభమేళా సమయంలో సంక్రాంతి, మౌని అమావాస్య, వసంతపంచమిలను పవిత్రదినాలుగా భావిస్తారు. 12వ తేదీ మాఘపూర్ణిమ, 26వ తేదీ మహాశివరాత్రి రోజుల్లోను అమృతస్నానం ఆచరించేందుకు కోట్లాదిమంది భక్తులు ప్రయాగరాజ్‌కు వచ్చే అవకాశం ఉంది.

## చిత్తూరు జిల్లాలో లారీ, ప్రైవేటు బస్సు ఢీ

### నలుగురు మృతి, 14 మందికి తీవ్ర గాయాలు

**తిరుపతి/పుత్తూరు,ఫిబ్రవరి 2ప్రభాతవార్త:** చిత్తూరుజిల్లా నగరి మండలం రామాపురం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘోరరోడ్డుప్రమాదంలో నలుగురు దుర్మరణంపాలయ్యారు. మరో 14మంది వరకు ప్రయాణీకులు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి వైపు వస్తున్న ప్రైవేట్ బస్సును లారీ ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. నగరి సిఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు...తమిళనాడు అరక్కోణం నుండి తిరుపతికి వస్తున్న ప్రైవేటు బస్సు నగరి మండలం రామాపురం వద్ద ఓ వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వచ్చిన లారీని గమనించిన బస్సు డ్రైవర్ ఎడమవైపుకు తిప్పేలోపు దారుణం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వడమాలపేటమండలం సీతారామపురానికి చెందిన డి.పార్థసారథినాయుడు(70); వి.రాజేంద్రనాయుడు (55),తిరుపతికి చెందిన ఎం.ధనుష్ (10),తిరుత్తణికిచెందిన ఎస్.కుమార్(55) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పార్థసారథినాయుడు, రాజుంద్రనాయుడు అరక్కోణంలో పెళ్ళికి వెళ్ళి వస్తుండగా ఈ ఘోరం జరిగింది.

## అన్నపూర్ణ తెలంగాణను ఆత్మహత్యల తెలంగాణగా చేశారు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి2:** ఏడాది పాలనలోనే ఆకలిచావులు, ఆత్మహత్యల రాష్ట్రంగా తెలంగాణను కాంగ్రెస్ మార్చేసిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. పదేళ్ల పాలనతో తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నిలబెడితే దాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. ఏడాదిలోనే అన్నపూర్ణ తెలంగాణను ఆత్మహత్యల తెలంగాణ మార్చేశారని ఆదివారం కెటిఆర్ ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు.హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ రంగంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టారని, కాంగ్రెస్ దెబ్బకు వారు విలవిల్లాడుతున్నారని ఆరోపించారు. పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక, తెచ్చిన అప్పులు చెల్లించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల ఉసురు తీసుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చి రైతుల్లో కెసిఆర్ ఆత్మవిశ్వాసం నింపారని, వ్యవసాయ రంగానికి ఆయన వెన్నెముకగా నిలిచారని పేర్కొన్నారు. ఏడాది రేవంత్ రెడ్డి పాలనలో సాగునీళ్లు లేక, కరంటు రాక, పంటలు కొనుగోలు చేయక, రైతుభరోసా లేక, రుణమాఫీ గాక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాపాలన కాదు..ప్రజలను వేధించే పాలన..జాగో తెలంగాణ జాగో అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు.

# బత్తుల ప్రభాకర్ అరెస్టు

>> పాల్పడడంతో నగర పోలీసులు ఇతని కోసం గాలింపు చేపట్టారు. చివరికి ప్రీజం పబ్బుల్లో పట్టుకునేందుకు వచ్చిన పోలీసులపై కాల్పులు జరిపి ఎట్టకేలకు పోలీసుల చేతికి చిక్కాడు. ఇతని వద్ద నుంచి మూడు ఫిస్తోళ్లు, 451 రౌండ్ల బుల్లెట్లు, దొంతనాలకు ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిపి వినీత్, క్రైం డిసిపి నర్సింహలు వెల్లడించారు...
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా సోమలాద్రి మండలం ఇరికిపెంట గ్రామానికి చెందిన బత్తుల ప్రభాకర్(30) 9వ తరగతి వరకు చదువుకొని మానివేశాడు. 2013లో మొదటిసారిగా ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన బత్తుల ప్రభాకర్ తన నేర వృత్తిని ప్రారంభించాడు. మారుపేర్లతో చలామణి అవుతూ చోరీలకు పాల్పడిన ప్రభాకర్ మొత్తం 8 పేర్లతో చలామణి అయ్యాడు. చివరికి ఈ మధ్య కాలంలో ఇంజనీరింగ్ కళాశాలల్లో నగదును చోరీచేసే స్థాయికి ఎదిగాడు. తాను చోరీచేసిన సొత్తుతో పబ్బులకువెళ్లడం, హోటళ్లలో మకాం వేయడం, ఇతరుల పేర్లమీద కార్లుకొనుగోలు చేసివాటిల్లోజల్సాలు చేస్తూ తిరగడం చేసేవాడు. 2020లో విశాఖపట్నం జిల్లా పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీచేసి పోలీసులకు పట్టుబడేనాటికి 57 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

**జైలు శత్రువును చంపేందుకు...**

2020లో అరెస్టయిన బత్తుల ప్రభాకర్‌ను పోలీసులు విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు. అక్కడ మరో ఖైదీతో ప్రభాకర్‌కు వివాదం ఏర్పడింది. అనంతరం జైలు నుంచి బెయిలు మీద విడుదలైన ప్రభాకర్ తిరిగి నేరాల బాట పట్టగా, 2022లో విశాఖపట్నం అరిలోవ పోలీసు కస్టడీ నుంచి తప్పించుకొని హైదరాబాద్‌కు మకాం మార్చాడు. జైలులో తనతో గొడవ పెట్టుకున్న వ్యక్తిని జైలు నుంచి విడుదలైన వెంటనే హతమార్చాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తనకు తెలిసిన వ్యక్తుల ద్వారా రెండు సార్లు బీహార్‌కు వెళ్లి మూడు కంట్రీ మేడ్ ఫిస్తోళ్లు, 451 రౌండ్ల బుల్లెట్లను కొనుగోలు చేశాడు.

**మూడేళ్లలో 23 చోరీలు - దొంగిలించిన సొమ్ముతో జల్సాలు**

విశాఖపట్నం పోలీసు కస్టడీ నుంచి తప్పించుకున్న తరువాత నగరానికి మకాం మార్చిన ప్రభాకర్ నార్సింగి ఏరియాలో నివాసం ఉంటున్నాడు. గత మూడేళ్ల కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 23 చోరీలు చేశాడు. నగరానికి మకాం మార్చిన తరువాత ఇళ్లలో దొంగతనాల నుంచి ఇంజనీరింగ్ కళాశాలల్లో చోరీలు చేయసాగాడు. ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజులు, ఎగ్జాం ఫీజులను చోరీ చేయసాగాడు. పలువురు విద్యార్థులకు బంధువునంటూ పగటి పూట కళాశాలల్లో తిరిగి రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో చోరీలు చేస్తున్నాడు. బత్తుల ప్రభాకర్ మీద తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల్లో మొత్తం 80 కేసులు నమోదయ్యాయి. తాజాగా మరో రెండు, మూడు ప్రాంతాల్లో చోరీలు చేయాలని పథకం వేసినట్లు విచారణలో వెల్లడైంది. గత మూడేళ్ల కాలంలో చేసిన 23 చోరీల్లో మొత్తం 2,50 కోట్ల రూపాయలు కొల్లగొట్టాడు. దొంగిలించిన సొత్తుతో పబ్బులకు వెళ్తూ, మద్యం సేవిస్తూ జల్సాలు చేయసాగాడు. దొంగిలించిన సొమ్ముతో తన స్నేహితుల పేరుమీద ఖరీదైన కార్లు కొనుగోలు చేసి అందులో షీకారు చేసేవాడు. వర్కింగ్ మెన్స్ హాస్టళ్లు, హోటళ్లలో తన స్నేహితుల పేరు మీద గదులు తీసుకొని నివాసం ఉంటున్నాడు. గతంలో వైజాగ్‌లో దొంగతనం చేసే సమయంలో పరిచయం అయిన ఓ యువతిని పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తున్నా, ప్రస్తుతం ప్రభాకర్ ఒక్కడే ఉంటున్నాడు. ఇతని తల్లి మృతి చెందగా, తండ్రి స్వగ్రామంలో ఉంటున్నాడు.

**పబ్బుకు వచ్చి చిక్కాడు...**


బత్తుల ప్రభాకర్ చోరీలు చేసిన డబ్బుతో పబ్బుల్లో జల్సాలు చేస్తున్నాడని తెలుసుకున్న రాజేంద్రనగర్, మాదాపూర్ సిసిఎస్ పోలీసులు ఎన్నో రోజులుగా గాలిస్తున్నారు. ముఖ్యంగా హైటెక్‌సిటీ పరిధిలోని పబ్బుల్లో ఉండే సిబ్బంది, బౌన్సర్లకు ప్రభాకర్ ఫోటోలు ఇచ్చి సమాచారం అందించాలని సూచించారు. కాగా ఈనెల 1వ తేదీన గచ్చిబౌలి ప్రీజం పబ్బుకు వచ్చిన బత్తుల ప్రభాకర్ అప్పటికే మద్యం మత్తులో ఉన్నాడు. రాత్రి 7 గంటల ప్రాంతంలో పబ్బుకు రాగా, 7.30 కు పబ్బు తెరుస్తారని సిబ్బంది సూచించారు. దీంతో సిబ్బంది వద్ద ఫోన్ చార్జర్ తీసుకున్న ప్రభాకర్ పక్కకు వెళ్లి ఫోన్ చార్జింగ్ పెట్టుకకోగా, సిబ్బంది గుర్తించి మాదాపూర్ సిసిఎస్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సిసిఎస్ హెడ్ కానిస్టేబుళ్లు వెంకట్‌రెడ్డి, ప్రదీప్, వీరస్వామిలు ప్రీజం పబ్బుకు వెళ్లారు. రాత్రి 7.20కి పోలీసులను చూసిన ప్రభాకర్ తన వద్ద ఉన్న ఫిస్తోలుతో రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి పాదం నుంచి బుల్లెట్ దూసుకువెళ్లింది. అప్రమత్తమైన మిగిలిన ఇద్దరు పోలీసులు, పబ్ బౌన్సర్ల సహాయంతో బత్తుల ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రెండు ఫిస్తోళ్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇంట్లో గాలించగా, ఓ ఫిస్తోలు, 451 రౌండ్ల బుల్లెట్లు, చోరీకి ఉపయోగించే ఇనుప రాడ్డు, కట్టర్, ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాదీనం చేసుకున్నారు. కాల్పుల్లో గాయపడిన కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, 6 నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించి నట్లు డిసిపి తెలిపారు.

# రాష్ట్రంలో బిసిలే ఎక్కువ

>> ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్లానింగ్ సందీప్ సుల్తానీయ,రాష్ట్ర నోడల్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో అధికారుల బృందం ఆదివారం సచివాలయంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోని మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు రాష్ట్ర మంత్రులు సితక్క,దామోదర రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్‌లకు అంద జేసింది. ఈ సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇది తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి వేస్తున్న పెద్ద పీట అని పేర్కొన్నారు. ఇది 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ప్రధాన వాగ్దానాన్ని నెరవేర్చే దిశగా కీలకమైన అడుగని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, సమకాలీన సామాజిక ఆర్థిక డేటా ఆధారంగా సంక్షేమ విధానాల కోసం పునాది వేసినట్లయిందన్నారు. ఈ సమగ్ర సర్వే, స్వాతంత్రం తర్వాత అతిపెద్దది, 94,863 గణకులు, 9,628 సూపర్వైజర్లు, 94,261 గణన బ్లాక్స్‌తో 96.9శాతం తెలంగాణ కుటుంబాలను కేవలం 50 రోజుల్లో కవర్ చేసిందన్నారు. 76,000 డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల్లో సమాచారాన్ని డిజిటలైజ్ చేశారన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సాఫల్యంగా అమలు కోసం డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిందని ఆయన చెప్పారు. నవంబర్ 9, 2024న, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తొలి స్పందనకర్తగా పాల్గొని అధికారికంగా సర్వే ప్రారంభించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. 3,54,77,554 వ్యక్తులను కవర్ చేసిన ఈ సర్వే ముఖ్యమైన జనాభా డేటాతో వెల్లడయిందని, బిసిలు 1,64,09,179 (46.25శాతం), ఎస్సీలు 61,84,319 (17.43శాతం), ఎస్టీలు 37,05,929 (10.45శాతం), మొత్తం ముస్లిం జనాభా 44,57,012 (12.56శాతం), ఇందులో 35,76,588 (10.08శాతం )బిసి ముస్లింలు, 8,80,424 (2.48శాతం) ఓసీ ముస్లింలతో పాటు ఇతర ఓసీలు 44,21,115 (13.31శాతం), మొత్తం ఓసీ జనాభా 15.79శాతం ఈ సర్వేలో వివరాలు వచ్చాయన్నారు. ఈ డేటాను తెలంగాణ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా పునర్‌నిర్మాణం చేయడానికి ఉపయోగిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సర్వేకు ఎదురైన సవాళ్లలో తప్పుడు ప్రచారాలు, హైకోర్టులో పిల్‌లు దాఖలు కావడం వంటి అంశాలు ఎదురు అయ్యాయని ఆయన తెలిపారు.కానీ, న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునివ్వడంతో సర్వే సమగ్రంగా కొనసాగిందన్నారు. 1.03 లక్షల ఇళ్లు తలుపులు వేసి ఉండటం, 1.68 లక్షల కుటుంబాలు మొదట్లో పాల్గొనడానికి సంకోచించడం, 84,137 ఇళ్లు నివాసేతరంగా ఉండటం వంటి సమస్యలు ఎదురయ్యాయన్నారు. అయినా ప్రభుత్వం ప్రజల్లో అవగాహనపెంపొందించేలా చేసి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. బిహార్ కుల గణనకు ఆరు నెలల వ్యవది పట్టడంతో పాటు రూ.500 కోట్లు ఖర్చు కాగా, తెలంగాణ కేవలం 50 రోజుల్లో తక్కువ ఖర్చుతో పూర్తి చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇది సమర్థవంతమైన ప్రణాళిక, వికేంద్రీకృత అమలు, కఠినమైన మానిటరింగ్ కారణమని తెలిపారు. సిఎం,డిప్యూటీ సిఎంలతోపాటు సిఎస్ శాంతి కుమారి రోజువారీ పురోగతిని పర్యవేక్షించారని ఆయన చెప్పారు. 'తెలంగాణ డేటా ఆధారిత పరిపాలనలో ముందంజలో ఉందని ఈ సర్వే నిరూపించిందన్నారు. ఇది కేవలం డేటా సేకరణ ప్రక్రియ మాత్రమే కాకుండా, సామాజిక న్యాయ విప్లవం' అని అన్నారు. 'తెలంగాణ పెద్ద స్థాయి డేటా సేకరణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ఈ సర్వే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుంది' అని మంత్రి అన్నారు. బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ సర్వే తెలంగాణ చరిత్రలో ఓ స్వర్ణాధ్యాయం అని, ప్రజలు ప్రభుత్వంపై నమ్మకాన్ని ప్రదర్శిస్తూ సర్వేలో పాలు పంచుకున్నారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మంత్రి దామోదర్ రాజా నరసింహా మాట్లాడుతూ ఈ సర్వే సామాజిక న్యాయాన్ని నిర్ధారించడంలో నిబద్ధతతో కూడిన ప్రయత్నమని వ్యాఖ్యానించారు. గిరిజన సంక్షేమ మంత్రి ది. సీతక్క మాట్లాడుతూ ఇలాంటి సర్వేలు దేశవ్యాప్తంగా నిర్వహించాలని సిఫారసు చేశారు.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల దిశగా ముందడుగు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన కులగణన నివేదిక కేబినెట్ సబ్ కమిటీకి చేరింది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ సుల్తానియాతో కూడిన బృందం హైదరాబాద్ సచివాలయంలో ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీకి కులగణన కు సంబంధించిన నివేదికను సమర్పించింది. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ కులగణన నివేదికను అందుకున్నారు. కాగా రాష్ట్రంలో ఇంటింటి సర్వే చేసి ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కోసం ఉత్తర్వులు ఇచ్చింది. ప్లానింగ్ విభాగం ద్వారా కులగణన సర్వే చేయించి విజయవంతంగా పూర్తి చేసి నివేదికను సిద్ధం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన దిశగా కులగణన సర్వే నివేదిక ఆమోదంతో ముందడుగు పడనుంది. ఈ నివేదిక ఆధారంగా త్వరలో జరగబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కులగణన తెలంగాణలో దాదాపు 50 రోజుల పాటు కొనసాగింది. ఈ సర్వేలో సుమారు 76 ప్రశ్నలతో కూడిన సర్వేను నిర్వహించి రాష్ట్ర ప్రజల ఆర్థిక స్థితి గతులు పాటు అన్ని వివరాలను సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సర్వేలో మొత్తం 3,889 మంది అధికారులు పాల్గొన్నారు. మొత్తం 96.9 శాతం కుటుంబాలను అధికారులు సర్వే చేశారు. ఈ సర్వేలో ఓవరాల్‌గా తెలంగాణలోని 3 కోట్ల 54 లక్షల మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సర్వేలో 3.1 శాతం మంది ప్రజలు పాల్గొనలేదని కమిషన్ తన నివేదికలో తెలిపింది.



ఢిల్లీ ఎన్నికల సందర్భంగా ఆదివారం పార్టీ ప్రతినిధులతో సమావేశమైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# పంచాయతి ఎన్నికల షెడ్యూలు!

>> సంస్థల ఎన్నికల షెడ్యూల్ రానుంది. ఇదే సమయంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఈ రెండు అంశాలపై అసెంబ్లీలో చర్చించి తుది నిర్ణయం తీసుకునేందుకు ఈనెల 4వ తేదీన అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఇదే సమయంలో ఈ రెండు అంశాలపై కేబినెట్ ఆమోదం పొందేందుకు ఈ నెల 4 న (మంగళవారం) ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కానుంది. అదే రోజున ఉదయం 11 గంటలకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం కానుంది. సమగ్ర ఇంటింటి కులగణన సర్వే నివేదిక ను ఆదివారం రోజు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలోని కేబినెట్ సబ్ కమిటీకి ప్రణాళిక విభాగం. సమర్పించిన విషయం తెలిసిందే. సోమవారం ఎస్సీ ఉప కులాల వర్గీకరణ పై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏక సభ్య న్యాయ కమిషన్ తమ నివేదికను కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తారు. ఈ రెండు అంశాలపై మంగళవారం అసెంబ్లీతో శాసనమండలి ప్రత్యేకంగా సమావేశం కానుంది. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అనుమతుల మేరకు రెండు సభలలో ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభం కానున్నాయని అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వేదాంతం నరసింహాచార్యులు నోటిఫికేషన్ జారీ చేశారు. కులగణన సర్వేలో 55.85 శాతంగా బీసీలు ఉన్నాట్లు తేల్చారు. కొత్త లెక్కల ప్రకారం పథకాలు, రిజర్వేషన్ల అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా.. రిజర్వేషన్ల అమలుకు కసరత్తు చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. బీసీలకు 40 శాతం కోటా పెంచుతామని ఎన్నికల టైమ్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మొత్తం 50 రోజుల పాటు కులగణన సర్వే నిర్వహించారు. సర్వేలో లక్షా 3,889 మంది అధికారులు పాల్గొన్నారు. 96.9శాతం కుటుంబాలను సర్వే చేశారు అధికారులు. సర్వేలో 3 కోట్ల 54 లక్షల మంది తమ వివారాలను వెల్లడించారు. 3.1శాతం సర్వేలో పాల్గొనలేదని కమిషన్ రిపోర్టులో పేర్కొంది. ఫిబ్రవరి 5న మధ్యాహ్నం తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం కానుంది. సభలో కులగణన నివేదిక ప్రవేశపెట్టనుంది ప్రభుత్వం. నివేదికపై చర్చ అనంతరం సభ ఆమోదం తెలపనుంది. మార్చి 5 నుంచి ఇంటర్, మార్చి 17 నుంచి పదోపరీక్షల షెడ్యూల్ ఉంది. పంచాయతీ ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహిస్తే పరీక్షల నిర్వహణకు ఏమైనా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందా? అనే కోణంలో ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే స్థానిక ఎన్నికలతో ఇంటర్ పరీక్షలకు పెద్దగా ఇబ్బంది ఉండదని, పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి జరగనున్నందున ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు పెడితే సమస్య లేదని అధికారులు సీఎంకు రేవంత్‌కు సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సంకేతాలు ఇచ్చారు. ఈనెల 15లోపు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రావచ్చని, అందుకు సిద్ధం కావాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులంతా సర్పంచ్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణలో కులగణన రిపోర్ట్ వచ్చేసింది. నెక్ట్స్ ఏంటో కూడా క్లారిటీ ఇచ్చారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అతి త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 15లోపు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉండాలని.. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సర్పంచ్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పంచాయతీ ఎన్నికల కోసం క్యాడర్‌ను సమాయత్తం చేస్తోంది హస్తం పార్టీ. ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా కార్యకర్తలను అప్రమత్తం చేస్తోంది. గ్రామాల్లోని పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు రానివాళ్లు ఆందోళన చెందవద్దని మంత్రి సూచించారు. సంక్షేమ పథకాలకు లబ్దిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని తెలిపిన మంత్రి.. అందరికీ న్యాయం చేయడమే కాంగ్రెస్ బాధ్యత అన్నారు.

## ముంబయిలో క్రికెట్ ఆడిన రిషి సునాక్

>>ఆదివారం ఉదయం వెళ్లారు. క్లబ్ వార్షికోత్సవాల నేపథ్యంలో అక్కడికి వచ్చినవారితో కాసేపు ముచ్చటిస్తూ క్లబ్‌సాధించిన విజయాలపై చర్చించారు. ఆ తర్వాత బ్యాట్‌చేపట్టి కొంతసేపు క్రికెట్ ఆడారు.

# భళా త్రిష!

### అండర్ 19 ఐసిసి వరల్డ్ కప్ మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన భద్రాద్రి క్రీడాకారిణి

**భద్రాచలం, ప్రభాతవార్త:** అండర్ 19 ఐసిసి వరల్డ్ కప్ మహిళా క్రికెట్ టోర్నమెంట్ భారత జట్టు కైవసం చేసుకోవడంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంకు చెందిన గొంగిడి త్రిష కీలక పాత్ర పోషించి తన సత్తాను ప్రపంచానికి చాటి చెప్పింది. దీంతో భద్రాద్రి వాసులు హర్షాతిరేకాలు అంబురాన్నంటాయి. భళా త్రిష అంటూ కితాబునిచ్చారు. భద్రాచలం అమ్మాయి గొంగడి త్రిషకు అభినందనలు తెలుపుతూ నెహ్రూ కప్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భద్రాచలం పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదాన సమీప ప్రాంగణంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు కేక్ కట్ చేసి త్రిషకు శుభాకాంక్షలు తెలిపారు. నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి అధ్యక్షతన, క్రికెట్ ప్రేమికులు ముర్ల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అభినందన సమావేశంలో... ఎమ్మెల్యే మాట్లాడుతూ త్రిష చూపిన ప్రతిభను ఎంతగానో కొనియాడారు. త్రిషను తీర్చిదిద్దిన తండ్రి జిమ్ రామ్ రెడ్డిని, ఆయన సతీమణిని, కుటుంబ సభ్యులను కోచ్ లను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా త్రిషను ప్రోత్సహిస్తామని, ఈ విషయంపై సిఎం రేవంత్ రెడ్డితో మాట్లాడతానని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

# కంగ్రాట్స్ టీమిండియా

### ఆల్ రౌండర్‌గా అదరగొట్టిన తెలంగాణ బిడ్డ త్రిషకు ప్రత్యేక అభినందనలు: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** వరుసగా రెండోసారి అండర్ 19 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టుకు నాఅభినందనలు అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన తుది పోరులో 44 పరుగులు చేసి, 3 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ భద్రాద్రి కొత్తగూడెంజిల్లా భద్రాచలానికి గొంగడి త్రిషను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. టోర్నీలో అత్యధికంగా 309 పరుగులు చేయడమే కాకుండా, బౌలింగ్‌లో 7 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికై తెలంగాణ ఖ్యాతిని చాటి చెప్పిందన్నారు. జట్టు విజయం కోసం ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయకం. భవిష్యత్తులోనూ మరింత రాణించి మన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని కోరుకుంటున్నా. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ ఆడ బిడ్డలు తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మనస్ఫూర్తిగా సూచిస్తున్నా. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో దేశంలో క్రీడలకు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

## అండర్ 19 మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలుచుకోవడం అభినందనీయం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** అండర్ 19 మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలుచుకోవడం ప్రత్యేకత సంతరించుకుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మీ విజయం 140 కోట్ల మంది భారతీయులకు గర్వకారణం అన్నారు. ఈగొప్ప విజయంలో కీలకంగా వ్యవహరించిన ఆల్‌రౌండర్ తెలుగమ్మాయి గొంగడి త్రిషకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనేక రంగాల్లో భారతీయ ఆడబిడ్డలు ముందుకుసాగుతూ దేశ అభివృద్ధిలో ముందుకు సాగుతున్న ఈ తరుణంలో అండర్ 19 మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలుచుకోవడం అభినందనీయం అన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 03-02-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
పంచమి ఉ.6.53, షష్ఠి తె.4.39
రేవతి రా.11.16
వర్జ్యం : మ.12.03-1.33
దు.మ.12.52-1.38, 2)మ.3.09-3.55
శుభసమయం : ఉ.7.00-8.00, సా.5.00-5.50
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రయాణాలు లాభిస్తాయి. శుభకార్యలకు హాజరవుతారు. వస్తులాభం. విందు, వినోదాలు.

**వృషభం :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

**మిథునం:** బంధువులలో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. ధనవ్యయం పెరుగుతుంది.

**కర్కాటకం:**అనుకోని సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. నిర్ణయాలలో జాప్యం జరుగుతుంది.

**సింహం:** పుణ్యక్షేత్రాల సందర్శనం. ఆర్థిక లావాదేవీలు అనుకూలిస్తాయి. రుణాలు తీరి ఊరట పొందుతారు.

**కన్య :** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు. సంఘంలో గౌరవం పొందుతారు.

**తుల :** బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. రుణాలు కొంతవరకు తీరుస్తారు. కాంట్రాక్టులు లభిస్తాయి.

**వృశ్చికం:** ఖర్చులు పెరుగుతాయి. అనారోగ్యం. పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**ధనుస్సు:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రులు పరిచయాలు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** సంఘంలో ఆదరణ పొందుతారు. విందు వినోదాలలో పాల్గొంటారు. వస్తు లాభం పొందుతారు.

**కుంభం:** కొత్తమిత్రులు పరిచయమై సాయం అందిస్తారు. దైవదర్శనాలు. సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం :** పనులు నిదానంగా పూర్తిచేస్తారు. నూతన వస్తు లాభాలు పొందుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కాంగ్రెస్ అధిష్ఠానం ఈగల్ గ్రూప్‌లో చల్లా వంశీచంద్‌రెడ్డికి కీలక పదవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** కాంగ్రెస్ ముఖ్యనేత, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం కీలక పదవి కట్టబెట్టింది. దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తుందో లేదో పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్ (ఈఏజీఎల్ఈ)అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసిసి)జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ పత్రికా ప్రకటన జారీ చేశారు. ఈ కమిటీ మొదట మహారాష్ట్రలో గల్లంతైన ఓటర్ల జాబితా విషయం విచారణ జరిపి, వీలైనంత త్వరగా పార్టీ అధిష్ఠానానికి వివరణాత్మక నివేదికను సమర్పించనుంది. అలాగే ఈగల్ ఇతర రాష్ట్రాలలో జరిగిన గత ఎన్నికలను కూడా విశ్లేషిస్తుంది. అదే విధంగా దేశంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి సంబంధించిన అన్ని ఇతర సమస్యలను కూలంకషంగా పర్యవేక్షిస్తుందని ఏఐసిసి తన ప్రకటనలో పేర్కొంది. ఏఐసిసి జాతీయ అద్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఈ కమిటీని 8 మంది బృంద సభ్యులతో ఏర్పాటు చేయగా... తెలంగాణకు చెందిన చల్లా వంశీచందర్‌రెడ్డికి కూడా ఈ కమిటీలో చోటు దక్కింది. ఇంకా ఈ కమిటీలో అజయ్ మాకెన్, దిగ్విజయ్‌సింగ్, డాక్టర్ అభిషేక్ సింఘ్వీ, ప్రవీణ్ చక్రవర్తి, పవన్ ఖేరా, గుర్దీప్ సింగ్ సప్పల్, డాక్టర్ నితిన్‌రౌత్ ఉన్నారు.

# ఇజ్రాయెల్ పిఎం నెతన్యాహు సతీమణిపై విచారణ షురూ

**టెల్‌అవీవ్, ఫిబ్రవరి 2:** ఇజ్రాయెల్‌ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సతీమణి సారాపై నేర విచారణచేస్తున్నట్లు ఆదేశ పోలీసులు వెల్లడించారు. నెతన్యాహుకు సంబంధించిన అవినీతికేసులో సాక్షులను బెదిరించారనే



అభియోగాలపై ఆమెపై నేరవిచారణ ప్రారంభించినట్లు చెప్పారు. విపక్షనేతకు రాసిన లేఖలో న్యాయ శాఖ అధికారులు ఈ విషయాలను ధ్రువీకరించారు. నెతన్యాహుపై జరుగుతున్న అవినీతికేసులో విచారణకు సంబంధించి కీలక సాక్షిని బెదిరించేందుకు ప్రయత్నించినట్లు స్థానిక మీడియాలు కథనాలు ప్రసారం చేసాయి. అటార్ని జనరల్‌తోపాటు నెతన్యాహు విరోధులుగా భావించేవారిని వేధించేందుకు ప్రయత్నించినట్లు పేర్కొంది. దీనిపై ప్రతిపక్షసభ్యురాలు నామా లాజిమీ అడిగినప్రశ్నకు స్టేట్ అటార్నీ బదులిచ్చింది. తనకు అనుకూలంగా కవరేజి ఇచ్చేందుకుగాను కొన్ని మీడియా సంస్థలకు సాయం చేయడంతోపాటు ఒక హాలివుడ్‌నిర్మాతనుంచి ఖరీదైన బహుమతులు తీసుకుని ఆతడికి ప్రయోజనం చేకూర్చారని నెతన్యాహుపై ఆరోపణలు వచ్చాయి. వీటికి సంబందించి నెతన్యాహుపై విచారణ ప్రారంభించారు. గతంలో వచ్చిన ఆరోపణలు ఖండించినానెతన్యాహు కోర్టుకు హాజరయ్యారు.

# అప్పులబాధతో వేర్వేరు జిల్లాల్లో ముగ్గురు రైతుల ఆత్మహత్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** వ్యవసాయ కలిసి రాక, వేసిన పంటలు దిగుబడులు లేక నష్టాలపాలైన పలువురు రైతులు చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక తీవ్ర మనస్తాపంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని నర్సక్కపేటకు చెందిన తిప్పరవేణి శ్రీనివాస్ (42)కు 10 గుంటల భూమి ఉన్నది. మరో 9 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఎన్ని పనులు చేసినా పెట్టుబడులు రాకపోవడంతో పాటు, దాదాపు రూ.15 లక్షల వరకూ అప్పులు కావడం వాటిని తీర్చేదారి లేక కలత చెందాడు. దీంతో తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లన్నపల్లికి చెందిన నామిని ఉమాదేవి శ్రీనివాస్ దంపతులు. నాలుగెకరాల్లో వ్యవసాయం చేస్తున్నా, పంటలు సరిగా పండకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. అదీగాక మూడేండ్ల కిందట ఇల్లు కట్టుకోగా రూ.20 లక్షల అప్పు అయింది. సాగు కలిసి రాక పోగా, చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక ఉమాదేవి తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. హనుమకొండలోని దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందింది. కాగా సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని ధర్మాజీపేటకు చెందిన పూరి లక్ష్మణ్ (49) అనే రైతు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామాల శివారులో లక్ష్మణ్‌కు రెండెకరాల భూమి ఉన్నది. అందులో పంటలు పండిస్తున్నా అది లిసి రాలేదు. రెండేండ్ల కిందట ధర్మాజీపేటలో ఇల్లు నిర్మించాడు. అందుకోసం అప్పు చేశాడు. ఓ పక్క అప్పులు తీర్చే మార్గం లేక మరోపక్క పెండ్లి ఈడుకొచ్చిన కూతురు ఉండటంతో మానసికంగా కలత చెంది పొలంలోని వ్యవసాయ బావి పక్కన టేకు చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

# బిజెపికి మద్దతు ఇవ్వండి

### గోండ నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఎంపి ఈటల

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఢిల్లీలో 25 ఏళ్ళ తరువాత బిజెపి గెలవబోతుందన్న ధీమాను మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ వ్యక్తం చేశారు. ఆదివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఈటల రాజేందర్ పాల్గొన్నారు. గోండ నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిజెపి ఎంఎల్ఏ అభ్యర్థి అజయ్ మహావర్‌ను గెలిపించాలని కోరారు. ఢిల్లీలో బిజెపి సర్కార్ ఏర్పాటు చేసి నరేంద్ర మోడీకి మరింత బలం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ ప్రభుత్వం గురించి తాను కొత్తగా మీకు చెప్పాల్సిన అవసరం లేదని, ముఖ్యమంత్రి 16 నెలలు జైల్లో ఉన్నారన్నారు.

# పోలీసు క్రీడాకారులకు మూడు నెలల ప్రత్యేక శిక్షణ

## జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల కోసం సన్నాహాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో ఆణిముత్యాలంటి క్రీడాకారులను మరింత సానపెట్టి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపేందుకు పోలీసు విభాగం సన్నద్ధమవుతోంది. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరచిన వంద మందికి పైగా క్రీడాకారులను ఇ ందుకోసం ఎంపిక చేసి వారికి హైదరాబాద్‌లో మూడు నెలల పాటు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి వీలునుబట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపెందుకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేబట్టింది. కరీంనగర్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో పోలీసు శాఖలోని క్రీడాకారులు వివిధ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను అందు కోవడంతో వీరిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. రాష్ట్ర పోలీసు శాఖలో క్రీడాకారుల కోటాలో ఇటీవలే టీంఇండియా క్రి కెటర్ మహమ్మద్ సిరాజు ద్దీన్, మహిళా ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌లు డిఎస్‌పిలుగా చేరడం తెలిసిందే. వీరిద్దరు పోలీసు శాఖలో చేరిన తరువాత కూడా ప్రొఫెషనల్ క్రీడాకా రులుగా కొనసాగుతుండడం విదితమే. తమ క్రీడా జీవితం ముగిసిన తరువాత వీరిద్దరి చేత అంతర్జాతీయ స్థాయిలో కోచింగ్ కేంద్రాలను నెలకొల్పించేందుకు పోలీసు శాఖ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ కోచింగ్ కేంద్రాలు రాష్ట్ర పోలీసు అకాడమి లేదా యూసుఫ్‌గూడలోని స్పెషల్ పోలీసు బెటాలియన్‌లో నెలకొల్పే వీలుంది. ఈ కేంద్రాల ఏర్పాటుకు పోలీసు శాఖ ఇప్పటికే ఏర్పాట్లు మొదలు పెట్టింది. కాగా కరీంనగర్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించిన పలువు రు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో వీరిని మరింత తీర్చిదిద్ది ఉత్తమ క్రీడాకారులుగా మార్చేందుకు పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. మొత్తం 28 విభాగాలకు సంబంధించిన అంశాలలో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. సైక్లింగ్, అథ్లెటిక్స్, యోగా, క్రాస్ కంట్రీ, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్ బాల్, బాడీ బిల్డింగ్, వాటర్ స్పోర్ట్స్, జూడో, టైక్వాండో, కబడ్డీ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, ఆర్మ్ రెజ్లింగ్, హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, కరాటే, హాకీ, బ్యాట్మింటన్, కోకో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, ఆర్చరీ, లాన్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడల్లో పోలీసు క్రీడాకారులను జాతీయస్థాయిలో తీ ర్చిదిద్దేందుకు ఉన్నతాధిరులు నిర్ణయించారు. రాష్ట్రస్థాయి పోలీసు క్రీడలు ఇకముందు ప్రతీ ఏడాది నిర్వహించేందుకు పోలీసు ఉన్నతాకారులు యోచిస్తున్నారు.



# నిందితుల బెయిల్‌పై అప్పీల్‌కు వెళ్లనున్న పోలీసు శాఖ?

## ఫోన్ ట్యాపింగ్ కేసు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా వున్న ముగ్గురు బెయిల్‌పై విడుదల వడంపై అప్పీల్‌కు వె ళ్లాలని పోలీసు శాఖ యోచిస్తోందని సమాచారం. వీరికి లభించిన బెయిల్‌ను రద్దు చేసి వెంటనే జైలుకు తరలించేందుకు వీలుగా కోర్టుల నుంచి ఉత్తర్వులు పొందేందు కు పోలీసు శాఖ న్యాయ నిపుణులతో సంప్రదింపులు చేస్తోందని తెలిసింది. గత ఏడాది మార్చి నెలలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నాటి ఎస్ఐబి డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావు, అప్పటి హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ అదనపు డిసిపి తిరుపతన్న, నాటి భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ భుజంగరావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులు అరెస్టవడం తెలిసిందే. వీరిని చంచల్‌గూడ జైల్లో నిర్భంధించడం విదితమే. అయితే ఇదే కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి నాటి బాస్ ప్రభాకర్ రావుతో పాటు మరో కీలక నిందితుడు మీడియా అధినేత శ్రవణ్ రావులు అమెరికాకు ఉడాయించగా వారిని ఇప్పటివరకు వెనక్కు రప్పించలేక పోయారు. దీంతో పాటు అరెస్టయిన నలుగురు నిందితులు తాము ప్రభాకర్ రావు ఆదేశాలను పాటించామని, కొన్నిసార్లు తమకు శ్రవణ్ రావు కూడా ఎ వరి ఫోన్‌లను ట్యాపింగన చేయాలో చెప్పేవాడని పోలీసు విచారణలో వెల్లడించారు.

ఇదే సమయంలో కెసిఆర్, కెటిఆర్‌తో పాటు నాటి మంత్రుల పేర్లను కూడా నిం దితులు చెప్పడం సంచలనం రేపింది. వీరిని ఇప్పటి వరకు పోలీసులు విచారించలేదు. ఇలా ఈ కేసు విచారణ 11 నెలలు కావస్తోంది. అరెస్టయిన నిందితుల్లో అదనపు ఎస్పీ భుజంగరావు అనారోగ్య కారణాల వల్ల మధ్యంతర బెయిల్‌పై వుండగా ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది. ఆయనతో పాటు జైల్లో వున్న డిసిపి రాధాకిషన్‌రావుకు కూడా షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ వచ్చింది. కాగా అంతకు మూడు రోజుల ముందు అదనపు డిసిపి తిరుపతన్నకు సుప్రీం కోర్టు నుంచి షరతులతో కూడిన బెయిల్ లభించింది. ఈ ముగ్గురు జైలు నుంచి విడుదలయ్యారు.

మొత్తం మీద ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన నలుగురు నింది తుల్లో ముగ్గురికి బెయిల్ లభించగా డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావు మాత్రమే జైల్లో వున్నారు. ఆయన బెయిల్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో వుంది. కాగా ఈ కేసులో బెయిల్‌పై విడుదలైన తిరుపతన్న, భుజంగరావు, రాధాకిషన్ రావుల బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసు శాఖ సుప్రీం కోర్టుతో పాటు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అ ప్పీల్ చేయనుందని సమాచారం. ముగ్గురి బెయిల్‌ను వెంటనే రద్దు చేసి వారిని మరి కొంతకాలం జైల్లో వుంచాలని కోర్టులను కోరేందుకు పోలీసు శాఖ సిద్దమవుతోందని తెలిసింది. దీనిపై న్యాయ నిపుణులతో పోలీసు ఉన్నతాధికారులు చర్చిస్తున్నారు. వారం రోజుల్లో బెయిల్‌పై అప్పీల్‌కు వెళ్లే వీలుందని తెలిసిది.

# ముంబయి విమానాశ్రయంలో భారీగా కెటమైన్ ఇంజక్షన్ల పట్టివేత

## హైదరాబాద్ నుంచి రవాణా అయినట్లు అనుమానాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ముంబయిలోని ఛత్రపతి శివాజి అంతర్జాతీయ విమానాశ్రయంలో మహారాష్ట్ర పోలీసులు, కస్టమ్స్ అధికారులు భారీగా రసాయన డ్రగ్స్‌ను పట్టుకున్నారు. మరికొద్ది సేపట్లో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌కు వెళ్లేందుకు సిద్దంగా వున్న కార్గో విమానంలో వీటి రవాణా అవుతుందనగా పక్కా సమాచారంతో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. కాగా ఈ రసాయన డ్రగ్స్ హైదరాబాద్ నుంచి రవాణా అయినట్లు వస్తున్న వార్తలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విదేశాలకు భారీగా రసాయన డ్రగ్స్ (సింథటిక్ డ్రగ్స్) రవాణా అవుతున్నాయనే సమాచారంతో ఆదివారం ఉదయం ముంబాయి పోలీసులు ఛత్రపతి శివాజి అంతర్జాతీ య విమానాశ్రయ కస్టమ్స్ అధికారులకు సమాచారం అందించారు. నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు ముంబాయి పోలీసులు దీనిపై కస్టమ్స్ అధికారు లను అప్రమత్తం చేశారు. మొత్తం 15 బాక్స్‌లలో చక్కగా ప్యాకింగ్ చేసివున్న రసాయన డ్రగ్స్ కార్గో విమానంలో రవాణా అయ్యేందుకు రెడీగా వుంది. పోలీసులు ము ందుగా అందిన సమాచారం మేరకు కస్టమ్స్ అధికారులతో కలిసి 15 బాక్స్‌లను కార్గో విమానంలో వెళ్లకుండా ఆపివేశారు. అనంతరం ఆ బాక్స్‌లను తెరిచిచూడగా అం దులో ఐదు వేల నిషేధిత కెటమైన్ ఇంజక్షన్లు వున్నాయి. వీటిని జప్తు చేసి పరీక్షల నిమిత్తం పోలీసు స్టేషన్‌కు, అక్కడి నుంచి ఫోరెన్సిక్ లాబ్‌కు తరలించారు. ఈ ఇం జక్షన్లు థాయ్‌లాండ్ కాజధాని బ్యాంకాక్‌కు వెళ్లేందుకు వీలుగా కొందరు వ్యక్తులు పార్శిల్ పంపారు. ఔషధాల పేరిట వీటిని పంపినట్లు తేలింది. అయితే వీటిని పంపిన వారు ఎవరన్నది తెలియరాలేదు. అయితే హైదరాబాద్ నుంచి ఇవి రవాణ అయినట్లు వార్తలు వస్తున్నాయి. హైదరాబాద్‌లో రసాయన డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీలు అనేక ం వుండడం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇక్కడి నుంచి వీటిని రవాణా చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ముంబాయి ఛత్రపతి శివాజి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇంత భారీ ఎత్తున కెటమైన్ ఇంజక్షన్లు పట్టుబబడం ఇదే తొలిసారి.

# నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

## హాజరుకానున్న 4,29,052 మంది విద్యార్థులు

## 2008 కేంద్రాలు ఏర్పాటు చేసిన ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నేటి(సోమవారం) నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రాక్టికల్ పరీక్షలకు 4,29,052 మంది హాజరు కానున్నారు. పరీక్షల కోస రాష్ట్ర వ్యాప్తంగా 2008 కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుండి 22 వరకు జరగనున్నాయి. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మరో సెషన్ నిర్వహించనున్నారు. సెకండియర్ ప్రాక్టికల్ పరీక్షలకు 1812 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఒకేషనల్ విద్యార్థుల కోసం 463 కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలిపారు. సెకండియర్‌లో ఎంపీసీ విద్యార్థులు 2,34,853 మంది.. బైపీసీ విద్యార్థులు 98,952 మంది కలిపి 3,33,052 మంది ద్వితీయ సంవత్స రం విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానుండగా.. ఒకేషనల్ విద్యా ర్థులు మొదటి సంవత్సరంలో 49,137 మంది కాగా.. ద్వితీయ సంవత్స రం విద్యార్థులు 46,110 మంది కలిపి మొత్తం 95,247 మంది ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ ఏడాది నుంచి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల(డీవో)ను ఏర్పాటు చేయడం లేదని ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు. డీవోలను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులతో రివిజన్ చేయించేలా వారిని ఉపయోగించుకోవాలని ఇంటర్ విద్య కమిషనరేట్ అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది నుంచి ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల నడుమ పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయించారు. విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లను ఇప్పటికే విద్యార్థుల మొబైల్ నంబర్లకు లింక్‌ను పంపించారు. విద్యార్థులు ఆ లింక్ ద్వారా తమ హాల్‌టికెట్లను కాలేజీకి వెళ్లకుండానే డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.

# మెరుగైన చికిత్స కోసం శ్రీతేజ విదేశాలకు తరలింపు!

### ఖర్చు భరించేందుకు ముందుకొచ్చిన నిర్మాత బన్నీవాసు

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** నగరంలోని సంధ్య థియేటర్‌లో పుష్ప 2 సినిమా రిలీజ్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో బాలుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడిన విషయం తెల్సిందే. అయితే ప్రస్తుతం శ్రీతేజ్ నగరంలోని కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. అప్పటి నుంచి క్రమక్రమంగా బాలుడు కోలుకోవడంతో పలువురు పరామర్శిస్తున్నారు. ఇప్పటికే దిల్ రాజ్‌తోపాటు అల్లు అరవింద్ బాలుడుని పరామర్శించారు. తాజాగా బన్నీ వాస్ కిమ్స్‌కు వెళ్లారు. చిన్నారి శ్రీతేజ్‌ను పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్యం కుదుట పడటంతో సంతోషం వ్యక్తం చేసారు. శ్రీతేజ్‌కు ఇంకా మెరుగైన వైద్యం అందించడానికి విదేశాలకు తీసికెళ్లాలని నిర్ణయించినట్లు బన్నీ వాస్ తెలియజేసారు. అయితే ఇప్పటికే తొక్కిసలాటలో శ్రీతేజ్ తల్లి మృతి చెందింది. శ్రీతేజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో శ్రీతేజ్‌ను చికిత్స కోసం సికింద్రాబాద్ కిమ్స్‌కి తరలించారు. అప్పటినుంచి బాలుడు చికిత్స పొందుతున్నాడు. ఈ తొక్కి సలాటకు సంబంధించిన కేసులో హీరో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసారు. ఆ తర్వాత ఆయన బెయిల్ పై విడుదల అయ్యారు. ఇలా విడుదలైన బన్నీని పలువురు సినీ ప్రముఖులు పరామర్శించడం విమర్శలకు దారి తీసింది. అల్లు అర్జున్‌ను పరామర్శించి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించకపోవడంపై విమర్శలకు దారి తీసింది. ప్రభుత్వం కూడా తప్పుపట్టింది. దీంతో శ్రీతేజ్‌ను పలువురు సినిమా ప్రముఖులు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలంటూ ఆకాంక్షించారు. శ్రీతేజ్‌కు పుష్పా2 సినీ నిర్మాతలు, డైరక్టర్ సుకుమార్ పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. అయితే నిర్మాత బన్నీవాస్ ద్వారా అల్లు అర్జున్ ఎప్పటికప్పుడు శ్రీతేజ్ ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్నారు. తాజాగా కిమ్స్‌లో శ్రీతేజ్‌ను బన్నీవాస్ పరామర్శిం చారు. అయితే శ్రీతేజ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు సిద్దమయ్యారు. ఇందుకోసం విదేశాలకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అయితే బాలుడు శ్రీతేజ్ ప్రస్తుతం కిమ్స్‌లోనే వైద్యం పొందు తున్నాడు. కిమ్స్ వైద్యులు మాత్రం ఈ విషయాన్ని ఇంకా ధ్రువీకరించలేదు.

# కెనడా, మెక్సికో దిగుమతులపై అదనపు సుంకాలు

### రెండు దేశాలకు షాకిచ్చిన ట్రంప్ నిర్ణయం!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 2:** రెండోసారి అధికారం చేపట్టిన ట్రంప్ తన పాలనలో దూకుడు పెంచారు. ముఖ్యంగా సుంకాల విషయంలో తగ్గేదేలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా కెనడా, మెక్సికో దిగుమతులతో పాటు చైనాపై సుంకాలు విధిస్తానంటూ పలుమార్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ హెచ్చరికలను నిజం చేశారు. ఆయా సుంకాలు విధించే ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. నేడు



కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాల అమలుకు సంతకం చేశాను. ఫెంటనిల్‌తో సహా మా దేశ పౌరులను చంపే చట్టవిరుద్ధమైన, ప్రాణాంతకమైన మాదకద్రవ్యాల ముప్పు కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. మాకు అమెరికన్లను రక్షించాల్సిన అవసరం ఉంది. అందరికీ భద్రత కల్పించడం అధ్యక్షుడిగా నా బాధ్యత. చట్టవిరుద్ధ వలసదారులను మాదక ద్రవ్యాలు మా సరిహద్దులోకి రాకుండా చేస్తానని ఎన్నికల ప్రచారంలో మాటిచ్చాను. ఆ మాటకు కట్టుబడి ఉన్నా అని పోస్ట్‌లో పేర్కొన్నారు.

**కెనడా, మెక్సికో ప్రతీకార చర్యలు..**

ట్రంప్ నిర్ణయంపై కెనడా, మెక్సికో దేశాలు ప్రతీకారన చర్యలు తీసుకొనేందుకు సిద్ధమయ్యాయి. అందులో భాగంగా 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ఆ దేశ ప్రధాని జస్టిస్ ట్రూడో ప్రకటించారు. మెక్సికో సైతం ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది. 155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నాం. వాషింగ్టన్ చర్యలకు ఇది కెనడా ప్రతిస్పందన. ఇందులో 30 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై విధించే సుంకం అమల్లోకి వస్తుంది. మిగిలినవి 21 రోజుల తర్వాత అమలవుతాయి. అమెరికాను స్వర్ణయుగంలా మార్చాలని అధ్యక్షుడు ట్రంప్ అనుకుంటే మాతో భాగస్వామ్యాన్ని కోరుకోవాలి. అదే వారికి మంచిది అని ట్రూడో పేర్కొన్నారు.

# కేంద్ర పథకాల్లో 95 శాతం తెలంగాణకు లబ్ధి

### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న మేరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల్లో 95 శాతం పథకాల్లో తెలంగాణకు లబ్ది చేకూరుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అలాగే రాష్ట్రంలో నమోదై ఉన్న 10 లక్షల ఎంఎస్‌ఎంఈలకు ప్రయోజనం భారీ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు, మంత్రులు చేస్తున్న విమర్శలు, ఆదివారం నాడు ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ తరపున కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసనపై కిషన్‌రెడ్డి స్పందించి మీడియాతో మాట్లాడారు. ఇది కేంద్ర బడ్జెట్ అని, ఇది తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కాదని పేర్కొన్నారు. 2025 బడ్జెట్‌లో ఎంఎస్‌ఎంఈలు, చిన్నపరిశ్రమలకు ఆపన్నహస్తాన్ని అందించాయని ఆయన అన్నారు. తెలంగాణలో 10లక్షలకు పైగా రిజిస్టర్ అయిన ఎంఎస్‌ఎంఈలకు ఈ బడ్జెట్‌తో ప్రయోజనం చేకూర్చుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు. అలాగే స్టార్టప్‌లకు రూ.10 వేల కోట్లతో నిధులు ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ స్టార్టప్‌లకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కేంద్రంలో తెలంగాణ పన్ను వాటా రూ.27 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు పెరిగినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏ పథకం తీసుకొచ్చినా దాని లబ్ధి తెలంగాణ ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి ఖచ్చితంగా దక్కుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# తూర్పు కాంగోనగరంపై ఎం23 రెబెల్స్ దాడులు

## 700 మందికిపైగా వలంటీర్లు మృతి

**గోమా(కాంగో), ఫిబ్రవరి 2:** కాంగోదేశంలోని తూర్పుప్రాంతంలో ఉన్న అతిపెద్ద నగరం గోమాపై ఎం23 తిరుగుబాటుదారులు దాడులుచేయడంతో సుమారు 700 మందికిపైగా చనిపోయారు. గోమాలో తిరుగుబాటుదారులు ప్రభుత్వ సైన్యానికి మధ్య భారీ యుద్ధంజరిగింది. రువాండా మద్దతున్న ఎం23 రెబెల్స్ ఈ దాడులకు పాల్పడినట్లు తేలింది. ఈ రెబెల్స్ ఉత్తరకివు ప్రావిన్స్ రాజధానినగరాన్ని కూడా స్వాధీనంచేసుకున్నట్లు ప్రకటించారు.

ఇపుడు దక్షిణంవైపు అంటే బుకావు వైపునకు దూసుకుపోతున్నట్లు ప్రభుత్వంప్రకటించింది. 1990నుంచి కూడా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, రువాండా మద్దతునన ఎం23 రెబెల్స్‌కు సాయుధపోరాటం సాగుతోంది. మైనార్టీల హక్కులకోసం పోరాడుతున్నామని రెబెల్స్ చెపుతుంటే ప్రభుత్వం మాత్రం రువాండా మద్దతుతో రెబెల్స్ సాయుధపోరుతో అపారమైన ఖనిజసంపదను దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపిస్తోంది. ఎం23 రెబెల్స్‌ను కట్టడిచేసేందుకు డిఆర్‌కాంగో మిలిటరీ ఒక రక్షణాత్మక లైన్‌ను ఏర్పాటుచేసింది. గోమా, బుకావుల మధ్య ఈరేఖను ఏర్పాటుచేసింది. బుకావును రక్షించుకునేందుకు వందలాదిమంది పౌరవలంటీర్లు రంగప్రవేశంచేసారు. దక్షిణకివు గవర్నర్ జీన్ జాక్వెస్ పురుసి నదికి మాట్లాడుతూ ఎం23 రెబెల్స్ మరింత దూసుకువస్తున్నారని అన్నారు. అంతకుముందు ఇదే వారంలో ఎం23 తన దాడిని కొనసాగిస్తూ రాజధాని కిన్షాసాకు సమీపంలోకి వచ్చింది. పశ్చిమాన 2600 కిలోమీటర్ల లోపలికిచొచ్చుకువచ్చిందని ప్రకటించింది. దేశ విదేశాంగమంత్రి తెరెసె కైయిక్వాంబా వాగ్నర్ మాట్లాడుతూ రువాండా తమ దేశ అంతర్భాగాన్ని అనరకమంగా ఆక్రమించే కుట్రలుచేస్తోందని ఆరోపించారు. రువాండా అధ్యక్షుడు పాల్ కాగామే నిరంకుశత్వాన్ని అంతర్జాతీయ సమాజం కూడా అనుమతిస్తోందని విమర్శించారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినందుకుగాను ఆయనపై చర్యలుతీసుకోవాలని పట్టుబట్టారు. డిఆర్‌కాంగో తూర్పుప్రాంతంలో ఎం23 రెబెల్స్‌కు రువాండా మూడునుంచి నాలుగువేల బృందాలకు మద్దతిస్తోందని కాంగో ఆరోపిస్తోంది.

ఇదిలా ఉంటే జింబాబ్వేలోజ రిగిన సదస్సులో డిఆర్ కాంగోకు సంపూర్ణ మద్దతివ్వాలని దక్షిణాఫ్రికా అభివృద్ధి కమ్యూనిటీ ప్రకటించింది. విదేశాలకు చెందిన 16 మంది సైనికులు కూడా ఎం23 దాడుల్లోచనిపోయినట్లు ప్రకటించారు. 2025 ప్రారంభంనుంచి జరుగుతున్న సాయుధపోరులో సుమారు నాలుగు లక్షలమంది నిరాశ్రయులయినట్లు తేలింది. ఆఫ్రికాలోని రెండో అతిపెద్ద దేశం అయిన డిఆర్‌కాంగో తొమ్మిది దేశాలతోసరిహద్దును పంచుకుంటున్నది.



# కులగణన సర్వే దేశానికి ఆదర్శం

### పిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: కులగణన సర్వే దేశానికే ఆదర్శమని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బిసి కులగణన చేస్తామని చెప్పామని, ఇప్పుడు తాము కులగణన చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో బిసి కులాలకు పెద్ద పీట వేస్తామన్నారు. బిసి కులగణన పారదర్శంగా జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసిలకు న్యాయం చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. అన్ని కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సర్వే చేసిందని, ఎక్కడ లోపాలు జరగలేదన్నారు.

96 శాతం సర్వే పాల్గొన్నారన్నారు. బిసిలకు అవకాశాలు ఇవ్వని పార్టీలు బిఆర్ఎస్, బిజెపిలు బిసిల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి మంచి అవకాశాలు రాబోతున్నాయన్నారు. రాహుల్ గాంధీ బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ బిసిలకు అవకాశాలు కలిపించిందన్నారు. కులగణనపై విష ప్రచారాలు తిప్పి కొడుతామన్నారు.


వార్త, సోమవారం 3, ఫిబ్రవరి 2025

ఏమీ చేయకుండానే ఎంతో కొంత పొందాలని ఎదురుచూసే వ్యక్తులు తప్పని సరిగా నిరాశకు గురవుతారు.

న-జియోర్ట్ ఎలైట్

# వేతనజీవికి ఊరట!

కొత్త ఆర్థికసంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య, మధ్యతరగతికి ఊతం ఇచ్చేదిగా ఉంది. ఎంత సంపాదిస్తే ఏంలాభం, అంతా పన్నులకే పోతోంది అనుకునే మధ్యతరగతి, వేతన జీవులకు ఈ బడ్జెట్ భారీ ఊతం ఇచ్చిందనే చెప్పాలి. ఏకంగా 12 లక్షల ఆదాయం వరకూ కూడా ఎలాంటి పన్నులు చెల్లించనవసరంలేదన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన వేతన జీవులకు ఎంతో ఊరట నిచ్చింది. గతంలో పన్ను పరిమితి ఒక లక్ష మాత్రమే ఉండేది. అలాంటిది ఇపుడు వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితిని కూడా ఒకేసారి పెంచడంపట్ల ప్రజల్లో పొదుపును పెంచ గలమన్న లక్ష్యంతోనే ఈ పన్ను శ్లాబులు ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది.సీనియర్ సిటిజన్లకు వడ్డీరూపంలో కూడా రాయితీలిచ్చింది. వార్షిక వడ్డీ రూ.50వేలు దాటితే మూలవనరుల వద్ద టిడిఎస్ వసూలు చేసేవారు. ఈ మొత్తం ఇపుడు ఈ వడ్డీ పరిమితిని లక్ష రూపాయలకు పెంచారు. అలాగే వాణిజ్య సముదాయాల అద్దె పరిమితిని కూడా ఆరు లక్షలకు పెంచారు. దీనితో పదిశాతం టిడిఎస్ ఇపుడు ఆరు లక్షలు దాటితేనే వసూలవుతుంది. మొత్తం 51 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అటు సామాన్య మధ్యతరగతి కుటుంబాలకుతోడు రక్షణరంగం, వ్యవసా యం, ఉత్పత్తిరంగానికి కూడా ఇతోధిక ప్రాధాన్యం లభిం చింది. రక్షణరంగం తర్వాత వ్యవసాయానికే ఎక్కువ ప్రాధా న్యతను ఇచ్చారు. వ్యవసాయం అనుబంధ రం గాలకు మొత్తం 1.45 లక్షలకోట్లు కేటాయించారు. రైతు లకు కిసాన్‌క్రెడిట్ కార్డుల రుణపరపతిని పెంచారు. 7 కోట్లమంది రైతులకు ఈ లబ్దిచేకూరుతుంది. ధన్‌ధాన్య కృషియోజన కింద 1.7 కోట్లమందిరైతులకు మేలుచేసే కొత్త ప్రణాళిక అమలుకు రాబోతోంది. దీనివల్ల దేశంలోని 100కుపైగా వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి అత్యధికప్రాధాన్యత లభిస్తుంది. ఇక పప్పుదినుసుల దిగుబడిపెంచేందుకు రూ.1000 కోట్లతో ప్రత్యేక మిషన్, 100కుపైగా కొత్త వంగడాల కోసం ఆర్‌అండ్‌డి అభివృద్ధి వంటివి ప్రకటించారు. ఉద్యానవన పంటలకుసైతం 500 కోట్లుకేటాయించారు. పిఎం కిసాన్ పథకానికి 63,500 కోట్లు కేటాయింపులుజరిగాయి. మైక్రోఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలకు కేటాయింపులు కూడాభారీగానే పెంచారు. అదేక్రమంలో దేశభద్రత, సరిహద్దులపరిరక్షణతోపాటు అత్యాధునిక వ్యవస్థలకోసం రక్షణరంగానికి తొలి ప్రాధాన్యం ఉంటుందన్న సంగతి తెలిసిందే. అదేవిధంగా ఉత్పత్తిరంగాన్ని పెంచి ఉత్పాదకతను మరింత వృద్ధి చేయడంద్వారా ఉపాధిని పెంచవచ్చన్న లక్ష్యంతో కేటాయింపులు, ప్రత్యేకించి ఎంఎస్‌ఎంఇరంగానికి భారీ ఊతం ఇచ్చారు. ఈ రంగంలో అరక్షితరుణాలు రూ.5 కోట్లనుంచి 10 కోట్లకు పెంచారు. స్టార్టప్‌లకు ఇచ్చే రుణా లు రూ.10కోట్లనుంచి రూ.20 కోట్లకు పెంచుతున్నట్లు విత్తమంత్రి ప్రకటించారు. అలాగే ఔత్సాహిక చిన్న పారిశ్రామికవేత్తలకోసంరూ.5 లక్షలతో కూడిన యుపిఐ క్రెడిట్‌కార్డును కూడా ప్రవేశపెట్టారు. అదేవిధంగా పెట్టు బడులను ఆకర్షించేందుక ఎల్‌ఐసిలో విదేశీపెట్టుబడులు నూరుశాతానికి పెంచారు. అయితేప్రీమియం వాటాను భారత్‌లోనే పెట్టుబడులుపెట్టాలి. అక్కడితో ఆగకుండా దేశంలో విస్తరిస్తున్న కేన్సర్ మహమ్మారిని కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను కూడా ప్రకటించారు. 36 రకాల ప్రాణాధార మందులపై సుంకాలను తొల గించారు. మరికొన్నింటిపై ఐదుశాతానికి కుదించారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా జిల్లా ఆసుపత్రుల్లోకూడా కేన్సర్‌కేర్ కేంద్రాలను ప్రారంబించాలన్న స్పష్టత ఇచ్చారు. విద్యారంగంలో సాంకేతికతను పెంపొందిం చేందుకుగాను కృత్రిమమేధను పాఠశాలనుంచే అభ్య సించే విధంగా అవగాహణ పెంచేందుకు సిద్ధం అవుతోంది. బడ్జెట్‌లో విద్యారంగానికి 1.28 లక్షల కోట్లుకేటాయించింది. అన్ని పాఠశాలలకు భారత్ నెట్, 50వేలతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు, కొత్తగా ప్రతిభను ప్రోత్సహించేందుకు పిఎం ఇంటర్న్‌షిప్ పథకాలు విద్యార్థులను మరింత ఆకర్షిస్తాయి. వచ్చే పదేళ్లలో 4.1 కోట్లమంది యువతకు ఉపాధికల్పన లక్ష్యంతోనే విద్యారంగానికి హైటెక్ సొబగులు అద్దినట్లు స్పష్టం అవుతోంది. వీటితోపాటే పారిశ్రామిక రంగానికి కూడా పలు అంశాల్లోసుంకాల రాయితీని కల్పించారు. దేశంలో పెట్టుబడులుపెట్టేందుకు ముందుకు వచ్చే ఇన్వె స్టర్లకు మరిన్ని తాయిలాలు ప్రకటించడంతో ఇక పెట్టు బడులు వెల్లువలా రాగలవన్న అంచనాలు పెరిగాయి. స్టార్టప్‌లను మరింతగా ప్రోత్సహించేందుకువీలుగా ఫండ్‌ఆఫ్ ఫండ్స్‌కింద రూ.10వేల కోట్లతో నిధిని కూడా ఏర్పాటుచేయడం ఆరంగానికి ఎంతో ఉపశమనం కలిగి స్తోంది. కేవలం పారిశ్రామిక కార్పొరేట్‌రంగాల్లోనే కాకుం డా బీమా, విద్యుత్, ఇంధన ఉత్పత్తిరంగాల్లో కూడా ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో స్వాగతం పలికారు. అణుఇంధన ఉత్పత్తికి ప్రైవేటు సహకారం కూడా తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ద్వితీయశ్రేణి నగరాలకు సైతం విమాన యానరంగాన్ని విస్తరించే లక్ష్యంతో కొత్తగా 120 గమ్య స్థానాలను ఉడాన్ పథకం కింద సేవలు విస్తరించేందుకు నిర్ణయించారు. 25 కీలక ఖనిజాలకు దిగుమతి సుంకాలను రద్దు చేయడంతోపాటు మరికొన్నింటికి సుంకాలను తగ్గించి పారిశ్రామికరంగానికి ఊతం ఇచ్చింది. అలాగే రాష్ట్రాలకు అందుబాటులో రూ.1.5 లక్షలకోట్లను కేటా యింపులు జరిపారు. 50 ఏళ్లపాటు వడ్డీరహిత రుణాలు ఇవ్వడం ద్వారా రాష్ట్రాలకు మరింత ఆర్థికపరిపుష్టినిచ్చే కార్యాచరణను పునరుద్ధరించారు. అదేవిధంగా రూ.లక్ష కోట్లతో ఏర్పాటు చేసిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌వల్ల దేశంలోని నగరాలను వృద్ధికి ఊతం ఇచ్చే కేంద్రాలుగా మార్చే లక్ష్యం కనిపిస్తోంది. ప్రస్తుతం జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతోపాటు త్వరలో ఎన్నిలకు వస్తున్న బీహార్‌కు జరిపిన కేటాయింపులు మినహాయిస్తే ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యసాధన దిశగా కేటాయింపులు చేసారని తేటతెల్లం అవుతోంది.



వచ్చినవాడు మిత్రుడైనా, శత్రువైనా చిరుదరహాసంతో స్వాగతం పలకడం ఉత్తమ లక్షణం.

జాన్‌సావంత్



వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.

వివేకానందుడు

# ప్రజావాక్కు



### విధుల పట్ల నిర్లక్ష్యం

రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల్లో విధుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం నిత్యం పత్రికావార్తల్లో చోటు చేసుకుంటున్నాయి. మరో వైపు అసలు కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఈజాడ్యం అన్ని శాఖలకు విస్తరించింది. కొంతమంది అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి కావాలని తప్పుడు నిర్ణయాలు చేస్తున్న వైనాలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వం ఇటువంటి వారిని సస్పెన్షన్లతో సరిపెట్టక ఉద్యోగాలనుంచి డిస్మిస్ చేయాలి. ముఖ్య మంత్రి మంత్రులు ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని పాలనా వ్యవహారాల్లో కఠినంగా ఉండాలి. లేకుంటే ప్రజా విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉంది.

-జి. రామకృష్ణ, ఏలూరుజిల్లా

### ప్రజలపై పన్నుల భారం

కొత్త ప్రభుత్వం ఆస్తి పన్నుపై కొత్త నిర్ణయం తీసుకుంది. గతంలో ఆరు నెలలకు యేడాదికి ఒకసారి చెల్లించే ఆస్తి పన్ను ఇకపై నెలనెలా కట్టాలని ప్రతిపాదించింది. కానీ ఇందులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. వాటిని కూడాపరిగణనలోకి తీసుకోవాలి. పేద, మధ్యతరగతి ప్రజలపైఇదిఎంతో భారం పడుతుంది. చిన్నాచితకా ఆదాయం వారికి ప్రతీనెలా పన్ను వెసులుబాటు కాదు. అదీ కాక మళ్లీ ఈ పన్ను కట్టుటకు మీ సేవలను ఆశ్రయించాలి. దానికి కొంత రుసుము చెల్లించాలి. ప్రతినెలా బిల్లులు పంపడం, వసూలు చేయడం వల్ల సిబ్బందికి ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఆ బిల్లులు అందుకోవడం దాచుకోవడం ప్రజలకు ఇబ్బంది అవుతుంది. కావునా ప్రభుత్వం ఈ ప్రతిపాదనపై పునరాలోచించాలి.

-కె.నాగేంద్రకుమార్, హైదరాబాద్

### విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీబిసి మైనారిటీ వికలాంగుల సంక్షేమశాఖ బాలికల గురుకులాల, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు గురుకులాలలో, హాస్టల్లో తినడానికి నాణ్యమైన ప్లేట్లు, గ్లాసులు సరఫరా చేయాలి. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికిగాను ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, టీచింగ్ స్టాఫ్ అందరికీ ప్లేట్‌లు, గ్లాసులు సరఫరా చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

### పెరుగుతున్న సైబర్ నేరగాళ్లు

చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఫోన్లు ఉపయోగిస్తున్నారు. ఫోన్లు ఉపయోగిస్తున్న వారిని ఇటీవలకాలంలో స్పామ్ కాల్స్ తెగ విసిగిస్తున్నాయి. అలాగే స్పామ్‌కాల్స్, ఎస్ఎంఎస్ లతోపాటు ఈ మధ్యకాలంలో సైబర్ నేరగాళ్ల మోసపూరిత కాల్స్ పెరుగుతున్నాయి.రకరకాలుగా బయపెట్టి టెలికం యూజర్లను దోచుకుంటున్నారు. ట్రాయ్ పేరుతో కాల్స్ చేస్తూ మీ నెంబర్‌ను బ్లాక్ చేస్తున్నామని బెదరించి 'ఈడి' పేరుతో అందినంత దోచుకుంటున్న సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి కాల్స్‌ను నిరోధించడానికి ఉన్న అవకాశాలను టెలికం సంస్థలు అన్నీ కలిసి ట్రాయ్ ద్వారా వెంటనే చర్యలు తీసుకుంటే మునుముందు ఎంతో మంది అమాయకులు స్పామ్‌కాల్స్‌కు గురికాకుండా ఉంటారు.

-డి. వెంకటరెడ్డి, బెంగళూరు

### ఆర్థిక వ్యవస్థపై నిరుద్యోగ ప్రభావం

నిరుద్యోగం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలనే అతలాకుతలం చేస్తున్న సమస్య. ఆర్థికవ్యవస్థలు చిన్నాభిన్నమైన దేశాల ఉనికినే ప్రశ్నిస్తున్న సమస్య. జనాభా తక్కువగా ఉన్న ఒకనాటి కాలంలోప్రాథమిక విద్యవరకు చదువుకున్నవారికి కూడా జీతం తక్కువైనా వారిస్థాయికి తగ్గ ఉద్యోగం లభించేది. మహిళలు ఉద్యోగం చేయడం కోసం ముందుకు రాని రోజులవి. ఐదవ తరగతి చదివిన వాళ్లు కూడా వార్డు మెంబర్లుగా, పంచాయతీ బోర్డు ప్రెసిడెంట్లుగా, ఇంకాచిన్నా చితకాఉద్యోగాలు చేసేవారు. అక్షరం ముక్కరాని వాళ్లు కూడా ప్రశాంతంగా పల్లె ప్రాంతాల్లో ఏదో ఒక పనిచేసుకుంటూ బతికేవారు. నాడు ప్రజా సమస్యలే ఏజెండాగా పార్టీలతోపనిలేకుండా ప్రజలందరినీ, తమకుటుంబ సభ్యులుగా భావించే పాలకులుండేవారు. మారిన కాలానికనుగుణంగా విద్యకు ఉన్న ప్రాధాన్యతను అందరూ గుర్తించారు.

-జి. వేణుగోపాల్, హైదరాబాద్

### గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

అనంతపురం జిల్లాలోని ఉరవకొండ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నది. ఇక్కడ ఉన్న అరబిక్ హైస్కూల్ ప్రాంగణం పూర్తిగా అపరిశుభ్రంగా తయారైంది. ఈపరిసర ప్రాంతమంతా కుక్కలు, పందుల ఆవాస కేంద్రంగా మారింది. దశాబ్దం గడుసుతన్నా ఉరవకొండ అభివృద్ధిమాత్రం శూన్యం. ఈప్రాంత శాసనసభ్యుడు ఇక్కడ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి.

-సాగర్, ఉరవకొండ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అవసరం

**ఉపాధ్యాయులకు నిరంతరం బోధనేతర కార్యక్రమాలు ఇవ్వడం వలన, అంతిమంగా విద్యార్థులకు నష్టం చేకూరుతుంది. ఈ విషయం తెలిసినప్పటికీ, మండల విద్యాశాఖ అధికారులు, విద్యార్థులకు నష్టం జరుగుతుంది అనే అభిప్రాయం, ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లకపోవడం ఫలితంగానే, ప్రభుత్వ పాఠశాలలు చాలా బలహీనంగా తయారవుతున్నాయి. ప్రస్తుత పాలకులు,వీటిమీద దృష్టిపెట్టి, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేసి, విద్యార్థులకు భవిష్యత్తులో పనికివచ్చే కరికులాన్ని పొందుపరిచి, చక్కని బోధనా విధానాలను అమలుపరిచి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కేవలం బోధనకు మాత్రమే స్వేచ్ఛను ఇచ్చి, బ్యూరోక్రసీ అనవసరంగా విద్యావ్యవస్థలో జోక్యం చేసుకోకుండా, స్వతంత్ర వ్యవస్థగా ఉంచగలిగితే, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి. కొత్త పాలకులు ఆ విధంగా కృషి చేయాలి.**

తరిగోపుల నారాయణస్వామి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుత పాలకులు చెబుతున్నట్లు ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయటం సాధ్యమేనా? పాలకుల మాటలకు క్షేత్రస్థాయిలో అమలు పరిచే విధానాలకు పూర్తిగా వ్యత్యాసం కనిపిస్తున్నది. గత పాలకులు రకరకాల ప్రయోగాలతో, విద్యావ్యవస్థలో నిలకడ లేని విధానాలను అమలుపరుస్తూ, అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు ఊపిరి ఆడకుండాచేశారు. పైగావిద్యార్థుల అభ్యసనలో పూర్తిగా వెనకపడేటట్లు చేయడం ఫలితంగా, వేలాది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాటపట్టారు. పాలకులవిధానాలతో, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు చెప్పటంలో అధికారులు విఫలం కావడం ఫలితంగానే, 117 జీవో మీద విపరీతమైన వ్యతిరేకత రావడం జరిగినది. ఈ 117 జీవో ఫలితంగానే, రాష్ట్రవ్యాప్తంగా వందలాది విద్యార్థులతో కళకళలాడిన పాఠశాలలు, నేడు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. సాధారణంగా ప్రాథమిక పాఠశాలలు బలోపేతం చేయటంలో ప్రధానమైన భాగం, పూర్వ ప్రాథమిక పాఠశాలలను, ప్రాథమిక పాఠశాలలో విలీనం చేస్తారు. కానీ గత ప్రభుత్వం ఆ విధంగా చేయకుండా, ప్రాథమిక పాఠశాలలను విభజించారు. మూడు, నాలుగు ఐదు తరగతులను, ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఫలితంగా ఉన్నత పాఠశాల విద్యార్థులతో 3, 4, 5 తరగతి విద్యార్థులు సర్దుబాటు కాకపోవడం, అదే సమయంలో, ఉపాధ్యాయులు, బోధనాస్థాయిలో, మూడు, నాలుగు, ఐదో తరగతి స్థాయికి వెళ్లి చెప్పలేకపోవడం, ఫలితంగా మూడు ,నాలుగు, ఐదు తరగతుల విద్యార్థుల అభ్యసనా స్థాయిలు బాగా దిగజారాయి. నిజానికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో చెప్పించవలసిన బోధన, పాఠశాల సహాయకులతో చెప్పించడం ఫలితంగానే, వారిలో అభ్యసన స్థాయిలు బాగా వెనకబడినాయి. అదే సమయంలో, తల్లిదండ్రులు కేవలం ఒకటి,రెండు తరగతుల కోసం ప్రాథమిక పాఠశాలలో చేర్చడం ఇష్టం లేక, వారు ప్రైవేట్ పాఠశాలకు చేర్పించడం జరిగినది. ఇలాంటి విధానాలు వల్లనే, ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల లేమితో, కళాహీనంగా తయారు అవుతున్నాయి. ప్రస్తుత పాలకులు ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన జీవో 117రద్దుచేయటంలో భాగంగా, ప్రాథమికంగా కొన్ని నిబంధనలు తయారు చేసి ,అధికారుల ద్వారా క్షేత్రస్థాయి అభిప్రాయం కోరారు. అభిప్రాయం కోరటం మంచిదే. కానీ ప్రాథమికంగా ఇచ్చినటువంటి నిబంధనలో,అనేక నిబంధనలు ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంఅవుటకు సహకరించేటట్లు లేవు. ప్రాథమిక నిబంధనలు ప్రకారమే, కొత్త పాఠశాలలు రూపుదిద్దితే ,గత పాలకుల నిర్ణయాలకు,ఈ పాలకుల నిర్ణయాలకు పెద్దగా తేడా ఉండదు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావు. కనుక ప్రాథమిక నిబంధనలు మార్చవలసిన అవసరం ఉన్నది.ప్రాథమిక నిబంధనలో, కొత్తగా నాలుగు రకాల పాఠశాలలుగా రూపుదిద్దుతామని ప్రకటించారు.అందులో మొదటిది ఫౌండేషన్ పాఠశాలలు, పాఠశాలలో నర్సరీ, యూకేజీ ఎల్కేజీలతోపాటు, ఒకటి రెండు తరగతులు ఉంచుతున్నారు. ఇందులో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:30 అని ప్రాథమిక నిబంధనలో పేర్కొనడం జరిగినది. రెండోరకం పాఠశాలలు,బేసిక్ ప్రైమరీ పాఠశాలలు. ఇందులో పూర్వ ప్రాథమిక విద్యార్థులతోపాటు ఒకటినుంచి ఐదవ తరగతులవరకు ఉంచుతున్నారు. ఇందులో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20గా నిర్ణయించారు. ఇది ఎంతవరకు సబబు? ఒక పాఠశాలకేమో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:30గా, మరో రకమైన పాఠశాలకు ఏమో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20గా నిర్ణయించడం ఎంత వరకు సబబు? ఇలాంటి విధానాలు వలన వేలాది పాఠశా




లలో ఏకోపాధ్య పాఠశాలలుగా తయారవుతాయి. ఫలితంగా విద్యార్థుల అభ్యసన భారీగా దిగజారుతుంది. కనుక తుది నిబంధనలలో, ఈ రెండు రకాలపాఠశాలల్లో కూడా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20గా నిబంధనలు ఉంచాలి. అలాగే మూడో రకమైన పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అధికారులు, ఈ రకమైన పాఠశాలలను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తంచేస్తున్నారు. కానీ ఇందులో కూడా ప్రాథమికంగా ఇచ్చిన నిబంధనలో, కొన్ని సవరించవలసిన అవసరం ఉన్నది. ముఖ్యంగా ఈపాఠశాలల్లో, ప్రతి గ్రామపంచాయితీకి,కనిష్టంగా ఒకటి, అలాగే విద్యార్థుల సంఖ్యను బట్టి ఎక్కువ సంఖ్యలో కూడా ఏర్పాటు చేస్తామని, ప్రాథమిక నిబంధనలో తెలియజేయడం జరిగినది. ఇది మంచి పరిణామమే. కానీమోడల్ ప్రైమరీపాఠశాలలో, 120మంది విద్యార్థులు ఉంటేనే, ప్రధానోపాధ్యాయుని పోస్టులు మం జూరు చేస్తామని ప్రాథమిక నిబంధనలో ఉంచడంసరికాదు. ప్రతి మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో, ప్రధానోపాధ్యాయుని పోస్టులు మంజూరు చేయవలసిన అవసరం ఉన్నది. నాలుగవ రకమైన పాఠశాలైనటు వంటిఉన్నత పాఠశాలలో, 75మంది విద్యార్థులకు ప్రధానో పాధ్యాయుని పోస్టును వ్యాయామ ఉపాధ్యాయుని నియ మిస్తామని తెలపడం హర్ష ణీయమే. మోడల్ ప్రైమరీ పాఠశాలలో 120మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పోస్టులుఇచ్చి, అదే ఉన్నత పాఠశాలలో, 75 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుని పోస్ట్ మంజూరు చేయడం సరికాదు. మనోవిజ్ఞానశాస్త్రం ప్రకారం, ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచడం, ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకన్నా చాలా కష్టమైన పని. అలాంటిది మోడల్ ప్రైమరీ పాఠశాలలలో 120 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుని పోస్ట్ ఇవ్వడం, అదే సమయంలో, ఉన్నత పాఠశాలలో మాత్రం, 75 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుని పోస్టు ఇవ్వడం సమంజసం కాదు. కనుక తుది నిబంధనల లో ప్రతి మోడల్ ప్రైమరీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుని పోస్ట్ ఇవ్వడం ఆవశ్యకం. అలాగే, ప్రాథమిక నిబంధనలలో, హై స్కూల్ ప్లస్ పాఠశాలను రద్దుపరిచి ,ఇంటర్మీడియట్ కళాశాలలుగా మార్చారు. ఇది పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు నష్టం చేకూరుస్తుంది. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు 20సంవత్సరాలు పైబడి పనిచేస్తున్నప్పటికీ, కనీసం ఒక స్థాయి పైబడికూడా, ప్రమోషన్ పొందలేకపోతున్నారు. ఈ విధంగా ఇంటర్మీడియట్ కళాశాలగా మార్చడం వలన ,కొంతమంది కలిగే ప్రయోజనం లేకుండా పోతుంది, కనుక వాటిని హైస్కూల్ ప్లస్ పాఠశాలలుగా కొనసాగించి, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి, అందులో బోధన చేపించవలెను. అలాగే, ప్రాథమికోన్నత పాఠశాలలో తగు మోతాదుల్లో విద్యార్థులు ఉన్నట్లయితే, పాఠశాల సహాయకులను నియమించి, వాటిని కొనసాగించవలసిన అవసరం ఉన్నది. ఇది ప్రస్తుత పాలకులు117 జీవోను రద్దుపరచి అమలుపరిస్తే బాగుంటుంది. ఇక్కడ ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి అంటే, ఈ విధంగా పాఠశాలలను తయారుచేసి ,ఉపాధ్యాయులకు బోధనకు మాత్రమే పరిమితం చేయాలి. అప్పుడే విద్యార్థులకు అభ్యసన ఆశించిన స్థాయిలోఉంటాయి. అదే సమయంలో, విద్యా సంవత్సరానికి ఆటంకం కలగకుండా, ఉపాధ్యాయులకుఆటంకం కలిగించకూడదు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వానికి కావలసిన విద్యార్థుల విద్యా సంబంధమైన సమాచారం బోధనేతర సిబ్బంది ద్వారా మాత్రమే సేకరించాలి. ఉపాధ్యాయులకు నిరంతరం బోధనేతర కార్యక్రమాలు ఇవ్వడం వలన, అంతిమంగా విద్యార్థులకు నష్టం చేకూరుతుంది. ఈ విషయం తెలిసినప్పటికీ, మండల విద్యాశాఖ అధికారులు, విద్యార్థులకు నష్టం జరుగుతుంది అనే అభిప్రాయం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకపోవడం ఫలితంగానే, ప్రభుత్వ పాఠశాలలు చాలా బలహీనంగా తయారవుతున్నాయి. ప్రస్తుత పాలకులు, వీటి మీద దృష్టి పెట్టి, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేసి, విద్యార్థులకు భవిష్యత్తులో పనికివచ్చే కరికులాన్ని పొందుపరిచి,చక్కని బోధనా విధానాలను అమలుపరిచి ,ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కేవలం బోధనకు మాత్రమే స్వేచ్ఛను ఇచ్చి, బ్యూరోక్రసీ అనవసరంగా విద్య వ్యవస్థలో జోక్యం చేసుకోకుండా, స్వతంత్ర వ్యవస్థగా ఉంచగలిగితే, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి. కొత్త పాలకులు ఆ విధంగా కృషి చేయాలి. ●

# వంద వసంతాల రైల్వే విద్యుద్దీకరణ

షేక్ అక్బర్ హుస్సేన్

భారతీయ రైల్వేలో విద్యుత్ రైలు మార్గాల శకం ప్రారంభమై వంద వసంతాలు. భారతదేశంలో బొంబాయి వీటి-కుర్లా టెర్మినస్ మధ్య 16రూట్ కి.మీలతో 1925 ఫిబ్రవరి 3న తొలి విద్యుత్ రైలు ప్రప్రథమంగా ప్రారంభమైంది. విద్యుదీకరణ ప్రస్థానానికి ఈ ఏడాది ఫిబ్ర వరి 3తో వందేళ్లు అవుతుంది. భారతీయ రైల్వేలో 66, 504 రూట్ కి.మీల మేర రైలు మార్గం ఉండగా ఇప్పటి వరకు 64,547కి.మీలను(97.06శాతం) విద్యుదీకరణ పూర్తి అయ్యింది. మిగిలిన రైలు మార్గాన్ని విద్యుదీకరించే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మనం 21వ శతా బ్దంలో ముందుకు వెళ్తున్న ప్రస్తుత తరుణంలో భారతీయ రైల్వే సైతం 2030నాటికి నికర జీరో కార్బన్ ఉద్గారాల లక్ష్యంతో మెరుగైన వృద్ధి కోసం పర్యావరణ అనుకూల రవాణా నెట్‌వర్క్ వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన అవ సరాన్ని గుర్తించి అనేక చర్యలకు శ్రీకారం చుట్టింది. తద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు ఇంధనం అదనపు




భారాన్ని తగ్గిస్తోంది. భారతీయ రైల్వేలోని 18రైల్వే జోన్‌లకు గాను,12 రైల్వే జోన్ లలో విద్యుదీకరణ వందశాతం పూర్తి కాగా, మిగిలిన జోన్‌లలో సైతం వంద శాతానికి అతిచేరు వలో ఉన్నాయి.

**100శాతం విద్యుదీకరణ పూర్తయిన రైల్వే జోన్‌లు :**సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే-2,446కి.మీ,నార్తర్న్ రైల్వే-7,272కి.మీలు, ఈశాన్య రైల్వే-3,225కి.మీలు, పశ్చిమ మధ్య రైల్వే- 3,129కి.మీలు,నార్త్ సెంట్రల్ రైల్వే-3,286కి.మీలు, తూర్పు తీరరైల్వే-3,017కి.మీలు, సెంట్రల్ రైల్వే-4,002 కి.మీలు,ఈస్టర్న్ రైల్వే-2,817 కి.మీలు,కొంకణ్ రైల్వే-738 కి.మీలు, మెట్రో రైల్వే-50 కి.మీలు,ఆగ్నేయ రైల్వే-2,753 కి.మీలు,ఈస్ట్ సెంట్రల్ రైల్వే-4,222కి.మీలను వందశాతం విద్యుదీకరించారు. కాగా దక్షిణ మధ్య రైల్వేలో 6,225కి. మీలకుగాను 6,159 కి.మీలను (99శాతం)విద్యుదీకరించారు.

**దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో :** అలాగే తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో మొత్తం 6,610రూట్ కి.మీలు ఉండగా,డిసెంబరు 15వరకు 6,181కిలోమీటర్లను విద్యుదీకరించారు. గుంతకల్లు డివిజన్‌లో 1,452కిలోమీటర్లకు గాను 1,431కి.మీలను(99శాతం) విద్యుదీకరణ పూర్తయ్యింది. సికింద్రాబాద్ డివిజన్‌లో 1,612కి.మీలకు గాను 1,546కి.మీలు(96శాతం),విజయవాడ డివిజన్‌లో 1,071గాను 1,024కి.మీలను(96శాతం), గుంటూరు డివిజన్‌లో706కి.మీలకుగాను 678కి.మీలను (96శాతం), హైదరాబాద్ డివిజన్‌లో 783కి.మీలకు గాను 690కి.మీలను (88శాతం),నాందేడ్‌డివిజన్‌లో 986కి.మీలకు గాను 812కి.మీలు(82శాతం)చొప్పున మొత్తం6,610కి.మి 6,181 కి.మీలలో విద్యుత్ రైలు మార్గం పూర్తి చేశారు. ●

# తిరుమల కొండ ప్రక్షాళన జరిగేనా?

రత్నకుమారి

అయ్య వచ్చిన అంతే అబ్బవచ్చినా అంతే అనిసామెత. ఇటీవల కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువున్న తిరుమలక్షేత్రంలో జరుగుతున్న వ్యవహారాలు సామాన్య భక్త జనకోటికి సంతోషాన్ని కలిగించేలాలేవు.కొండ కచో తిరుమల క్షేత్ర పవిత్రత, ప్రతిష్ట మంటకలిసిపోయే విధంగా వ్యవహారాలు సాగడం దురదృష్టకరం. గత కొన్ని నెలలుగా శ్రీవారి క్షేత్రంలో జరగకూడని దుస్సంఘటనలు జరుగుతున్నాయి. ఎవరు ఊహించనివిధంగా హఠాత్తుగా జరిగే దుర్ఘటనలు కొన్ని. అంకిత భావంతో విధులు నిర్వర్తించవలసిన తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులు తమ విధులపట్ల పూర్తిగా నిర్లక్ష్యభావంతో ఉదాసీన వైఖరితో ఉండటం వల్ల జరిగే దుర్ఘటనలు మరికొన్ని. భక్తుల ముసుగులో తిరుమల చేరిన ఆకతాయిలు చేసే చేష్టలవల్ల ఇంకొన్ని ఆచారాలు, ధారావాహికంగా వెలువడి తిరుమల ప్రతిష్టకు కళంకం తెచ్చి పెడుతున్నవి. హిందువులే కాదు హైందవేతరులు కూడా పవిత్రంగా భావించేది శ్రీనివాసుడి లడ్డూ ప్రసాదం. అటు వంటి లడ్డు ప్రసాదం తయారీకి జంతువుల కొవ్వు అవశేషా లతో కల్తీచేసిన నెయ్యిని ఉపయోగించారన్న వార్త వెలువడి అఖిలాండ కోటి భక్త జనావళిని భయాందోళనకు గురిచేసిం ది. అంతేకాదు లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సంచలనాన్ని కలిగించింది కూడా. చివరకు ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసు కొని నిజనిర్ధారణకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. మొన్నటికి మొన్న వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వారా దర్శనం టోకెన్ల కొరకు కౌంటర్ల వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు తమ విలువైన ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చింది. మరెందరో భక్తులు గాయపడ్డారు. ఈ తొక్కిసలాట పూర్తిగా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్లక్ష్య వైఖరి కారణంగా జరిగిందనే ప్రచారం టీటీడీ బోర్డు ప్రతిష్టను దెబ్బతీసింది. ఇటీవలే ఏడుకొండల స్వామి దర్శనానికి కుటుంబంతోపాటు వచ్చిన ఓ చిన్నారి వసతిభవనం రైలింగ్ పైనుంచి జారిపడి మృతి చెందిందనే వార్త కూడా కలవరాన్ని కలిగించింది. అలాగే శ్రీవారి పరకామణిలోనుంచి 100 గ్రాముల బంగారు బిస్కట్ను తస్కరిస్తూ దేవస్థానం తాత్కాలిక ఉద్యోగి సెక్యూరిటీకి దొరికిపోయాడు. ఇలా ఆ ఉద్యోగి దాదాపు 45లక్షలు విలువ చేసి వెండి బంగారు ఆభరణాలను ఇంతవరకు దొంగలించాడట. ఇటీవలే ఇతర రాష్ట్రాల భక్తులకు ప్రత్యేక దర్శనం నకిలీ టోకెన్లు అంటగట్టి ఇద్దరూ టీటీడీ ఉద్యోగులు దొరికిపోయారు. తాజాగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన పర్యాటకుల గుంపు అలిపిరి తనిఖీలను దాటుకొని శ్రీవారి ఆలయం చెంతనఉన్న రామ్ బగీచా వసతిగృహం వెలుపల పలావును కోడిగుడ్డు కూరతో బహిరంగంగా భుజించడం సంచలనాన్ని కలిగించిం ది. ఈ దురాగతాన్ని చూసిన కొందరు భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ గుంపును అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఇంకా భక్తుల ముసుగులో ఉన్న ఆకతాయిలు సోషల్ మీడియాలో వ్యూస్ కోసం నిబంధనలకు విరుద్ధంగా శ్రీవారి మాడవీధులలో రీల్స్ చేయడం విమర్శల దాడి



ప్రారంభమయ్యాక క్షమాపణలు చెప్పడం ఒక ప్రహసనంగా మారుతోంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ కాలంలోనే తిరుమల క్షేత్రంలో ఇటువంటి దుస్సంఘటనలు జరుగుతున్నావనడం సమంజసం కాదు.ఈ అపప్రదను పూర్తిగా కూటమి ప్రభుత్వం, టిటిడి బోర్డుకు ఆపాదించడం సహేతుకం కూడా కాదు. ఇలావిమర్శించడం సమంజసం కాదు. ఇటువంటి దుస్సంఘటనలు ఇతర పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు, ప్రభుత్వ ముఖ్యనాయకుల అనుచరులే తిరుమల తిరుపతి పాలకమండలి సభ్యులుగా ఉన్నప్పుడు కూడా జరిగాయి. గత విషయాలు మచ్చుకు కొన్ని తిరుమలకు వచ్చే ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులకు ఇచ్చే టికెట్ల వెనుక భాగంలో క్రైస్తవ మత ప్రచారం జరిగేలా టికెట్లను ముద్రించడం జరిగింది. ఏకంగా టీటీడీ వెబ్సైట్లోనే క్రీస్తు బోధనలు ఉన్నట్టు మీడియాలో ప్రచారం జరిగింది. తిరుమల వైభవాన్ని ఏడుకొండలకు కాకుండా రెండు కొండలకు మాత్రమే పరిమితం చేస్తారన్న ప్రచారం జరిగింది. అంతేకాకుండా గత కాలంలో అలిపిరి నడకదారి భక్తులపై మొదటిసారిగా చిరుతపులులు దాడి చేయడం జరిగింది. చిరుతలను ఎదుర్కోవడానికి నడకదారి భక్తులకు అప్పటి టీటీడీ బోర్డు కర్రలను ఇవ్వాలని వింతైన ప్రయత్నం చేసింది. ఏతావాత తేలేదేమిటంటే తిరుమల క్షేత్ర పవిత్రతను మంట కలిపే వ్యవహారాలు అప్పుడు ఇప్పుడు జరుగుతూనే ఉన్నాయి. శ్రీవారి భక్తుల మనోభావాలు గాయపడుతూనే ఉన్నాయి.అయితే ఇలా ఎంతకాలం? ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తిరుమలను ప్రక్షాళన చేయాలని కసరత్తు చేసిన బి.ఆర్ నాయుడుని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు అధ్యక్షుడిగా ఎంపిక చేసినప్పుడు బి ఆర్ నాయుడు ఎంపిక సరైనదేనని మెజారిటీ ప్రజలు భావించారు. అయితే బిఆర్ నాయుడుశ్యామలరావు కృష్ణార్జునుల వ్యవహరించి పరస్పర సహాయ సహకారాలతో తిరుమల కొండను ప్రక్షాళన చేస్తారని, టీటీడీని గాడిలో పెడతారని ఆశించిన వారికి మాత్రం నిరాశే ఎదురైంది. గతం గతః. ఇకపోతే ప్రస్తుత టీడీపీ బోర్డు కానీ భవిష్యత్తులో ఏర్పాటు కాబోయే తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి కానీ శ్రీవారి క్షేత్రంలో ఉద్దేశ పూర్వకంగా జరిగే అవకతవకలను పసిగట్టి గట్టిగా అరికట్టే ప్రయత్నంచేయాలి. దీనికి ముందు తిరుమల తిరుపతి పాలకమండలి కానీ టీటీడీ ఉన్నతాధికారుల మధ్య సమన్వయం పెంపొందించుకొని కలియుగదైవం వెంకట చలపతి దేవాలయ ప్రతిష్టను పెంపొందించడానికి ఉమ్మడిగా కృషి చేయాలి. అలిపిరి నుంచి చట్టవ్యతిరేకమైన వస్తువులు కానీ, తిరుమలలో భుజించకూడని ఆహార పదార్థాలు కూడా కానీకొండపైకి రాకుండా సమర్థవంతంగా అడ్డుకోవాలి. టీటీడీ ఉద్యోగ వ్యవస్థలో క్రమశిక్షణను పెంపొందించి అంకితభావంతో తమ విధులను నిర్వర్తించేలా పర్యవేక్షణ చేయాలి. వారికి భక్తుల పట్ల మానవత దృక్పథంతో వ్యవహరించేలా శిక్షణను ఇవ్వాలి. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలి. దేవ దేవుడికి జరగాల్సిన అభిషేకాలుకానీ, సేవలనుకానీ, ఉత్సవాలను కానీ ఆగమ శాస్త్రానుసారం క్రమబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి. శ్రీవారి ఆస్తులను అక్రమంగా తిని బలిసిన వారి ఆట కట్టించాలి. శ్రీవారికి దేశం నలుమూలలా ఉన్న ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా సమర్థంగా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి. దేవదేవుడి దర్శనానికి వచ్చే సామాన్యుడికి తగినవసతి కల్పించాలి.ఆకలిని తీర్చడానికి తిరుమల అంతట అన్నప్రసాద కేంద్రాలను విరివిరిగా ఏర్పాటు చేయాలి. టీటీడీబోర్డు సమస్తం విఐపి సేవలకే అంకితం కాకుండా సామాన్యుడి ఇక్కట్లను పరిగణలోకి తీసుకోవాలి. ●

# అమెరికా సుంకాలపై చైనా ఆగ్రహం

## డబ్ల్యుటిఒలో సవాల్ చేస్తామని హెచ్చరిక



**బీజింగ్, ఫిబ్రవరి 2:** చైనాపై సుంకాలు విధించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మండిపడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో వాషింగ్టన్ నిర్ణయాన్ని సవాల్ చేస్తామని ఆ శాఖ ఆదివారం ప్రకటించింది. కెనడా, మెక్సికోపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ శనివాయం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సుంకాలు మంగళవారం నుంచి అమలులోకి రానున్నాయి. దీనిపై చైనా స్పందిస్తూ అమెరికా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొంది. దేశ ప్రయోజనాలు, హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. 'అమెరికా తప్పుడు పద్ధతులు అనుసరిస్తోంది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాం. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఈ చర్యలతో అమెరికా సమస్యలు తీరకపోగా.. సాధారణ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్య సహకారాలు దెబ్బతింటాయి. ఈ విషయాన్ని సహేతుక దృష్టితో వాషింగ్టన్ చూడాలి. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారి బెదరించకుండా.. తన దేశంలో ఫెంటనిల్ వంటి సమస్యలను సొంతంగా పరిష్కరించుకోవాలి. తప్పుడు పద్ధతులను సరిచేసుకోవాలని అమెరికాను కోరుతున్నాం' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో కోరింది.

అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రధాన ప్రచారాస్త్రాల్లో ఫెంటనిల్ అంశం ఒకటి. ఈ డ్రగ్‌ను తమ దేశంలోకి డంప్ చేస్తోందన్న ఒక్క కారణంతోనే చైనాపై 25 శాతం అదనపు టారీఫ్‌ను విధిస్తానని నాడే ఆయన హెచ్చరించారు. కేంద్ర నాడీ వ్యవస్థపై పనిచేసే ఈ నొప్పి నివారిణి.. హెరాయిన్ కంటే 50 రెట్లు శక్తిమంతమైనదని నిపుణులు చెబుతున్నారు. రెండు మిల్లీ గ్రాముల డోసు కూడా ప్రాణాంతకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి బానిసలుగా మారిన వారు తప్పుడు చీటీలతో ఔషధ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. దీనిని ఇతర మాదక ద్రవ్యాలతో కలిపి కూడా వాడుతున్నట్లు తెలుస్తోంది.

2022 సంవత్సరంలో ఫెంటనిల్ అధిక డోస్ కారణంగా 1,07,941 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికా సిడిసి పేర్కొంది. అంటే సగటున రోజుకు 295 మంది దీని కారణంగా చనిపోతున్నారు. 2023లో ఈ సంఖ్య 1,10,640 ఉండొచ్చని అంచనా వేస్తోంది. 2019లో కొందరు అమెరికా అధికారులు ఈ డ్రగ్‌ను సామూహిక విధ్వంసక ఆయుధంగా వర్గీకరించాలని కోరినట్లు న్యూయార్క్ పోస్టు కొన్ని నెలల కిందట ప్రచురించిన కథనంలో పేర్కొంది.



# ఢిల్లీలో త్వరలో కొత్త వసంతం

## మార్చి 8న తలా రూ. 2,500 మహిళల ఖాతాల్లో :ప్రధాని మోడీ హామీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** ఢిల్లీలో త్వరలో కొత్త వసంతం రాబోతున్నదని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఈసారి ఢిల్లీలో బిజెపిదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 8న బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఖాతాల్లో రూ. 2,500 చొప్పున పడతాయని హామీ ఇచ్చిరు. ఆర్కేపురం ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రధాని మోడీ ఆప్ ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తోందని విమర్శించారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో ఏ ఒక్క గుడిసెను తొలగించబోని, సంక్షేమ పథకాలను రద్దు చేయబోమని, అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని ప్రధాని స్పష్టం చేశారు. ఆరోగ్య రంగంలోనూ 'ఆపద' ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, ప్రజలను దోచుకున్న వారు తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచిచన తర్వాత నెహ్రూ హయాంలో రూ. 12 లక్షల ఆదాయం ఉంటే నాల్గో వంతు వేతనాన్ని ప్రభుత్వం ట్యాక్స్ రూపంలో వెనక్కి తీసుకునేదని, ఇందిర హయాంలో అయితే రూ. 12 లక్షల ఆదాయంపై దాదాపు రూ. 10 లక్షల ట్యాక్స్ రూపంలో పోయేవని ఆయన గుర్తు చేశారు.

పది పన్నెండేళ్లకు ముందు కాంగ్రెస్ ప్రభు త్వంలో రూ. 12లక్షలు సంపాదిస్తే రూ. 2.60 లక్షలు ట్యాక్స్ రూపంలో ఇవ్వాల్సి వచ్చేదని, బిజెపి తాజా బడ్జెట్ తర్వాత యేడాదికి రూ. 12 లక్షల సంపాదించే వారు కూడా ఒక్క రూపాయి పన్నుకట్టాల్సిన అవసరంలేదనిప్రధాని చెప్పారు. సోమవారం వసంత పంచమి వస్తోందని, ఆ తర్వాత వాతావరణంలో మార్పు ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 5న ఢిల్లీలో అభివృద్ధికి సంబంధించిన కొత్తవసంతం రానుందని చెప్పారు. ఢిల్లీలో ఓటింగ్‌కు ముందే చీపురు పుల్లలు ఒక్కొక్కటి ఊడిపోతున్నాయని, ఆప్ నాయకులు ఆ పార్టీని వదిలి వెళ్తున్నారని అన్నారు.



## పెళ్లి వేడుకలో వరుడి డ్యాన్స్.. పెళ్లినే రద్దుచేసిన వధువు తండ్రి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** పెళ్లిసంబరాల్లో నృత్యాలు, బంధువులుస్నేహితులతో సరదాలు సహజమే. ఇదే విషయంలో ఒక వరుడికి ఊహించని విదంగా షాక్ తగిలింది. పెళ్లి సంబరాల్లో సరదాగా చేసిన నృత్యం ఏకంగా వివాహం రద్దుకు కారణమైంది. ఢిల్లీలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒక వరుడు తన పెళ్లి ఊరేగింపుతో ఢిల్లీలోని వివాహ వేదిక వద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలో ఆతడిస్నేహితులు డ్యాన్స్ చేద్దామంటూ పిలిచారు. ఈ క్రమంలోనే ఛోళీకేపీఛే క్యాహై అనే బాలివుడ్‌పాటకు కాలుకదిపాడు. కానీ ఈ డ్యాన్సే ఆతడిపాలిట ఆశనిపాతమైంది. వరుడి నృత్యం అనుచితంగా ఉందంటూ ఆతడి కాబోయే మామ వెంటనే వేడుకలను నిలిపివేసాడు. పెళ్లిరద్దు చేస్తున్నట్లుప్రకటించాడు. వరుడు తన తీరుతో కుటుంబ విలువలను అవమానించాడని చెప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇదంతా సరదాకోసమే చేశామంటూ ఆతడు వివరణ ఇచ్చేందుకు యత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ పరిణామంతో వధువుసైతం కంట తడిపెట్టుకుంది. ఇపుడు ఈ డ్యాన్స్ వ్యవహారం మొత్తం వైరల్ అవుతోంది. వధువు తండ్రి సరైన నిర్ణయమే తీసుకున్నారని కొందరు వత్తాసు పలికితే అటువంటి పాటలుంటే నేనుకూడా డాన్స్ చేసేవాడినంటూ మరికొందరు పోస్టులు పెట్టారు.

## కాలువలోకి దూసుకు పోయిన పెళ్లి జీపు

# తొమ్మిది మంది మృతి, మరికొందరు గల్లంతు

**చండీగఢ్, ఫిబ్రవరి 2:** రాష్ట్రంలోని ఫతేహాబాద్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పెండ్లి వేడుక ముగించుకుని తిరిగి వస్తుండగా ఓ జీపు అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోయింది. దీనితో 9 మంది మరణించారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. 14 మందితోకూడిన బృందం పంజాబ్‌లోని ఫజిల్కాలో జరిగిన వివాహానికి హాజరై క్రూజర్‌లో తమ స్వస్థలాలకు తిరుగు పయనం అయ్యారు. ఈ క్రమంలో ఫతేహాబాద్‌లోని భాఖాడా కాలువ దాటుతుండగా అదుపు తప్పిన జీపు బ్రిడ్జిపైనుంచి నీళ్లలో పడిపోయింది. దీనితో తొమ్మిది మందిచనిపోయారు. మరో ముగ్గురు గల్లంతుకాగా ఇద్దరు బతికే ఉన్నారని జిల్లా సబ్‌కలెక్టర్ జగదీస్ చంద్ర చెప్పారు. గల్లంతైన వారికోసం ఎన్డీఆర్‌ఎఫ్ ఎస్డీ



ఆర్‌ఎఫ్ సిబ్బందిముమ్మరంగా గలింపు కొనసాగిస్తున్నారు. మృతుల్లో ఏడాదిన్నర చిన్నారితో పాటుపదేళ్ల బాలిక, ఒక మహిళ కూడా ఉన్నారు. కాలువలోనీటిప్రవాహం తకునకవైతే గాలింపు సులభమవుతుందని దీనికోసం నీటిపారుదలశాఖ అధికారులను సంప్రదించనున్నట్లు తెలిపారు.

## అదుపు తప్పి లోయలో పడిపోయిన బస్సు

# ఏడుగురు మృతి, 15 మందికి గాయాలు



**డాంగ్,(గుజరాత్), ఫిబ్రవరి 2:** రాష్ట్రంలోని డాంగ్ జిల్లాలోని సపుతర హిల్‌స్టేషన్‌పరిధిలోజరిగిన ఘోరరోడ్డుప్రమాదంలో ప్రైవేటు బస్సు అదుపు తప్పి లోయలోకిపడిపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురుప్రాణాలు కోల్పోగా 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం తెల్వాఆరుజామున 5.30 గంటలకు బస్సు అదుపు తప్పి 200 అడుగులలోయలోకి దూసుకుపోయింది. బ్రేకులు ఫెయిల్ కావడంవల్లనే బస్సు అదుపు తప్పి లోయలో పడిందనిపోలీసులు తెలిపారు. ప్రమాదంలో డ్రైవర్‌సహా ఏడుగురు చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు యాత్రీకులు మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్‌నుంచి గుజరాత్‌లోని ద్వారకకు వస్తుండగా ఈ ప్రమాదంజరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితులంతా మధ్యప్రదేశ్‌లోని గుణ, శివపురి, అశోక్‌నగర్‌జిల్లాలకు చెందినవారని డాంగ్‌జిల్లా కలెక్టర్ మహేశ్‌పటేల్ తెలిపారు. వారంతా 2025 డిసెంబరు 23న మనదేశంలోని వివిధ రాష్ట్రాల్లోగల పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు నాలుగు వేర్వేరు బస్సుల్లో బయలుదేరారని చెప్పారు. వాటిలో ఒక బస్సు అదుపుతప్పి లోయలోపడిపోయింది. బ్రేక్‌ఫెయిల్యూర్‌వల్లనే డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

# ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఇయల్ జమీర్

**టెల్‌అవీవ్, ఫిబ్రవరి 2:** ఇజ్రాయెల్ సైన్యాధిపతిగా మాజీ మేజర్ జనరల్ ఇయల్ జమీర్ నియమితులయ్యారు. ఈ మేరకు దేశ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. 'ఇజ్రాయెల్ ఆర్మీ తదుపరి చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా మాజీ మేజర్ జనరల్ ఇయల్ జమీర్ నియమితులయ్యారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రక్షణ మంత్రి కాట్జ్‌లు సంయుక్తంగా ఆయనను ఎంపిక చేశారు' అని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. 2023 అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడుల్లో టెల్‌అవీవ్ పౌరులు 1,200 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మిలిటెంట్ సంస్థ దాడిని నిరోధించడంలో భద్రతా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ.. ఇజ్రాయెల్ సైన్యాధిపతి (చీఫ్ ఆఫ్ స్టాఫ్) లెఫ్టినెంట్ జనరల్ హెర్జీ హాలేవీ ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. మార్చి 6న తాను బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ తన కొత్త సైన్యాధిపతిని ప్రకటించింది. ఈ సందర్భంగా హాలేవీ నూతన సైన్యాధిపతి



ఇయల్‌కు అభినందనలు తెలిపారు.

**ఎవరీ ఇయల్ జమీర్..** ఇజ్రాయెల్ సైన్యంలో 28 యేళ్లు పనిచేసిన అనుభవం జీమర్‌కు ఉంది. 2018 నుంచి 2021 వరకు మిలిటరీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. దక్షిన కమాండర్లకు సైతం ఆయన నాయకత్వం వహించారు. ఈ విభాగం గాజా సరిహద్దు సహా సైనిక కార్యకలాపాలు, రక్షణకు బాధ్యతలను పర్యవేక్షిస్తోంది. జమీర్ గతంలో నతన్యాహుకు సైనిక కార్యదర్శిగానూ విధులు నిర్వర్తించారు.

# రోహిత్ చోప్రాపై ట్రంప్ సర్కారు వేటు

## బైడెన్ హయాంలో వినియోగదారుల రక్షణ బ్యూరో డైరెక్టర్



**పామ్ బీచ్, ఫిబ్రవరి 2:** వినియోగదారుల ఆర్థిక రక్షణ బ్యూరో డైరెక్టర్‌గా బైడెన్ హయాంలో నియమితుడైన భారత సంతతి అధికారి రోహిత్ చోప్రాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేటు వేశారు. క్రెడిట్ రిపోర్టుల నుంచి వైద్య రుణాలను తొలగించడం వంటి సంస్కరణలను డెమోక్రటిక్ ప్రభుత్వంలో చోప్రా హయాంలో తీసుకొచ్చారు. ఇంతకాలం తమ ఆలోచనలు, అనుభవాలు పంచుకున్న వారందరికీ రోహిత్ చోప్రా తన సామాజిక మాధ్యమ పోస్టులో ధన్యవాదాలు తెలిపారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడైనప్పుడు చోప్రాను ఫెడరల్ ట్రేడ్ కమిషన్ డెమోక్రటిక్ సభ్యుడిగా ఎంచుకున్నారు. తాజాగా ట్రంప్ విధానాలకు అనుగుణంగా అనుగుణంగా పని చేసేందుకూ చోప్రా నేతృత్వంలోని బ్యూరో సిద్ధమైనా.. అంతలోనే ఆయనను తొలగిస్తున్నట్లు ఇ మెయిల్ అందింది.

# భర్తతో కిడ్నీ అమ్మించి ప్రియుడితో పరార్!

**కోల్‌కత్తా, ఫిబ్రవరి 2:** మాయమాటలు చెప్పి ఒక మహిళ తన భర్తతో కిడ్నీని అమ్మించి ఆ డబ్బుతో తన ప్రియుడితో చెక్కేసింది. ఈ ఘటన బెంగాల్‌లోని హౌరా జిల్లాలో చోటుచేసుకుంది. ఒక మహిళ తమ కుమార్తె చదువు వివాహానికి కావాల్సిన డబ్బుకోసం కిడ్నీ అమ్మాలని తన భర్తకు సూచించింది. అలాచేస్తే తమ కుటుంబానికి ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయని నమ్మించింది. భార్య పట్టుబట్టడంతో చేసేదేమీ లేక భర్త తన కిడ్నీని రూ.10 లక్షలకు విక్రయించాడు. దీనితో తమ ఆర్థికపరిస్థితి మెరుగు పడుతుందని ఆశించాడు. ఆతడి భార్య మాత్రం ఈ సొమ్ము మొత్తం రూ.10 లక్షలు తీసుకుని తనకు ఫేస్‌బుక్‌లో పరిచమం అయిన రవిదాస్ అనే వ్యక్తితో పరారయింది. విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. వారి సాయంతో వీరిద్దరూ ఉన్న ప్రాంతానికి వెళితే ఆమె తన భర్తతో మాట్లాడటానికి నిరాకరించింది. విడాకులిస్తానని హెచ్చరించింది. తనభార్య మాటలు నమ్మి మోసపోయానని ఎలాగైనా తనకు తన పిల్లలకు న్యాయం చేయాలని బాధిత భర్త ఇపుడు పోలీసులకు మొరపెట్టుకున్నాడు.

# బాబా రామ్‌దేవ్‌పై అరెస్టు వారంటు

**పాలక్కడ్(కేరళ), ఫిబ్రవరి 2:** యోగా గురువు బాబా రామ్‌దేవ్‌పై కేరళకోర్టు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారంట్ జారీచేసింది. బాబా రాందేవ్ సహచరుడు, పతంజలి ఆయుర్వేద సంస్థ ఎండి ఆచార్య బాలకృష్ణపైనా వారంట్ జారీచేసింది. పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, అవాస్తవాలనుప్రచారం చేసారన్న ఆరోపణలువచ్చాయి. ఇందుకు సంబంధించి కేరళ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వారిద్దరిపైనా కేసునమోదుచేసారు. ఈ కేసు విచారణలో భాగంగా పాలక్కడ్‌కోర్టు బాబా రాందేవ్‌కు ఆచార్య బాలకృష్ణకు గతంలో నోటీసులు పంపించింది. ఈనెల ఒకటవ తేదీ విచారణకు స్వయంగా హాజరుకవాలని ఆదేశించింది. అయితే శనివారం జరిగిన విచారణకు ఇద్దరూ హాజరుకాకపోవడంతో వారిపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీచేసింది. ఈకేసును ఈనెల 15న విచారిస్తామని చెపుతూ వాయిదావేసింది. కాగా పతంజలి అనుబంధ సంస్థ దివ్య ఫార్మసీకి చెందిన పది ఉత్పత్తులపై ప్రభుత్వంగతంలోనే వేటువేసింది. ఆ ఉత్పత్తులకు సంబంధించి ప్రసారమాధ్యమాల్లో విడుదలచేసిన ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొంటూ వాటి తయారీ లైసెన్స్‌ను రద్దు చేసింది.



# మరదలి హత్య కిరాయి కోసం రూ.40 వేల రుణం



**లక్నో, ఫిబ్రవరి 2:** తనతో వివాహేతర సంబందం కొనసాగించిన మరదలు అడ్డుతొలగించుకునేందుకు బావ ఆమెను హత్యచేయాలని కుట్రలుచేసి అందుకోసం ఏకంగా 40 వేలరూపాయలు బ్యాంకురుణం తీసుకున్నాడు. కిల్లర్స్‌కోసం ఈ సొమ్మును పోగుచేసుకుని మరదలిహత్యకోసం ఆసుపత్రి ఉద్యోగి శుభమ్ సాయం కోరాడు. తర్వాత మరో సహచరుడు దీపక్ వీరికి తోడయ్యాడు. రూ.30వేలిస్తే ఆమెను చంపేస్తామన్నారు. దీనితో ఆశిష్ 40 వేల రుణం తీసుకని అడ్వాన్స్‌గా వారికి పదివేలు చెల్లించాడు. మరదలి హత్య తర్వాత మిగతా రూ.20వేలు ఇస్తానని చెప్పాడు. గతనెల 21న ఆశిష్, శుభమ్, దీపక్‌లు కలిసి ఆ మహిళను స్కూటర్‌పై మీరట్‌లోని నానుకాలువవద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై వారు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాతమన్నీతో గొంతునొక్కి మహిళను హత్యచేసి పెట్రోలుపోసి తగులబెట్టారు. మరోవైపు మహిళ మిస్సింగ్‌పై ఆమె కుటుంబం పోలీసులకు ఫిర్యాదుచేసింది. దర్యాప్తులో ఆమె చివరిసారి ఆశిష్, శుభం, దీపక్‌తో కలిసికనిపించినట్లు చెపుతున్నారు. దీనితో ఆశిష్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నేరం ఒప్పుకోవడంతో పోలీసులు ఆతడిని అరెస్టుచేసారు. మహిళ మృతదేహాన్ని కాల్చిన ప్రదేశంనుంచి ఆధారాలు సేకరించారు. పరారీలో ఉన్న శుభం, దీపక్‌కోసం గాలింపు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మహాకుంభమేళాలో రిలయెన్స్ 'తీర్థయాత్రిసేవ'!

**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 2:** మహా కుంభమేళాలో కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ యాత్రికుల కోసం పలు సేవాకార్యక్రమాలు చేపట్టింది. త్రివేణి సంగమ ఉన్న ప్రయాగ్‌రాజ్‌లో ఆ సంస్థ వాలంటీర్లు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రిలయన్స్ 'వి కేర్' ఫిలాసఫీ కింద వీటిని మొదలుపెట్టింది. తీర్థయాత్రికులకు సేవ చేస్తే భగవంతుడి ఆశీర్వాదం లభిస్తుందని చెబుతారు. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చే యానరతికులకు మా సేవలు ఉంటాయి. మహా కుంభమేళా జీవితకాల అవకాశం. అక్కడకు వచ్చే లక్షల మంది భక్తుల ఆరోగ్యం, సంక్షేమం, రక్షణకు సహాయపడే అవకాశం లభించింది అని రిలయన్స్ డైరెక్టర్ అనంత్ అంబానీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కార్పొరేట్ దిగ్గజం కుంభమేళాలో అన్నసేవ పేరిట భక్తులకు ఆహారం అందిస్తోంది.



దీంతోపాటు వైద్యసేవల కింద ఒపిడి, డెంటల్ సర్వీసులు అందుబాటులోకి తెచ్చింది. మహిళలకు అవసరమైన చికిత్సలను సిద్ధంగా ఉంచింది. ప్రయాగ్‌రాజ్ నుంచి సంగమ్ ప్రదేశానికి భక్తులు ప్రయాణించడానికి వీలుగా వాహనాలను నడుపుతోంది.

# శివసేన ఎంపి సంజయ్‌రౌత్ కాంగ్రెస్‌లోకి..

## మహారాష్ట్ర మంత్రి నితీశ్ రాణే!



**ముంబయి, ఫిబ్రవరి 2:** శివసేన సీనియర్ నేత సంజయ్‌రౌత్ త్వరలో పార్టీని వీడనున్నారని మహారాష్ట్ర మంత్రి, బిజెపి నేత నితీశ్ రాణే వ్యాఖ్యానించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ మేరకు ఆ పార్టీతో చర్చ లు జరుపుతున్నారని ఆరోపించారు. సంజయ్ రౌత్ రాజ్యసభ పదవి కాలం ముగిసే సమయం ఆసన్నమైంది. ఈసారి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వం లోని శివసేన నుంచి నేతలు విజయం సాధించడం కష్టమే. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ పార్టీ 20 స్థానాలు మాత్రమే దక్కించుకోగలిగింది. ఇక పార్టీ భవిష్యత్తు గురించి అర్థం చేసుకున్న సంజయ్‌రౌత్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవు తున్నారు. అందుకోసం ఢిల్లీలోని ఓ నాయకుడి తో సంప్రదింపులు జరుపుతున్నారు అని మంత్రి నితీశ్ రాణే ఆరోపించారు. రౌత్ ఇంకా ఎంతకాలం పార్టీలో కొనసాగుతారు? కాంగ్రెస్ చేరేందుకు ఢిల్లీలో చర్చలు జరుపుతున్న నేత గురించి ఉద్ధవ్ పార్టీ సామ్నాలో రాయాలి. సంజయ్‌రౌత్ కూడా తన ఉద్దేశాన్ని అధికారికంగా ప్రకటించాలి అని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ శిండే మధ్య విభేదాలు ఉన్నాయని, ఇది రాష్ట్ర ప్రజలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఇటీవల సామ్నాలో సంజయ్ పేర్కొన్నారు. శిండే సిఎం పదవి కోసం పోరాడుతున్నారని ఈ విష యంపై ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయంటూ ఆరోపించారు. దీనిపై తాజాగా స్పందించిన మంత్రి నితీశ్‌రాణే ఆరోపణలను ఖం డించారు. సంజయ్‌రౌత్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# బిజెపి గూండాయిజం చేస్తోంది: కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఢిల్లీలో రాజకీయం వేడెక్కింది. పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ బిజెపి గూండాయిజం చేస్తోందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కమలం పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో జరిగే ఎన్నికల్లో ఆప్ విజయం దిశగా పయనిస్తోంది. ఇది బిజెపి నాయకులను, ముఖ్యంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను అయోమయానికి, నిరాశకు గురిచేస్తోంది. అందుకే ఆ పార్టీ నేతలు ఆప్ కార్యకర్తలపై బెదిరింపులకు, దాడులకు తెగబడుతున్నారు. ఇలాంటి బెదిరింపులకు మేం భయపడం. ఆ పార్టీకి ఢిల్లీ అభివృద్ధిపై అజెండా లేదు. సిఎం అభ్యర్థి కూడా లేదు. వారికి కేవలం గూండాయిజం మాత్రమే తెలుసు అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ ప్రజలంతా ఎన్నికల్లో బిజెపిని ఓడించి బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు కేజ్రీవాల్ ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. తమ పార్టీ కార్యకర్తలపై కమలం పార్టీతో పాటు పోలీసులు పదేపదే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు న్యూఢిల్లీ నియోజకవరానికి స్వతంత్ర ఎన్నికల పరిశీలకులను నియమించాలని అభ్యర్థించారు. ఆప్ వాలంటీర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా ఫిబ్రవరి 5న ఢిల్లీలో అసెంబ్లీ జరుగనున్నాయి. ఈన ఫలితాలు వెలుగుపడనున్నాయి.

# పెళ్లికాకుండానే గర్భం..కళాశాలలో ప్రసవం

## చెత్తకుండీలో పారేసిన 20 యేళ్ల విద్యార్థిని



**తంజావూర్, ఫిబ్రవరి 2:** పెళ్లికాకుండానే ఒక కళాశాల విద్యార్థిని గర్భం దాల్చింది. నెలలు నిండే వరకూ విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్త తీసుకుని చివరికి గత వారంలో పురిటినొప్పులు రావడంతో కాలేజి టాయిలెట్‌లోకి వెళ్లి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తర్వాత ఆ బిడ్డను చెత్తకుండీలో పడేసి వచ్చి క్లాస్‌రూమ్‌లో కూర్చుంది. తమిళనాడులోని తంజావూరు జిల్లా కుంబకోణంలో ఈసంఘటన జరిగింది. స్థానికంగా ఒక మహిళా కాలేజిలో చదువుతున్న 20 ఏళ్ల విద్యార్థిని వివాహం కాకుండానే గర్భం దాల్చింది. బయటికి పొక్కకూడదన్న భయంతో ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకుని టాయ్‌లెట్‌లో బిడ్డను కని చెత్తకుండీలో పడేసింది. యూట్యూబ్‌లో చూసి తన బొడ్డు తాడును కత్తిరించుకుంది. అనంతరం శిశువును తీసుకెళ్లి కాలేజి ఆవరణలోని చెత్తకుండీలో పడేసింది. కానీ తీవ్ర రక్తస్రావం కావడంతో కళ్లు తిరిగిపడిపోయింది. గమనించిన కాలేజి అధ్యాపకులు సిబ్బంది ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ఆమెకు ప్రసవం జరిగిందని చెప్పడంతో షాక్ అయ్యారు. వైద్యులు పోలీసులకు కూడా సమాచారం ఇచ్చారు. శిశువును ఏంచేసావని వైద్యులు నిలదీయడంతో చెత్తకుండీలో వేసినట్లు చెప్పింది. కళాశాల సిబ్బందిని అప్రమత్తం చేసి చెత్తకుండీలో ఉన్న శిశువును తీసుకుని ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ తల్లీబిడ్డ ఇద్దరికీ వైద్యులు ట్రీట్‌మెంట్ చేసారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారని చెప్పారు. ఈ అమానవీయ ఘటనపై నాచ్చియార్‌కోయిల్‌స్టేషన్ మహిళా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె తన సమీప బంధువుతో ప్రేమలో పడిందని ఫలితంగానే గర్భం దాల్చిందని పోలీసులు తెలిపారు. సమాజానికి భయపడి ఎవరికీ తెలియకుండా ఇద్దరూ జాగ్రత్త పడ్డారని పోలీసులు తెలిపారు. ఆ యువకుడు కూడా మేజరేనని ఆతడు విద్యార్థినితో తనకున్న సంబంధం నిజమేనని ఒప్పుకున్నట్లు పోలీసులు చెప్పారు. ఆమెను వివాహమాడేందుకు కూడా తాను సిద్దమేనని చెప్పాడు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పారు.

# కేంద్ర బడ్జెట్ సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకం



అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన ప్రదర్శన, ధర్నాలో ప్రసంగిస్తున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

## కేంద్రం వివక్షను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం

### పిసిసి చీఫ్ బి.మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆరోపిస్తూ వందలాది మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు నల్ల బ్యాడ్జిలు ధరించి ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీ వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయపడుతుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రంపై వివక్ష చూపిస్తున్నదని ఆరోపించారు. కేంద్రం వివక్షను ప్రజా క్షేత్రంలోనే ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులకు సహాయం అందించాలని పలు మార్లు ప్రధానికి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేసి, నివేదికలు, వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదని విమర్శించారు. నిధులు కేటాయింపులో రాష్ట్రానికి ఏటా అన్యాయం జరుగుతున్నదని, జిడిపిలో రాష్ట్ర వాటా 5 శాతం ఉన్నప్పటికీ తెలంగాణకు ఎప్పుడు మొండి చెయ్యి చూపిస్తూ వస్తున్నదని, కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలని అన్ని పార్టీలు ఏకమై కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని, ఈ పోరాటానికి పార్టీలకు అతీతంగా బిఆర్‌ఎస్ నాయకులు కెటిఆర్, హరీష్‌రావు రావాలని మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. బిజెపికి ప్రజలు 8 మంది ఎంపిలను ఎన్నుకున్నారని, వారిలో ఇద్దరూ కేంద్ర మంత్రులుగా జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఉన్నప్పటికీ కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో విఫలం చెందారని, కేవలం ప్రధాని ఓట్ల కోసమే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని ఆరోపించారు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై కేంద్ర మంత్రులు, ఎంపిలు ప్రధానిని నిలదీయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం ఒంటరి పోరాటం చేస్తున్నారని, నేడు జరిగిన నిరసన ప్రదర్శన, ధర్నా అంతం కాదు ఆరంభమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, వేం నరేందర్‌రెడ్డి, ఎంపి ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు దానం నాగేందర్, శంకర్, గణేష్, చిన్నారెడ్డి, బల్మూరి వెంకట్, మల్లేశం, సంపత్‌కుమార్, శ్రీశైలంగౌడ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికారిక యూత్ కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి, సునీతారావు, రోహిన్‌రెడ్డి, శివశరణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టుకు సిఎం అభినందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 2:** వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతో టీమిండియా అమ్మాయిలు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగిడి త్రిషను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మలేషియాలో సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి ఇండియా విశ్వ విజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభతో అదరగొట్టి ఆటను ప్రదర్శించారని పేర్కొన్నారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారని అన్నారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారని అన్నారు. త్రిష లాంటి క్రీడాకారులు రాష్ట్రానికి గర్వ కారణమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. త్రిష మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యమున్న యువతీ యువకులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు.

## కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి మొండిచెయ్యి

### నిధుల కోతకు నిరసనగా ఆందోళనలకు సిద్ధమైన ఎస్ఎఫ్ఐ

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపిందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా విమర్శించింది. విద్యను కార్పోరేటీకరణ చేస్తూ.. ప్రైవేటు రంగానికి ధారదత్తం చేయడానికి బడ్జెట్‌లో చర్యలు తీసుకుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు విమర్శించారు. పీఎం పోషన్ పథకం (మధ్యాహ్న భోజన పథకం) కూడా అత్యంత తక్కువ నిధులు కేటాయించారని అన్నారు. జూన్ 2024 లో వచ్చిన పోషన్ ట్రాకర్ డేటా ప్రకారం.. భారతదేశంలో 17 శాతం (2.7 కోట్ల మంది పిల్లలు) తక్కువ బరువుతో, 36 శాతం మంది మందబుద్ధి, 6 శాతం మంది ఎలాంటి అవకాశం అందకుండా వృధాగా ఉన్నారని వెల్లడించింని గుర్తు చేశారు. ఇప్పటికే పాఠశాల విద్యకు దేశంలో నిధుల కొరత తీవ్రంగా వేధిస్తుందన్న వారు.. పాఠశాల విద్యకు రూ. 78,572 కోట్లకు నిధుల కేటాయింపు చేశారన్నారు. ప్రైవేటు రంగంలో పరిశోధకులు కోసం ఈ బడ్జెట్లో కేటాయింపులు పెరిగాయన్నారు. ఉన్నత విద్య కోసం రూ. 50077.95 కోట్లను కేటాయించారన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఉన్నత విద్య వాటా 1 శాతం కంటే తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో దేశంలోని విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యూకే వంటి దేశాలకు వలసలు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఇచ్చిన హామీలైన జిల్లాకో నవోదయ విద్యాలయం, సైనిక పాఠశాల, ఏకలవ్య పాఠశాల, ములుగు ట్రైబల్ యూనివర్శిటికి నిధులు కేటాయింపు చేయలేదన్నారు.

## బిసి కులగణనపై చట్టం చేయాలి

### రిజర్వేషన్ల పెంపుపై సమావేశం ఏర్పాటు చేయాలి

### సిఎం రేవంత్‌కు జాజుల బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన కులగణన లెక్కలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముందు బహిర్గత పరిచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కులగణన లెక్కలపై బీసీ సంఘాలు, మేధావులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఆయన ఆదివారం బహిరంగ లేఖ విడుదల చేశారు. రాష్ట్రంలో కులగణన లెక్కలను క్రోడికరించి డెడికేషన్ కమిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సేకరించిదని.. కానీ ఇప్పుడు మంత్రివర్గ ఉప సంఘం అంటూ హడావిడి చేస్తూ గందరగోళ స్థితిలో నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా చట్టపరమైన అవరోధాలు లేకుండా ఉండాలంటే బీసీ నిష్ణాతులు, అఖిలపక్ష పార్టీల నేతలు, బీసీ సంఘాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పత్రికల్లో హెడ్ లైన్ల కోసం.. డెడ్ లైన్లు పెడితే బీసీ రిజర్వేషన్లు పెరగవని, బీసీ రిజర్వేషన్లు పెరగాలంటే తమిళనాడు రాష్ట్రం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి .. అసెంబ్లీలో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటుకు నివేదించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. పార్లమెంటుకు నివేదించే క్రమంలో బీసీ కులగణన జనాభా లెక్కలు సంఖ్యలు, అంకెలు మొత్తం శాస్త్రీయ బద్దంగా న్యాయబద్ధంగా శాసన ప్రక్రియ ద్వారా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ నెల 2న డేడికేషన్ కమిషన్ రిపోర్టు, 3న తారీఖున మంత్రివర్గ ఉప సంఘ సమావేశం, 5న అసెంబ్లీ సమావేశాలు పెట్టి హడావిడిగా గందరగోళ పరిస్థితిలో నిర్ణయాలు తీసుకుంటే బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు కాల్చుకోక తప్పదని హెచ్చరించారు. కులగణనపై రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటివరకు ఎవరితోనూ చర్చించలేదని, బీసీ సంఘాలు, బీసీ మేధావులు, న్యాయ నిపుణులతో చర్చించకుండా మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయాలు ఎలా తీసుకుంటారని జాజుల ప్రశ్నించారు. బీసీలను మభ్యపెట్టడానికి, మోసగించడానికి ఎలాంటి ప్రయత్నం చేసినా.. కాంగ్రెస్ రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు.

## మత వైషమ్యాలను వ్యాప్తి చేస్తోన్న పాలకులు

### అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర సదస్సు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక సదస్సు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మోడం మల్లేశం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలు జస్టిస్ చంద్రకుమార్ హాజరై మాట్లాడారు. సమాజంలో ఉన్నటువంటి అన్ని రకాల ఉత్పత్తులను చేసేది కార్మిక వర్గం మాత్రమే, ఆ ఉత్పత్తి కార్మిక వర్గ శ్రమ ద్వారానే జరుగుతుంది. స్వాతంత్రం వచ్చి కొన్ని సంవత్సరాలైనా ఆ రోజు నుండి ఈరోజు వరకు ఎలాంటి మార్పు రాలేదు. ఆరోజు స్వతంత్రం కోసం ఏ ఆకాంక్ష తో పాల్గొని ప్రాణాలు వదిలారో, తెలంగాణ సాయుధ పోరాటం సైతం పోరాటాలు జరిగాయని, వాటి స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితులలో అదేవిధంగా ఐక్య ఉద్యమాలు చాలా అవసరం అని, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కేంద్ర బడ్జెట్ ప్రకటనలో పేద ప్రజలకు జిఎస్‌టితో కొంత ఉపశమనం జరిగిందని చెప్తున్నటువంటి మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. బడాబడా పారిశ్రామికవేత్తల కోట్లాది రూపాయల బ్యాంకు రుణాలను రద్దుచేసి ప్రజల పైన అదనపన్నులు విధించి ఆ పన్నుల రాబడితో రద్దు చేసిన బ్యాంకు రుణాల లోటును పొడుస్తున్నారని, కార్మికుల పైన శ్రమ భారాన్ని పెంచుతూ కార్మిక వర్గానికి గతంలో ఉన్న ప్రయోజనాలను అన్నింటిని రద్దు చేస్తున్నారన్నారు. మోడీ ప్లస్ ఇతర కేంద్ర పాల కులు ఒక పథకం ప్రకారం భారత సమాజంలో మత వైషమ్యాలను వ్యాప్తి చేస్తున్నారన్నారు. ఇంకా ఈ సదస్సును ఉద్దేశించి కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీ వినాయక రెడ్డి గారు ఏఐఎఫ్టియు న్యూ అధ్యక్షులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్, ఏఐకేఎంకేఎస్ నాయకులు కామ్రేడ్ ప్రసాద్ అన్న, ఏఐఎఫ్టీయూ న్యూ కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్ గణేష్ పండా,జే కిషోర్ బాబు, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోనూ ఉమ్మడి పౌరస్మృతి అమలుచేయాలి

### మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు సూచన

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** ఉజ్వల భవిష్యత్తు వైపు పయనిస్తున్న భారత దేశ సామాజిక పురోగతి, అభివృద్ధికి ఉమ్మడి పౌర స్మృతి నైతిక ఆవశ్యకత ఉన్నదని, ఉత్తరాఖండ్ రాష్ట్రం దేశంలో మొదటి రాష్ట్రంగా అమలు చేస్తుందని, తెలంగాణ రాష్ట్రం కూడా ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసి దేశంలో రెండవ రాష్ట్రంగా నిలువాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావు ఆకాంక్షించారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ, పీజిఆర్ఆర్‌సీడీ, సెమినార్ హాల్‌ల్లో "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్" ప్రారంభసభలో మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావు, రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ ముఖ్యతిథులుగా, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. బట్టు సత్యనారాయణ గౌరవ అతిథిగా, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు, ప్రముఖ విద్యావేత్తలు ప్రొ. సి. విష్ణు వర్ధన్ రెడ్డి, కటకం మధుకర్, సామాజికవేత్త కొండా లక్ష్మీకాంత్ రెడ్డి లు ప్రత్యేక అథితులుగా పాల్గొనగా "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్" ప్రధాన కార్యదర్శి డా. పుట్ట పాండు రంగయ్య స్వాగ తం పలుకగా, అధ్యక్షులు డా. జి. హరిచరణ్ అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా సిహెచ్. విద్యా సాగర్ రావు 'విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌం డేషన్'ను ప్రారం భించి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వం లో భారత దేశం దూసుకు పోతుందని, అభివృద్ధి, సంక్షే మంతో పాటు అన్ని రంగాల్లో ప్రపంచ అగ్ర దేశాలతో




ఒయులో విజన్-2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, చిత్రంలో ఎంపి డా.లక్ష్మణ్, విసి బట్టు సత్యనారాయణ తదితరులు

పోటీ పడుతుందన్నారు. వైద్యు లు, ప్రొఫెసర్‌లు, మేధావులతో ఏర్పాటుచేసిన 'విజన్ ప్రొఫెషనల్స్ ఫౌండేషన్' స్వచ్చెంద సంస్థ అవినీతి నిర్మూలన, విద్య, ఆరోగ్య నాణ్యత కోసం కృషి చేయాలనీ సిహెచ్. విద్యాసాగర్ రావు కోరారు. డా. కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులు 'విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్' స్వచ్ఛంద సంస్థ ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశం నిలువాలని ప్రధాని మోడీ కలలను వాస్తవంలోకి తీసుకరావడానికి వికసిత్ భారత్ 2047 అనే డైనమిక్ వేదికపై 'విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్' వంటి స్వచ్ఛంద సంస్థలు, ప్రజ లందరూ భాగస్వాములై సమ్మిళిత, ప్రగతిశీల భారతదేశాన్ని నిర్మించ డానికి సమిష్టి కృషి చేయాలనీ డా. లక్ష్మణ్ కోరారు. ప్రొ. బట్టు సత్యనారాయణ మా ట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానం వంటి విద్యా సంస్కరణలు నైపుణ్య అభివృద్ధి ఆవిష్కరణలకు ప్రాధాన్యత నిస్తాయన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలనలో మైనార్టీలకు తీవ్ర అన్యాయం

### మాజీ హోంమంత్రి మహమూద్ అలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** సిఎం రేవంత్ రెడ్డి పాలనలో మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాజీ హోం మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ మహమూద్ అలీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిందని, కానీ ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని పేర్కొన్నారు. మైనారిటీ డిక్లరేషన్ ప్రకటించి మర్చిపోయారని, మైనార్టీల ఓట్లు వేసుకోని మోసం చేశారని అన్నారు. కెసిఆర్ మైనారిటీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేశారని తెలిపారు. మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశారని, మైనారిటీలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని ఇవ్వడం లేదని, మైనారిటీ విద్యార్థులకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరుతో ప్రోత్సాహకాలు ఇస్తామని అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్, టిడిపి రాష్ట్రాన్ని పాలించినా కెసిఆర్ సిఎం అయ్యాక మైనారిటీలకు మేలు జరిగిందని చెప్పారు. కెసిఆర్ గంగా, జమునా తెహజీబ్‌లా పరిపాలన చేశారని మహమూద్ అలీ పేర్కొన్నారు. కెసిఆర్ మైనారిటీలకు సబ్సిడీ ఇచ్చారని, రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క రూపాయి మైనారిటీలకు సబ్సిడీ ఇవ్వలేదని, ఉర్దూ డిఎస్‌సి నిర్వహించడం లేదని పేర్కొన్నారు. కెసిఆర్ ఉర్దూను తెలంగాణ రెండవ అధికార భాషగా ప్రకటించారని, సెట్విన్ ద్వారా ముస్లింలకు ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చేవారని, కెసిఆర్ హయాంలో పాతబస్తీ అభివృద్ధి జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముస్లిం, మైనారిటీలపై దాడులు పెరిగాయని, రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, ప్రజలు పరేషాన్‌లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కెసిఆర్ సెక్యూలర్ లీడర్ అని, కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీనా లేదా అనేది రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చెప్పాలని అడిగారు. ఇది రేవంత్ రెడ్డి పాలనలాగా లేదు అని, మోదీ పాలనలా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మోడీ,అమిత్‌షాను అనుసరిస్తున్నారని మహమూద్ అలీ పేర్కొన్నారు.

## 25 వరకు జెఇఇ మెయిన్ ఫేజ్-2 దరఖాస్తులు

### ఏప్రిల్ 1 నుంచి 8 వరకు పరీక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** దేశంలోని ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)-2025 మెయిన్ ఫేజ్-2 దరఖాస్తుల ప్రక్రియ ప్రారం భమైంది. అయితే దరఖాస్తుల ప్రక్రియ జనవరి 31 నుంచి ప్రారంభిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రక్రటించినప్పటికీ ఒక రోజు ఆలస్యంగా ఈ నెల 1(శనివారం) రాత్రి నుంచి ప్రారంభమైంది. దీంతో ఈ నెల 24 వరకు ఉన్న దరఖాస్తు గడువును కాస్త ఈ నెల 25 వరకు పొడిగిస్తున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. జేఈఈ మెయిన్ ఫేజ్-2 పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 8 వరకు నిర్వహించనున్నారు. జేఈఈ మెయిన్ ఫేజ్-1లోనే రెండు విడతలకు దరఖాస్తు చేసుకున్నవారు .. మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. కేవలం మొదటి విడతకు మాత్రమే గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే రెండో విడత జేఈఈ మెయిన్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయితే జేఈఈ మెయిన్ ఫేజ్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. దేశంతోపాటు ఇతర దేశాల్లో కలిపి 598 పరీక్షా కేంద్రాల్లో 284 నగరాల్లో పరీక్షను నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 13,78,232 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 13,00,273 మంది పరీక్షలకు హాజరయ్యారు.

## మన దేశ ఆహార ఉత్పత్తులు పెరగాలి

### మన జిడిపి గతంలో 33 శాతం ఉండేది:

### జమ్ముూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జమ్ముూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తదితర ప్రముఖులు

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఆహార ఉత్పత్తులు ఇతర దేశాలపై ఆధార పడకుండా మనదేశంలోనే ఉత్పతి చేసేదిశగా శాస్త్ర వేత్తలు కృషి చేయాలని జమ్ముూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పేర్కొన్నారు. తార్నాక ఐఐసీటీలో ఘనంగా బనార్ హిందు విశ్వ విద్యాలయం(భూహెచ్‌యూ) వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మహా మన మలవీయ మిషన్, భూ అలుమ్నీ అసోసి యేషన్ ఆధ్వ ర్యంలో ఆదివారం ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా భూ పూర్వవిద్యార్థులతో కలిసి వేడుకలను ప్రారం భించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ మహామన మాల వీయ మిషన్ సేవలను కొనియాడారు. 11 వ శతాబ్దానికి పూర్వ మన జీడీపీ 26 శాతం నుంచి 33 శాతం ఉండేదని స్వాతంత్ర్యం వచ్చే సమయానికి అది 4 శాతానికి తగ్గిందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆత్మనిర్భల్‌తో 2023 సంవత్సరంలో తిరిగి మన జీడీపి 15 శానికి పెరిగిందన్నారు. దేశంలోనే తొలి గురుకుల విశ్వవిద్యాలయంగా బీహెచ్‌ఎయూ ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ వర్సిటీ ద్వారా ఉన్నత విద్యకు సంబంధించిన అన్ని విభాగాలు ఒకే గొడుగు కిందికి వచ్చాయని చెప్పారు. సమాజ అభివృద్ధిలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. దేశంలో ఆహారభద్రత కీలకంగా మారిందని చెప్పారు. గ్రామీణ భారతంలో యాభై శాతానికి పైగా ప్రజల్లో పోషకాహార లోపం ఉందని అన్నారు. దానిని అధిగమించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశం స్వయంసమృద్ధి సాధించేందుకు కేంద్రీయ పరిశోధన సంస్థలు కృషి చేయాలని సూచించారు. దేశ ఆర్థిక స్థితి పెరగాలంటే సైన్స్ అభివృద్ధి జరగాలని అన్నారు. దేశంలో వర్సిటీల స్థాయి తగ్గిపోతోందని, వర్సిటీలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలకు సంబంధించి స్టార్టప్‌లు ప్రారంభిస్తే ఆ సమస్యలకు తగిన పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాలవ్య మిషన్ జాతీయ అధ్యక్షుడు హరిశంకర్ సింగ్, సెక్రెటరీ జనరల్ డాక్టర్ వేదప్రకాష్ సింగ్, మాజీ అధ్యక్షుడు ప్రభునారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా

# 10న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా


**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న నగరంలోని ఇందిరాపార్క్ దగ్గర మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య వెల్లడించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో వివ రాలు వెల్లడించారు. రూ.50,65,345 కోట్లతో 2025-26 కేంద్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. గత బడ్జెట్ కంటే సుమారు రూ.3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జిడిపి లోటు 4.4గా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 10న సంఘాల ఆధ్వ ర్యంలో హైదరాబాద్ లో జరిగే మహాధర్నా కార్యక్రమంలో వేలాదిగా పాల్గొనాలని కోరారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లా డుతూ సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అ న్యాయం అని అన్నారు. ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బం డారు రవికుమార్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, పట్నం రాష్ట్ర కార్యదర్శి డీజీ నరసింహారావు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ, డిజిటల్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సుందర్ మాట్లాడుతూ...బీమా రంగంలో ఎఫ్‌డిఐలు 74 శాతం నుండి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమేనని, ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమని వారు మండిపడ్డారు. ఈ బడ్జెట్ సాధారణ ప్రజలు, కార్మికవర్గంపై రానున్న రోజుల్లో మరిన్ని భారాలు మోపి ఉపాధి కల్పన స్థాయిలను మరింత



వివరాలు వెల్లడిస్తున్న తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య

క్షీణింపజేస్తుందని అన్నారు. మధ్యతరగతికి రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపును బడ్జెట్‌లో ప్రకటించినా, పాత పద్ధతిలో ఎటువంటి మార్పులను ప్రస్తావించకపోవడం మధ్యతరగతి ప్రజలకు నష్టం. అదే సమయంలో సంపద పన్ను 3 శాతానికి తగ్గించి మధ్యతరగతిపై ఆదాయపు పన్ను విధింపు ధనవంతులకు లబ్ధి చేకూర్చడమే. పెన్షన్ రంగానికి నిధులు పెంచకపోవడం, స్థూలంగా 10 సంవత్సరాలు బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, సంపన్నుల ప్రయోజనాలే ప్రాధాన్యతనిచ్చి ప్రవేశపెట్టిన 2025 26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ యావత్తూ తీవ్రంగా నిరసించాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరింది.



బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

## బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్య ప్రభుత్వ హత్యే: మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ (పేట్ బషీరాబాద్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. హైడ్రా ఏర్పాటు రియల్ ఎస్టేట్ రంగం కుదేలుతో అప్పుల పాలైన కొంపల్లికి చెందిన బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడగా, ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కొంపల్లిలోని వేణుగోపాల్ రెడ్డి నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాజీ మంత్రివర్యులు హరీష్ రావు, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌లు మాట్లాడుతూ బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని, ప్రభుత్వ అసమర్థ పాలన అనాలోచిత నిర్ణయాలతోనే రాష్ట్రంలో రియల్టర్లు, బిల్డర్ల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం, చదువుల కోసం, ఆపదలో ఉన్న వారు అమ్ముకుందామంటే ప్లాట్లు అమ్ముడుపోని దుస్థితి నెలకొంది. గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ రియల్ ఎస్టేట్ రంగంలో దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టేలా హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మారిస్తే, నేడు కాంగ్రెస్ పాలకులు మాత్రం వారి అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను భయపెట్టే విధంగా హైడ్రాను ఏర్పాటుచేసి పెట్టుబడులు ముంబై, నోయిడా, బెంగుళూరు వంటి ప్రాంతాలకు తరలిపోయే విధంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చారు. బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్యతో వారి కుటుంబ సభ్యులు దిక్కుతోచని పరిస్థితిలో ఉంటే ప్రభుత్వం కానీ, బిల్డర్ అసోసియేషన్ సభ్యులు ఎవరు వేణుగోపాల్‌రెడ్డి కుటుంబాన్ని జీవితాంతం పరామర్శించకపోవడం బాధాకరం. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ అంటే నాకు బాగా తెలుసు అని మాటల్లో చెప్పడం కాదు, మీరు వచ్చి వేణుగోపాల్ రెడ్డి కుటుంబంతో మాట్లాడండి, వారి కష్టాన్ని అర్థం చేసుకోండి, భవిష్యత్తులో మిగతా బిల్డర్లకు ఈ పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టండి. బడబడ బిల్డర్‌లతో సమావేశాలు నిర్వహించి రియల్ ఎస్టేట్ అంతా బాగానే ఉందని చెప్పడం కాదు, చిన్నచిన్న బిల్డర్‌లతో మాట్లాడండని అన్నారు. బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.



## నావిగేషన్ ఉపగ్రహ ప్రయోగంలో సాంకేతిక లోపం

### కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు పెరుగుతున్న జాప్యం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** భారత శాస్త్రసాంకేతిక పరిశోధనాసంస్థ(ఇస్రో) ప్రయోగించిన నావిగేషన్ ఉపగ్రహంలో ఆదివారం సాంకేతిక లోపం తలెత్తడంతో 100వ రాకెట్‌మిషన్ అడ్డంకులు ఎదుర్కొన్నట్లు ఇస్రో వెల్లడించింది. ఇస్రో తన వెబ్‌సైట్‌లో ఈమిషన్‌గురించి అప్‌డేట్ ఇచ్చింది. కక్ష్యపెంపుకోసం థ్రస్టర్‌లను కాల్చడానికి ఆక్సిడైజర్‌ను అనుమతించే కవాటాలు తెరవకపోవడంతో ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ఉంచేందుకు జాప్యం జరుగుతోందని చెప్పారు. యుఆర్‌రావు ఉపగ్రహకేంద్రం తయారుచేసిన ఎన్వీఎస్02 ఉపగ్రహం భారత్‌పై నిర్దేశించిన ప్రదేశంలో భూస్థిర వృత్తాకార కక్ష్యలో పనిచేయాలి. ఉపగ్రహంలోని ద్రవ ఇంజిన్‌సరైన రీతిలోపనిచేయకపోవడంతో నిర్దేశింన కక్ష్యకు పంపించడంలో కొంత జాప్యం జరగనూ వచ్చు లేదా పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉందని ఇస్రో వివరించింది. నావిగేషన్‌కోసం ఉపగ్రహాన్ని ఉపయోగించుకోడానికి ప్రత్యామ్నాయ మిషన్ వ్యూహాలను రూపొందిస్తున్నట్లు తెలిపింది. బుధవారం ఉదయం 6.23 గంటలకు ఇస్రో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఎన్వీఎస్02ను మోసుకెళ్లే జీఎస్ఎల్‌వి ఎఫ్15ను విజయవంతంగా ప్రయోగించింది. ఇస్రోకు 100వ మిషన్. ఇటీవలే బాధ్యతలుస్వీకరించిన ఇస్రోఛైర్మన్ వి నారాయణన్‌కు కూడా ఈ మిషన్ మొదటిది. ఈ సంవత్సరంలో ఇస్రో తొలిప్రయోగం ఇదే. బూమిచుట్టూ ఉన్న సమీప బిందువు వరకూ సుమారు 170 కిలోమీటర్ల పరిధిలోనూ, భూమినుంచి అత్యంత సుదూర కేంద్రం వద్ద అంటే సుమారు 36,577 కిలోమీటర్ల దూరంలో ఉన్నదీర్ఘవృత్తాకార కక్ష్యనుంచి ఉపగ్రహం నిర్దేశిత పనులను నిర్వహించాల్సి ఉంటుంది అయితే సాంకేతిక లోపంతో ఇపుడు ఆ విధులు నిర్వర్తించలేదని ఇస్రో వెల్లడించింది. రెండోతరం ఉపగ్రహం 2259 కిలోల బరువు ఉంది. జిపిఎస్‌కి సమానమైన నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టెలేషన్ ఎన్ఎవిఐసిలో భాగం అని వివరించింది.

## రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

### రేపు ఉదయం నుండి రాత్రి వరకు సప్తవాహన సేవలు

### సీనియర్ అధికారులు, పోలీసులు సేవకులే





**తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధి మంగళవారం రేపు సూర్యజయంతి (రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆరోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలతో బాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు, భక్తులకు సేవలందించేందుకు సీనియర్ అధికారులు, సిబ్బందిని నియమించారు. వీరంతా కలసి సమన్వయంతో భక్తులకు తిరుమలలోని మాఢవీధుల్లో, గ్యాలరీల్లో నిరంతరాయంగా సేవలందిస్తారు. రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై, సేవలపై టిటిడి ఇఒ శ్యామల రావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంక య్య చౌదరి, జెఇఒ ఎస్‌ఒలు ఎస్వీవిరామ్‌కుమార్, సురేంద్ర, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్ విజిలెన్స్, పోలీసు విభాగాల అధికారులు ఆదివారం ఏర్పాట్లు తనిఖీలతో బాటు సేవలందించడంపై సమీక్షించారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు వీరబ్రహ్మం, ఇన్‌ఛార్జి సివిఎస్‌ఒ మణి కంఠచందోలు, తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు, వి అన్నప్రసాదాలు, తాగునీరు. టీ, కాఫీ, పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులకు విధులు కేటాయించారు .భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేశారు. మంగళవారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు, బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. నేటి నుండి 5వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు.

**ఉదయం నుండి రాత్రి వరకు వాహనసేవలు**

4వతేదీ ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంత వాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు నిర్వహిస్తారు.

## ఇంగ్లండ్‌తో సిరీస్ భారత్ కైవసం

### 150 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపు



**ముంబయి, ఫిబ్రవరి 2:** ఇంగ్లండ్‌తో ఐదుమ్యాచ్‌ల టి20 సిరీస్‌ను భారత జట్టు 4-1 తేడాతో సొంతంచేసుకుంది. ఈ సిరీస్‌లో మూడో మ్యాచ్ మినహా ఇతర అన్ని మ్యాచ్‌ల్లోను భారత్ ఆధిపత్యం చూపించింది. ముంబయిలోని వాంఖడేలో జరిగిన చివరిమ్యాచ్‌లో అభిషేక్‌శర్మ సెంచరీ చేయడంతో భారత్ 247/9 స్కోరుచేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 97 పరుగులకే కుప్పకూల్చి 150 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్‌ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ అభిషేక్‌శర్మ వన్‌డౌన్ బ్యాటర్ తిలక్‌వర్మలు రికార్డుస్థాయిలో 115 పరుగులు జోడించారు. ముఖ్యంగా అభిషేక్ చెలరేగిపోయాడు. 13 సిక్స్‌ల సాయంతో ఈ ఇన్నింగ్స్‌లో మొత్తంగా 54 బంతుల్లో 135 పరుగులుచేసాడు. 17 బంతుల్లో అర్ధసెంచరీమార్కును చేరుకున్న అభిషేక్ మరో 20 బంతుల్లోమూడంకెలస్కోరు సాధించాడు. శివమ్‌దూబే 30పరుగులు, తిలక్‌వర్మ 24 పరుగులుచేసి పర్వాలేదనిపించడంతో భారత్‌నిర్ణీత 20 ఓవర్లలో 247/9 పరుగులుచేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్‌కేర్స్ అత్యధికంగామూడు వికెట్లు తీసాడు. మార్క్‌వుడ్ రెండు వికెట్లు, జోఫ్రా ఆర్చర్, జెమీ ఓవర్టన్, ఆదిల్‌రషీద్‌లు తలా ఒక వికెట్‌చొప్పున తీసారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ సగం ఓవర్లలోనే కుప్పకూలింది.

భారత బౌలర్ల ధాటికి 10.3 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. ఫిలిప్ సాల్ట్ 23 బంతుల్లో 55పరుగులుచేసి కాసేపు క్రీజులో నిలిచాడు. ఇంగ్లండ్ బ్యాటర్లలో సాల్ట్‌తోపాటు బెథెల్(10) మాత్రమే రరెండంకెల స్కోరుచేసాడు. మిగిలిన బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పెవిలియన్‌చేరిపోయారు. దీనితో టీమిండియా 150 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. భారత బౌలర్లలో మహ్మద్‌షమీ మూడు వికెట్లతో సతానత చాటాడు. వన్డేప్రపంచకప్ 2023 ఫైనల్ తర్వాత ఈసిరీస్ రీ ఎంట్రీ ఇచ్చిన షమీ ఈ మ్యాచ్‌ద్వారా వికెట్ల వేట ప్రారంభించాడు. వరుణ్‌చక్రవర్తి రరెండు, శివమ్‌దూబే 2, అభిషేక్‌శర్మ 2, రవిబిష్ణోయ్ ఒక వికెట్‌తీసారు. ఈ మ్యాచ్ ఫలితంతో భారత్ 4-1 సిరీస్ కైవసంచేసుకుంది. రెండుజట్లమధ్య వన్డే సిరీస్‌ఫిబ్రవరి ఆరునుంచి ప్రారంభం కానున్నది. ఈ సిరీస్‌లో స్టార్‌ప్లేయర్లు విరాట్‌కోహ్లీ, రోహిత్‌శర్మ, జస్‌ప్రీత్‌బుమ్రాలు ఆడనున్నారు.

## తెలంగాణలో పవర్ అలర్ట్

### సమ్మర్ మొదలవకముందే భారీ డిమాండ్

### రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వినియోగం

### గత నెల 31న 15250 మెగావాట్ల పీక్ డిమాండ్

### ఈ వేసవిలో 17 వేల మెగావాట్లకు పైగా అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంకా సమ్మర్ సీజన్ కాకముందే విద్యుత్‌కు పీక్ డిమాండ్ ఏర్పడుతోంది. వేసవి రాకుండానే అప్పుడే ఇబ్బడిముబ్బడిగా కరెంట్ వినియోగం భారీగా పెరిగిపోతుండటం అధికారుల్లో గుబులు రేపుతోంది. గత ఏడాది పీక్ సమ్మర్‌లో ఉన్న డిమాండ్, ఈసారి జనవరిలోనే కనిపించడం విశేషం. దీంతో వేసవిలో విద్యుత్ వినియోగం మరింతగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు అధికారులు. అందుకు తగ్గట్టుగా ముందుస్తు ఏర్పాట్లపై ఫోకస్ పెట్టారు. సహజంగానే వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. డిమాండ్‌కు తగ్గ సప్లై చేయటానికి విద్యుత్ పంపిణీ సంస్థలు కసరత్తులు చేస్తుంటాయి. ఈసారి సమ్మర్ స్టార్ట్ కాకముందే ఈ కసరత్తును విద్యుత్ సంస్థలు ప్రారంభించాయి. గత ఏడాది మార్చిలో అత్యధికంగా 15 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడితే ఈసారి వేసవి రాకముందు జనవరిలోనే 15,205 మెగావాట్ల డిమాండ్ ఏర్పడింది. ఎండలు పూర్తిగా మొదలు కాకముందే ఈ రకమైన డిమాండ్ ఉంటే పిక్ సమ్మర్‌లో ఊహించని స్థాయిలో డిమాండ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అయితే కేవలం గృహ వినియోగం వల్లనే ఇంత డిమాండ్ పెరగలేదు. దీనికి పలు కారణాలు ఉన్నాయి. తెలంగాణలో ఈసారి రికార్డ్ స్థాయిలో పంట దిగుబడి సాధించింది. అందుకు వ్యవసాయ విద్యుత్ వినియోగం డిమాండ్ చాలా పెరిగింది. దాంతో పాటు పారిశ్రామిక గృహ వినియోగంలో కూడా భారీగా వృద్ధిరేటు కనపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ జనవరిలో 10 వేల మెగావాట్ల విద్యుత్ రిమాండ్ ఏర్పడితే ఒక్క హైదరాబాద్‌లోనే 5000 మెగాపట్ల డిమాండ్ ఉంది. మొత్తం కలిపి 15 వేల మెగాపట్ల డిమాండ్ ఏర్పడింది. గత నెల 31న రికార్డు స్థాయిలో రాష్ట్ర వ్యాపితంగా 15,205 మెగావాట్లు వినియోగం జర్గ్గా, గతే ఏడాది ఇదే సమయంలో పీక్ డిమాండ్ 13,810 మెగావాట్లుగా ఉంది. ఇది గతేడాది పీక్ సమ్మర్‌లో ఉన్న డిమాండ్ కన్నా ఎక్కువ. పోయిన ఏడాది మార్చి 3న అత్యధికంగా 15,623 మెగా డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వేసవిలో పీక్ సమ్మర్‌కి కనీసంగా 17000 నుంచి 18 వేల మెగావాట్ల పైగా డిమాండ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయని విద్యుత్ శాఖ లెక్కకడుతోంది. మరోపక్క ప్రస్తుత యాసంగితో పాటు, రానున్న వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టుగా క్వాలిటీ కరెంట్ సప్లై చేయడంపై రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు దృష్టి సారించాయి. విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ రంగ సంస్థలు ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూలు నిర్వహిస్తున్నాయి. డిమాండ్ ఎంత పెరిగిన దానికి తగ్గట్టుగా సరఫరా అందించేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ తాకిడిని తట్టుకోవడానికి సీనియర్ ఇంజనీర్లను ప్రతి జిల్లాకు నోడల్ అధికారులు నియమించి, విద్యుత్ కంట్రోల్ రూమ్ 1912 బలోపేతం చేసి ఎప్పుడు ప్రజల్లోకి అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఒకచోట కలిసి మాట్లాడుకుంటే తప్పేంటి?

### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసిన విషయం నిజమేనని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. తాను ఏఫైల్ ను కూడా రెవిన్యూ మంత్రి దగ్గర పెట్టలేదని చెప్పారు. అసలు నిజానికి అది ఏ ఫైల్ అనేది నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి చెప్పాలని అన్నారు. రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో అభివృద్ధి, కొన్ని ప్రాజెక్టుల పనుల కోసం ఒక చోట కలిసి మాట్లాడుకుంటే తప్పేంటి అని ఆయన ప్రశ్నించారు. అసలు తాము రహస్యంగా సమావేశం కాలేదని తేల్చి చెప్పారు. కానీ మేం అధిష్టానంతో మాట్లాడాల్సింది చాలా ఉందని అన్నారు. రాష్ట్ర పార్టీ ఇన్ ఛార్జి దీపాదాస్ మున్షీతో భేటీ అయిన తర్వాత ప్రతి విషయం మాట్లాడుతా అని పేర్కొన్నారు. నా క్యారెక్టర్‌ను తప్పుగా చూపిస్తే ఊరుకునేది లేదు. అన్ని ఆధారాలతో పెద్దలతో కలిసి మాట్లాడుత్తా అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, మంత్రుల నియోజకవర్గాలేకు అభివృద్ధి కోసం నిధులు వెళ్తున్నాయనే భావన కొందరు ఎమ్మెల్యేల్లో ఉన్నట్లు సమాచారం. తమ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదనే.. కొందరు ఎమ్మెల్యేలు రహస్య భేటీ అయినట్లు టాక్ నడుస్తోంది. కనీసం తమ నియోజకవర్గానకి గానీ.. తమకు వ్యక్తిగతంగా కూడా గౌరవం దక్కడం లేదని భావన వారిలో గట్టిగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే దీనిని కొన్నిపార్టీలు తమకు అనుకూలంగా మార్చుకుని కాంగ్రెస్ పార్టీపై ట్రోల్ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అలజడులు జరగలేదని.. అంతా బాగానే ఉందని తెలంగాణ కాంగ్రెస్ చెప్పుకొస్తుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.. తాజాగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రహస్య భేటీపై ఆరాతీశారు. తాను పార్టీకి చెందిన కొందరి ఎమ్మెల్యేలతో కలిసి భోజనం చేయాలనే ఉద్దేశ్యంతోనే సమావేశం నిర్వహించినట్లు ఎమ్మెల్యే అనిరుధ్ వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించి తాజాగా.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా రియాక్ట్ అయ్యారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య భేటీని ఆయన ఖండించారు. ఉద్దేశ పూర్వకంగానే కొందరు ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నారని ఫైరయ్యారు.

## బిజెపి గెలుపు.. ఢిల్లీకి మలుపు

### ఆప్ నేతలు అవినీతికి ఆనవాళ్లు

### అవినీతిలో కూరుకుపోయిన ఆప్‌ను కూకటివేళ్లతో పెకిలిద్దాం

### ప్రతి మహిళకు నెలనెలా రూ.2,500లు ఇస్తాం

### ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం: బండి సంజయ్ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్న కేంద్ర మంత్రి అవినీతి ఊబిలో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పార్టీని కూకటి వేళ్లతో పెకిలించి వేయాల్సిన సమయం వచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో రూ.28 వేల400 కోట్ల జల్ బోర్డ్ కుంభకోణం, రూ.4,500 కోట్ల బస్సుల కొనుగోలు కుంభకోణం, బస్సుల్లో సదుపాయాల పేరుతో రూ.500 కోట్ల దుర్వినియోగం, నకిలీ హెల్త్ టెస్టుల ద్వారా కోట్ల రూపాయల అక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం ఉదయం బిజెపి తెలంగాణ కోశాధికారి భండారి శాంతికుమార్, పార్టీ ఢిల్లీ ప్రతినిధి నూనె బాలరాజుతో కలిసి ఈస్ట్ ఢిల్లీ, షాద్రా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో బనియా, బ్రాహ్మణ, వాల్మీకి సామాజికవర్గ ప్రజలు అధికంగా నివాసముండే ప్రాంతాల్లో బండి సంజయ్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బిజెపి అభ్యర్థులకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఆడంబరాలకు, అవినీతికి దూరంగా ఉంటూ పాలన కొనసాగిస్తామని అధికారంలోకి వచ్చిన ఆప్ నేతలు విలాసవంతమైన జీవితాలను గడుపుతూ ప్రజా ధనాన్ని దోచుకుతిన్నారని మండిపడ్డారు. ప్రజలను మాత్రం బిచ్చగాళ్లలో మార్చారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు సాదాసాదీ జీవితం గడిపిన ఆప్ ఎమ్మెల్యేలు అధికారంలోకి వచ్చాక అనూహ్యంగా ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. ఢిల్లీ మద్యం స్కాం తెలంగాణకు విస్తరించిందని, ఈ స్కాం ఢిల్లీ ప్రజలు తలదించుకునేలా చేసిందన్నారు. ఈ కుంభకోణంలో ప్రధాన ముద్దాయిలుగా కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, బిఆర్ఎస్ నేత కవిత ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అవినీతి కేసుతో జైలుకు వెళ్లిన కేజ్రీవాల్ కోర్టు ఒత్తిడి చేస్తే బలవంతంగా రాజీనామా చేయకపోవడం ఆయన స్వార్థపూరిత రాజకీయాలకు నిదర్శనంగా నిలుస్తుందని మండిపడ్డారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నేతల అబద్ధపు, మోసపూరిత రాజకీయాలతో ఢిల్లీ ప్రజలు విసిగిపోయారన్నారు. మార్పు కోసం, ఢిల్లీ అభివృద్ధి కోసం బిజెపివైపు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బిజెపి బంపర్ మెజారిటీతో గెలిచి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సమృద్ధి యోజన్న పథకం కింద అర్హులైన పేద మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సహాయం, రూ.500లకే ఉచిత గ్యాస్ సిలిండర్, ముఖ్యమంత్రి మాతృత్వ భద్రతా పథకం కింద గర్భిణీ స్త్రీలకు రూ. 21,000తోపాటు 6 పోషకాహార కిట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తాము, దీని ద్వారా అర్హత కలిగిన లబ్దిదారులకు రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. దీంతోపాటు బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేస్తామన్నారు.

## అమెరికా ప్రమాద ఘటనలో విమానం, హెలికాప్టర్‌కు మధ్య 100 అడుగుల దూరం

### అయినా ప్రమాదంపై నిపుణుల మల్లగుల్లాలు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 2:** అమెరికాలో వాసింగ్టన్ డిసిలో చోటు చేసుకున్న ఘోర వైమానిక ప్రమాదంపై దర్యాప్తులో కొన్ని కఠిన ప్రశ్నలు పుట్టుకొచ్చాయి. ఇప్పటివరకు ప్రాథమికంగా సేకరించిన ఫ్లైట్ రికార్డర్ డేటా ప్రకారం అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం 325 అడుగుల ఎత్తులో ఎగురుతోంది. ఈ లెక్కల్లో 25 అడుగుల వరకు ఎర్రర్ మార్జిన్ ఉంటుంది. ఇక హెలికాప్టర్ 200 అడుగుల ఎత్తులో ఉంది. వీటి మధ్య దాదాపు 100 అడుగుల తేడా ఉంది. దీంతో ప్రమాదం చోటు చేసుకొందని నిపుణులు మల్లగుల్లాలు పడుతున్నారు. అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బ్యూరో సభ్యుడు టాడ్ ఇన్మాన్ మాట్లాడుతూ హెలికాప్టర్ బ్లాక్‌బాక్స్ నుంచి డేటాను రికవరీ చేశాక మరింత స్పష్టత వస్తుందని చెప్పారు. వాస్తవానికి టవర్ డేటాను కొన్ని సందర్భాల్లో నమ్మలేమని వెల్లడించారు. ఈ ప్రమాదం తర్వాత రెండింటి శకలాలు పొటోమాక్ రివర్‌లో పడిపోయిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 42 మృతదేహాలను వెలికి తీశారు. దాదాపు మూడు వందల మంది అక్కడ శకలాల వెలికితీతలో పాల్గొంటున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఎయిర్ ట్రాఫిక్ వ్యవస్థ అమెరికాలో ఉంది. ఆ దేశంలో 313 ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్స్ ఉన్నాయి. కానీ, 285 కేంద్రాల్లో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ సూచించిన దాని కంటే సిబ్బంది తక్కువగా ఉన్నారు. వీటిల్లో 73 చోట్ల నాలుగో వంతు సిబ్బంది తక్కువ ఉన్నారు. ప్రమాదానికి గురైన ఆర్మీ హెలికాప్టర్‌లో ఉన్న మూడో పైలట్ ఓ మహిళగా తేలింది. ఆమె పేరు కెప్టెన్ రెబెకా ఎం లొబాచ్‌గా గుర్తించారు. 12వ ఏవియేషన్ బెటాలియన్‌కు చెందిన ఆమె బైడెన్ హయాంలో శ్వేతసౌధంలో సోషల్ ఎయిడ్ విభాగంలో కూడా పనిచేశారు. ఇటీవల ప్రెసిడెన్షియల్ మెడల్ కార్యక్రమంలో కూడా ఆమె పాల్గొన్నారు. జనవరి 30న పిఎస్ఎ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరింది. వాషింగ్టన్ సమీపంలోని రోనాల్డ్‌రీగన్ నేషన్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా రక్షణ శాఖకు చెందిన సికోర్స్కీ హెచ్ 60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండింట్లో ఉన్న వారు మొత్తం ప్రాణాలు కోల్పోయారు.

## రాష్ట్రంలో ఆగని పరువు హత్యలు

### వరుస హత్యలతో పోలీసులకు సవాల్

### విసురుతున్న నేరగాళ్లు

### తెలంగాణలో వేళ్లూనుకున్న ఉత్తరాది విష సంస్కృతి

**హైదరాబాద్, ఫిబ్రవరి, 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పరువు హత్యలు ఆగడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దళిత యువకుడు ప్రణయ్ హత్య మొదలుకొని తాజా గా సూర్యాపేట్‌లో కృష్ణ అనే మరో యువకుడిని ప్రేమ వివాహం కారణంగా సొంత బావమరిది హత్య చేయడం కలకలం రేపింది. గత డిసెంబర్ నెలలో ఇబ్రహీంపట్నంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్య సంచలనం రేపగా సూర్యాపేట్‌లో జరిగిన మరో హత్య మరింత సంచలనం రేపింది.. కాగా వరుస పరువు హత్యలు పోలీసుల సవాల్‌గా మారగా ఇందులో కొన్ని ఘటనల్లో పోలీసుల వైఫల్యం కూడా వుండడం గమనార్హం. ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితమైన పరువు హత్యలు ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలలో విష వృక్షంగా వేళ్లూనుకోవడం సామాజిక సమస్యగా మారుతోంది.

తెలంగాణలో వరుస పరువు హత్యలు పోలీసు శాఖ పనితీరును ప్రశ్నార్థకంగా చేస్తోంది. పరువు హత్యలకు పోలీసులకు సంబంధం లేదనే వాదనలు వున్నా సూర్యాపేట్‌లో జరిగిన కృష్ణ అనే యువకుడి హత్య గత డిసెంబర్ నెలలో ఇబ్రహీంపట్నంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యలో పోలీసుల వైఫల్యం వుందని హతుల బంధువులు చెబుతున్నారు. ఇందులో నాగమణిని సొంత తమ్ముడే కులాంతర వివాహం చేసుకున్నందుకు దారుణంగా నడిరోడ్డుపై హత్య చేయడం స్థానికంగా కలకలం రేపింది.

బిసి సామాజిక వర్గానికి చెందిన నాగమణి దళిత యువకుడిని నెల రోజుల క్రితం వివాహం చేసుకుంది. వీరి ప్రేమ గురించి ఇంట్లో వారికి తెలిసిన తరువాత అందరిని ఎదిరించి ఇద్దరు ధైర్యంగా యాదగిరి గుట్టలో వివాహం చేసుకున్నారు. వివాహం తరువాత తనకు ప్రాణ హాని వుందని నాగమణి పోలీసులకు ఫిర్యాదు చే యగా పోలీసులు ఆమె సోదరుడు పరమేష్‌తో పాటు కొందరికి కౌన్సిలింగ్ ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయంలో పోలీసులు కొంత కఠినంగా వ్యవ హారించి ఆమె సోదరుడిని మందలించి వుంటే నాగమణి హత్యకు గురై వుండేది కాదని కుటుంబ సభ్యులు అంటున్నారు. నాగమణి దారుణ హత్య తరువాత రెండు నెలలకు సూర్యాపేట్‌లో కృష్ణ అనే యువకుడిని ప్రేమ వివాహం కారణంగా హత్య చేశారు. ఈ హత్యకు హతుడి బావమరిది నవీన్‌తో పాటు మరో ఆరుగురు కారకు లు కాగా అందరిని పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణను హత్య చేసిన నిందితులు శవాన్ని కారు డిక్కీలో వుంచి రాత్రి అంతా పలుచోట్ల తిరిగారు.

ఆఖరుకు తన నాయ నమ్మకు ఈ శవాన్ని చూపాడు ప్రధాన నిందితుడు నవీన్. అంతకు ముందు యాదాద్రి జిల్లా భువనగిరిలో మాజీ హోంగార్డు రామకృష్ణను ప్రేమ వివాహం కారణంగా అతని సొంత మామ కిరాయి హంతకుల చేత హత్య చేయించాడు ఒక పథకం ప్రకారం రామకృష్ణను అతని మామ వెంకటేష్ కిరాయి హంతకుల చేత కిడ్నాప్ చేయించి, ఆ తరువాత హత్య చేయించి, శవాన్ని సుదూరంగా వున్న సిద్దిపేట్‌లో ఖననం చేయించాడు. రెండు రోజుల తరువాత ఈ హత్యోదంతం వెలుగు చూసింది.

ఈ ఘటనలో అందరు నిందితులు పట్టుబడ్డారు. తన కూతురు మరో కులం యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుందనే కక్షతో వెంకటేష్ అనే విఆర్ఎ తన అల్లుడిని హత్య చే యించాడు. ఈ హత్యకు ముందు 2018 సెప్టెంబర్ నెలలో ప్రణయ్ అనే యువకుడిని మిర్యాలగూడలో అతని సొంత మామ మారుతీరావు ఉత్తరప్రదేశ్‌కు చెందిన కిరాయి హంతకుల చేత హత్య చేయించాడు.

ప్రేమ వివాహం కారణంగా దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రణయ్ అనే యువకుడు పట్ట పగలు దారుణంగా హత్య కు గురవడం అప్పట్లో సంచలన ం రేపింది. దీని తరువాత రెండేళ్లకు మారుతీరావు హైదరాబాద్‌లో ఓ లాడ్జిలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు ముందు 2017లో భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం లింగరాజుపల్లెకు చెందిన స్వాతి, నరేష్‌ల ప్రేమ వివాహం కూడా విషాదంగా ముగిసింది. స్వాతి పెద్ద లను ఎదిరించి తాను ప్రేమించిన నరేష్‌ను పెళ్లి చేసుకుని కొంత కాలం ముంబాయిలో వుండి ఆ తరువాత భువనగిరికి తిరిగి వచ్చింది. దీని తరువాత యువతి తల్లి దండ్రులు నరేష్, స్వాతిలను విడదీశారు. ఆ తరువాత స్వాతి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఆత్మహత్యపైనా అనుమానాలున్నాయని నరేష్ కుటుంబీకులు ఆరోపించారు. దీని తరువాత నరేష్ తన భార్యను చూసేందుకు ఒంటరిగా రాగా దీనిని గమనించిన స్వాతి తండ్రి శ్రీనివాస్ రెడ్డి, బాబాయి సత్తిరెడ్డిలు పక్కా వ్యూహంతో అతన్ని కిడ్నాప్ చేసి, దారుణంగా కొట్టి చంపారు. అనంతరం నరేష్ శవాన్ని మూసి నదికి సమీపంలో దహనం చేసి, చివరకు ఎముకలు కూడా లే కుండా వాటిని గోనే సంచిలో దాచి మూసీలో పడ వేశారు. ఈ హత్యలు అప్పట్లో స్థానిక పోలీసులు చేధించలేక పోవడంతో మరో విభాగం పోలీసులు నిందితులను అ రెస్టు చేశారు. ఈ ఘటన తరువాత 2019లో హేమంత్ అనే యువకుడు సంగారెడ్డిలో హత్యకు గురయ్యాడు. వేరు వేరు సామాజిక వర్గాలకు చెందిన యువతి, యువ కుల వివాహాన్ని యువతి కుటుంబీకులు అంగీకరించక పోవడంతో వివాదం చెలరేగి చివరకు హేమంత్ హత్యకు దారితీసింది. ఈ ఘటనలోనూ పోలీసులు సకాలంలో స్పందించలేదని ఆరోపణలు వచా ్చయి. ఈ రెండు ఘటనలకు భిన్నంగా నగర శివార్లలోని అబ్దుల్లా పూర్‌మెట్‌లో 2016 ఆగస్టు నెలలో విజయలక్ష్మీ అనే యువతి దారు ణ హత్య తీవ్ర మరింత సంచలనం రేపింది. ఈ హత్యలో 16 మంది బంధువులు నిందితులుగా వున్నారు.

**ప్రేమ వివాహాల సమయంలో ఇరు కుటుంబాలకు సామాజిక మార్పులపై కౌన్సెలింగ్ ఇవ్వాలంటున్న నిపుణులు**

ఇదిలా వుండగా ప్రేమ వివాహాల సమయంలో భవిష్యత్తులో ఎలాంటి గొడవలు, పరువు హత్యలు జరగకుండా వుండేందుకు ఇరు కుటుంబాల వారికి సామాజిక మా ర్పులపై కౌన్సిలింగ్ ఇవ్వాలని మానసిక నిపుణులు, ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. ఈ తరహా కౌన్సిలింగ్ వల్ల ఇరు కుటుంబాల్లో మార్పులు వచ్చి నవ దంపతుల సుఖంగా వుండేందుకు వీలుంటుందని వారంటున్నారు. ఇదే సమయంలో ప్రేమ వివాహం చేసుకున్న వారు కొంతకాలం కుటుంబాలకు దూరంగా వుండాల ని వారంటున్నారు.

# 'లైలా' సాంగ్ విడుదల

మాస్ కా దాస్ విశ్వక్సేన్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ లైలా ఎక్స్ యిటింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేస్తోంది. విశ్వక్సేన్ సోను మోడల్, లైలాగా రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించడం చాలా క్యురియాసిటీ పెంచింది. ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. టీజర్, మొదటి రెండు పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. థర్డ్ సింగిల్ ఓహో రత్తమ్మ విడుదలైంది. లియోన్ జేమ్స్ కంపోజ్ చేసిన ఓహో రత్తమ్మ అందరినీ అలరించే మాస్ ఫీస్ట్ అందిస్తుంది. ట్రాక్ థ్రంపింగ్ టెంపో ప్రారంభం నుండి ముగింపు వరకు హై ఎనర్జీ ఇచ్చింది. పెంచల్ దాస్, మధుప్రియల జానపద శైలి వోకల్స్ ఈ పాటకు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి, పెంచల్ దాస్ రూరల్, మాస్ సాహిత్యాన్ని అందించారు. సోషల్ మీడియా సెన్సేషనల్ ట్రాక్ కోయారే కోయ్ కోయ్ చేర్చడం పాటకు ఎక్స్ట్రా ఎంటర్‌టైన్మెంట్ ని యాడ్ చేసింది. విశ్వక్‌సేన్ ట్రెడిషనల్ నుంచి అల్ట్రాస్టైలిష్ వరకు వివిధ రకాల లుక్స్‌తో ఆకట్టుకున్నారు. పాటకు డైనమిక్ ఎనర్జీని యాడ్ చేశాడు. అతని డ్యాన్స్ మూమెంట్స్ ఎలిగెంట్‌గా వున్నాయి. ఆకాంక్ష శర్మ తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. సెట్టింగ్‌లు థీమ్‌కు పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అయ్యాయి. కొరియోగ్రఫీ వైబ్‌ను మరింతగా పెంచింది. ఈ పాట థియేటర్లలోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు విజిల్స్ కోయ్యడం ఖాయం. ఇది అభిమానులకు పూర్తి స్థాయి మాస్ విందు. లైలా చిత్రానికి స్క్రీన్‌ప్లే వాసుదేవ మూర్తి రాశారు, రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నా రు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. లైలా ఫిబ్రవరి 14న బిగ్ స్క్రీన్స్‌లో విడుదల కానుంది. తారాగణం: విశ్వక్సేన్, ఆకాంక్ష శర్మ, సాంకేతిక సిబ్బంది: బ్యానర్: షైన్ స్క్రీన్స్, నిర్మాత: సాహు గారపాటి, దర్శకత్వం: రామ్ నారాయణ్, రచయిత: వాసుదేవ మూర్తి, సంగీత దర్శకుడు: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రాఫర్: రిచర్డ్ ప్రసాద్, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి పీఆర్వో: వంశీశేఖర్ మార్కెటింగ్:ఫస్ట్‌షో.



# 'సూర్యాపేట్ జంక్షన్' ట్రైలర్ లాంచ్

కొత్తగా మా ప్రయాణం చిత్రంలో హీరోగా నటించిన ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా నటించిన మూవీ 'సూర్యాపేట్ జంక్షన్. యోగాలక్ష్మి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై అనీల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్ శ్రీనివాసరావు, నిర్మించిన ఈ చిత్రానికి రాజేష్ నాదెండ్ల దర్శకత్వం వహించాడు. ఈశ్వర్, నైనా సర్వర్, అభిమన్యు సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం తాజాగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా హీరో ఈశ్వర్ మాట్లాడుతూ,ఈ సినిమాకు కథ నేనే రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ. గవర్నమెంట్ నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు ఎలాంటి సమస్యల్లో ఇరుక్కుంటున్నారో తెలిపే సబ్జెక్టు ఇది. మంచి కథ ఉంటే తెలుగు ప్రేక్షకులు అదరిస్తారు, అందుకే ఈ సినిమా చేశాం. సినిమాలో యాక్షన్ సీన్స్ కూడా సహజంగానే ఉంటాయి. 4 పాటలు ఉన్నాయి. కథను డైరెక్టర్ రాజేశ్ చాలా బాగా తెరకెక్కించారు. మీరందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాను అన్నారు. హీరోయిన్ నైనా మాట్లాడుతూ,ఈ సినిమాలో నేను జ్యోతి పాత్రలో నటించాను. యూత్‌కు బాగా నచ్చే సబ్జెక్టు ఇది. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు. ప్రతి ఒక్కరు సూర్యాపేట్ జంక్షన్ మూవీని ఆదరించాలని కోరుకుంటున్నాను. అని అన్నారు.



ప్రొడ్యూసర్ అనిల్ కుమార్ కాట్రగడ్డ మాట్లాడుతూ, మా హీరో ఈశ్వర్ నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చినందుకు థాంక్స్. మా హీరో కథకి పూర్తి న్యాయం చేశాడు. కన్నడ, మలయాళం చిత్రాలలో హీరోయిన్‌గా నటించిన నైనా సర్వర్‌కి ఇది తెలుగులో మొదటి సినిమా. అయినప్పటికీ చాలా చక్కగా నటించింది. గబ్బర్ సింగ్ ఫేమ్ అభిమన్యు సింగ్ విలన్ రోల్ ఈ సినిమాకు కీలకం. ఇంకా చమ్మక్ చంద్ర, భాషా, లక్ష్మణ్ సంజయ్ (బలగం ఫేమ్) హరీష్ చాలా మంది ఈ సినిమాలో చాలా చక్కగా నటించారు. రోషన్ సాలూరి, గౌర హరి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఇందులో ఉన్న మూడు పాటలు, ఒక ఐటమ్ సాంగ్ ప్రేక్షకులను ఖచ్చితంగా అలరిస్తాయి. నిర్మాతలు ఈ సినిమాను ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను త్వరలో రిలీజ్ చేస్తాము అని అన్నారు.

# 'ది ప్యారడైజ్'కు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ ( ఎస్ఎల్‌వి సినిమాస్) నిర్మాత సుధాకర్ చెరుకూరి 'దసర్హా' బ్లాక్ బస్టర్ విజయం తర్వాత 'ది ప్యారడైజ్' కోసం కొలాబరేట్ అయ్యారు. ఈ కొత్త చిత్రం త్వరలో ప్రారంభం కానుంది. ప్రీప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. నాని కూడా తన పాత్ర కోసం సిద్ధం కావడానికి ఇంటెన్స్‌గా జిమ్ చేస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించడం ఖాయమైయింది. జెర్సీ, గ్యాంగ్‌లీడర్ హిట్స్ తర్వాత నాని, అనిరుధ్ కలిసి పనిచేస్తున్న మూడవ చిత్రం ఇది. గత రెండు సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి, అప్ కమింగ్ ప్రాజెక్ట్ కోసం అంచనాలు భారీగా వున్నాయి. మేము మా హ్యాట్రిక్ పై ఉన్నాము ఇది ఒక అద్భుతం అవుతుంది. సినిమా. స్వాగతం, డియర్ అని నాని పోస్టు చేశారు. 'ఇది చాలా స్పెషల్. మైడియర్ అని అనిరుద్ పోస్టు చేశారు. శ్రీకాంత్ ఓడెలా పవర్ ఫుల్ లార్జర్ దెన్ లైఫ్ కథను ఇంటెన్స్ స్క్రీన్‌ప్లేతో రూపొందించారు, ఇది నానిని పూర్తిగా కొత్త, మాస్‌డ్రైవ్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని గ్రాండ్ గా స్కేల్‌లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటివరకు నాని యొక్క మోస్ట్ హై బడ్జెట్ వెంచర్. మిగిలిన నటీనటులు,సాంకేతిక నిపుణుల వివరాలు మేకర్స్ త్వరలోనే తెలియజేస్తారు.



# 'డ్యాన్స్ ఐకాన్ 2 -వైల్డ్ ఫైర్' కంప్లీట్ డ్యాన్స్ షో: ఓంకార్




డ్యాన్స్ లవర్స్‌ను మెస్మరైజ్ చేసిన డ్యాన్స్ ఐకాన్ సీజన్ 1కు కొనసాగింపుగా 'డ్యాన్స్ ఐకాన్2 సీజన్ వైల్డ్ ఫైర్' ఫిబ్రవరి 14వ తేదీ నుంచి ఓహ్ ఓటీటీలో ప్రీమియర్‌కు రెడీ అవుతోంది. ఈ షోకు ఓంకార్, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, శేఖర్ మాస్టర్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తున్నారు. 'డ్యాన్స్ ఐకాన్ 2 వైల్డ్ ఫైర్ల్ ఫైర్ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా కంటెస్టెంట్స్ పాల్గొం టున్నారు. హిప్ హాప్, క్లాసికల్, కాంటెంపరరీ స్టైల్స్‌లో డ్యాన్స్ పర్ ఫార్మెన్స్ ఆకట్టుకోనున్నాయి. ఈ నేపథ్యంలో 'డ్యాన్స్ ఐకాన్ 2 వైల్డ్ ఫైర్ల్ ప్రెస్ మీట్‌ను ఈరోజు హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోస్ట్ ఓంకార్ మాట్లాడుతూ,డ్యాన్స్ ఐకాన్ 1 ఎంత సక్సెస్ అయ్యిందో మీకు తెలుసు. ఇప్పుడు 'డ్యాన్స్ ఐకాన్ 2 వైల్డ్ ఫైర్ల్‌ను మీ ముందుకు తీసుకొస్తుండటం సంతోషంగా ఉంది. ఫరియా అబ్దుల్లా హోస్ట్‌గా చేస్తుండటం హ్యాపీగా ఉంది. శేఖర్ మాస్టర్ సెకండ్ టైమ్ ఈ షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. డ్యాన్స్, ఎంటర్ టైన్ మెంట్..ఇలా మీకు కావాల్సిన ప్రతి ఎలిమెంట్ మా షోలో ఉంటుంది. 'డ్యాన్స్ ఐకాన్ 2- వైల్డ్ ఫైర్ల్‌లో ఐదుగురు కంటెస్టెంట్స్ మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తారు. పంచభూతాల్లాంటి వారి పర్ ఫార్మెన్స్ మిమ్మల్ని మెస్మరైజ్ చేస్తుంది. ముగ్గురు హోస్ట్ లతో పాటు మరో నలుగురు మెంటార్స్ ఉంటారు. సింగర్ జాను లైరి, ప్రకృతి, మానస్, దీపిక ఈ నలుగురు మెంటార్స్ ఉంటారు. 'డ్యాన్స్ ఐకాన్ 2 - వైల్డ్ ఫైర్ లో ఫస్ట్ రౌండ్ విజేతలను మెంటార్స్ నిర్ణయిస్తే, సెకండ్ రౌండ్‌లో ఎవరు విజేతలు అనేది ప్రేక్షకులు తమ ఓటింగ్ ద్వారా డిసైడ్ చేస్తారు. 'డ్యాన్స్ ఐకాన్ 2 - వైల్డ్ ఫైర్ల్ చేసే అవకాశం ఇచ్చిన ఆహాకు థ్యాంక్స్. మమ్మల్ని సపోర్ట్ చేస్తున్న మీడియాకు థ్యాంక్స్. 'డ్యాన్స్ ఐకాన్ 2 వైల్డ్ ఫైర్ల్ మిమ్మల్ని డెఫనెట్‌గా ఎంటర్ టైన్ చేస్తుంది. నేను సినిమాకు వర్క్ చేశా టీవీకీ వర్క్ చేశా. ఏ ప్లేస్‌లో వర్క్ చేసినా ప్రొడక్షన్ వ్యాల్యూస్ మాత్రం టాప్ క్వాలిటీలో ఉండేలా చూసుకుంటా. 'డ్యాన్స్ ఐకాన్ 2 వైల్డ్ ఫైర్ల్ హోల్ సమ్ ఎంటర్ టైన్ మెంట్ ఇచ్చే కంప్లీట్ డ్యాన్స్ షో. అన్నారు. హోస్ట్ ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ, డ్యాన్స్ ఐకాన్ సీజన్ 1 టైమ్ లో కూడా నన్ను హోస్ట్‌గా అడిగారు. అప్పుడు కొన్ని ప్రాజెక్ట్స్ వల్ల

## నివేత థామస్ నయా లుక్



# 'చావా' మీట్ ది ప్రెస్

విక్కీ కౌశల్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఛావా'. దినేష్ విజన్ నిర్మాతగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రిలీజ్ కాబోతోన్న ఈ మూవీ ప్రమోషన్స్ ప్రస్తుతం ఊపందుకున్నాయి. ఈ ప్రమోషనల్ కార్యక్రమాల్లో భాగంగా చిత్రయూనిట్ హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ మేరకు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విక్కీ కౌశల్ మాట్లాడుతూ, 'ఛావా సినిమా కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో ప్రిపేర్ అయ్యాను. యుద్ధాలు, గుర్రపుస్వారీల్లో శిక్షణ తీసుకున్నాను. వీటన్నంటికంటే కూడా ఛత్రపతి శంభాజీ మహారాజ్ అనే పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడం, నా మనసుని ఆ పాత్ర కోసం సన్నద్ధం చేసుకోవడం సవాలుగా అనిపించింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ శ్రీరాముని వంటి వారు. ఛత్రపతి శంభాజీ మహారాజ్ సింహం వంటి యోధులు. ఈ పాత్రలను ఇంత కంటే గొప్పగా నేను వర్ణించలేను. లక్ష్మణ్ మొదటి నుంచి కూడా నన్ను పాత్ర పేరుతోనే పిలుస్తుంటారు. నేను ఈ పాత్రను పోషించగలను అనే నమ్మకాన్ని అలా ఆయన నాలో ముందు నుంచీ కలిగిస్తూనే వచ్చారు. నిజమైన యోధుల కథను చెబుతున్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. ఇంత గొప్ప చిత్రాన్ని నిర్మించిన దినేష్ విజన్ గారికి, తెరకెక్కించిన లక్ష్మణ్‌కి ధన్యవాదాలు. రెహమాన్ సంగీతం సినిమా స్థాయిని పెంచేసింది. ఇలాంటి పాత్ర నాకు దొరకడం నా అదృష్టం. జీవితంలో ఒక్కసారే ఇలాంటి అవకాశం వస్తుంది. ఈ మూవీ చాలా గొప్పగా వచ్చింది. అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. రష్మిక మందన్న మాట్లాడుతూ, 'ఛావా' చిత్రంలో మాటలకు అందని భావం ఉంటుంది. ఇందులో ఓ దైవత్వం ఉంటుంది.. అంతులేని ప్రేమ ఉంటుంది.. అందుకే ఈ చిత్రాన్ని చేయాలని ఫిక్స్ అయ్యా. ఈ మూవీని చూసిన ప్రతీ సారి నేను ఏడ్చేస్తాను. అంత అద్భుతంగా ఉంటుంది. ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్, జానే తూ అనే పాట అందరినీ మెస్మరైజ్ చేస్తుంటుంది. విక్కీ చుట్టూ




# 'ఆకాశంలో ఒక తార్ణ' ఘనంగా ప్రారంభం

మల్టీటాలెంటెడ్, దక్షిణాది స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ సినిమా సినిమాకీ అభిమాన గణాన్ని పెంచుకుంటూ పోతున్నారు. దుల్కర్‌కు ప్రస్తుతం తెలుగులో తిరుగులేని క్రేజ్ ఏర్పడింది. వరుసగా బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాలతో తెలుగు ఆడియెన్స్‌ను మెప్పిస్తున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ క్రేజీ డైరెక్టర్ పవన్ సాదినేనితో సినిమా చేస్తున్నారు.

లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్‌ను పెట్టారు. ఇక ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ కోసం ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వినీదత్, గుణ్ణం గంగరాజు కలిసి ముందుకు వచ్చారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు ఈ చిత్ర నిర్మాణంలో భాగమయ్యాయి.

'ఆకాశంలో ఒక తార్ణ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, అశ్విని దత్ వంటి వారు హాజరయ్యారు. ముహూర్తం షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, అశ్విని దత్ కెమెరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి గుణ్ణం గంగరాజు దర్శకత్వం వహించారు. నటీనటులు, ఇతర సిబ్బందికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. టాలెంటెడ్ సుజిత్ సారంగ్ సినిమాటో గ్రాఫర్‌గా, శ్వేత సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేయనున్నారు. 'ఆకాశంలో ఒక తార్ణ తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారు.



# 'సంక్రాంతికి వస్తున్నాం' నా కెరీర్ లో ఓ మిరాకిల్

## డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో డైరెక్టర్ అనిల్ రావిపూడి



నిర్మాత దిల్ రాజు, విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పొంగల్ బ్లాక్ బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మించారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటించారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో చార్ట్ బస్టర్ మ్యూజిక్ ఇచ్చారు. జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అందరినీ అద్భుతంగా అలరించి, రికార్డ్ బ్రేకింగ్ హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో పొంగల్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్ నిర్వహించారు.డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ, ఆడియన్స్ లేకపోతే ఈ విజయాన్ని మేము ఊహించలేము. ఎర్లీ మార్నింగ్ షోస్‌కి ఫ్యామిలీస్‌తో కలిసి సినిమా చూశారంటే మామూలు విషయం కాదు. ఇలాంటి అద్భుతాలు చూస్తూ ఎంజాయ్ చేయడమే. నా కెరియర్‌లో ఇది ఒక మిరాకిల్. ఈ విజయాన్ని ఆస్వాదిస్తున్నాను. ఈ సినిమా సక్సెస్ లో మేజర్ క్రెడిట్ వెంకటేష్‌కి దక్కుతుంది. ఆయన సపోర్ట్‌ని మర్చిపోలేను. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య కూడా చాలా అద్భుతంగా పెర్ఫామ్ చేయడంతో పాటు ప్రమోషన్స్‌లో కూడా చాలా హెల్ప్ చేశారు. సినిమా టీమ్ అందరికీ పేరుపేరునా థాంక్యూ నిర్మాత హ్యాపీగా ఉండాలనే టార్గెట్ పెట్టుకుని సినిమాను తీస్తుంటాను. ఇప్పటివరకు ఎనిమిది సినిమాలు చేస్తే ఆరు సినిమాలు రాజుతో చేశాను. ఎస్విసి బ్యానర్ ఎన్నో గొప్ప సినిమాలు తీసిన బ్యానర్. ఆ బ్యానర్ కొన్ని జనరేషన్స్ ఉండాలి, ఉంటుంది. డిస్ట్రిబ్యూటర్స్ ఈవెంట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. డిస్ట్రిబ్యూటర్స్‌కి వచ్చిన నెంబర్స్ అన్ని చాలా అద్భుతంగా ఉన్నాయి. ఈ సంవత్సరం సంక్రాంతి డిస్ట్రిబ్యూటర్స్‌కి మెమరబుల్ అయింది. ఈ సినిమా ద్వారా నేనెప్పుడూ వినలేను, చూడలేనేమో అనుకునే రెండు జరిగాయి.ఆరు రోజుల్లో 100 కోట్లు షేర్ కొట్టింది. రీజనల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న 300 గ్రాస్ నెంబర్ చూడబోతున్నాను. చాలా హ్యాపీగా ఉంది. నెక్స్ట్ చేయబోయే సినిమాలకు చాలా బాధ్యత పెరిగింది. మిమ్మల్ని ఎంటర్టైన్ చేయడానికి ఎప్పుడూ ముందు వుంటాను. ఈసారి డిస్ట్రిబ్యూటర్స్‌తో వేడుక జరిగింది నెక్స్ట్ ఎగ్జిబిటర్స్‌తో కూడా ఒక ఈవెంట్ చాలా గ్రాండ్‌గా నిర్వహించి సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్ షీల్డ్స్‌ని అందరికీ ఇవ్వాలని భావిస్తున్నాం. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు.

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్ పెడతామని చెప్పగానే చాలా ఆనందంగా అనిపించింది. సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్ అని చెప్పుకునే పరిస్థితి నెలకొంది. వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి.కల్చర్ మారిపోయింది.20ఏళ్ల పాటు ఒక ప్రొడ్యూసర్‌తో డిస్ట్రిబ్యూటర్స్ కంటిన్యూ అవ్వడం అనేది ఇండస్ట్రీలో చాలా అరుదు. డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ థాంక్యూ. బడ్జెట్ కాదు కథలే ఇంపార్టెంట్. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలో నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని సక్సెస్‌లు క్లాసిక్సులు వచ్చాయో అందరికి తెలిసిందే. మేము కూడా కాంబినేషన్స్ అని గత నాలుగు ఐదు ఏళ్ళుగా తడబడుతున్నాం. అనిల్ మళ్ళీ మాకు రూటు చూపించారు. సంక్రాంతికి వస్తున్నాం సెన్సేషనల్ హిట్. సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్ తో ఒక రహదారి వేసి ఇచ్చాడు. మా సంస్థ నుంచి అద్భుతమైన సినిమాలు రావడానికి ఇది మాకు ఒక బిగ్ ఎనర్జీ. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది. అనిల్‌తో ఆరు సినిమాలు చేస్తే ఆ 6 విజయవంతం అయ్యాయి. అనిల్‌తో సినిమా తీసినప్పుడు నిర్మాతగా ఒత్తిడికి లోనవ్వలేదు. తనతో నాకు చాలా కంఫర్టబుల్గా ఉంటుంది. ఎక్కడో పడిపోతున్న మమ్మల్ని పైకి తీసుకొచ్చి నిలబెట్టాడు. మళ్ళీ అద్భుతమైన సినిమాలు తీస్తాం. రిజల్ట్స్ 100 వస్తాయి. వెంకటేష్ గారు ప్రొడ్యూసర్ ఫ్రెండ్లీ హీరో. ఆయన నిర్మాతలు ఇచ్చే గౌరవం మాములుగా ఉండదు. అందుకే అద్భుతంగా ఆయనతో నాలుగు సినిమాలు చేయగలిగాం. ఈ సినిమా ఇంత పెద్ద విజయం అవ్వడానికి కారణమైన వెంకటేష్‌కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు అన్నారు.నిర్మాత శిరీష్ మాట్లాడుతూ, ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన అనిల్ రావిపూడికి థాంక్యూ.మా సంస్థ డిస్ట్రిబ్యూషన్ నుంచే మొదలైంది. ఒక 20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న వాల్యూ ఈరోజు లేదు ఇలాంటి సమయంలో డిస్ట్రిబ్యూటర్ తలెత్తుకునేలా చేసిన సినిమా సంక్రాంతికి వస్తున్నాం. నిజాయితీగా ఈ సినిమా ఇంత చేసింది అని తలెత్తుకుని చెప్తున్న సభ ఇది. మాతోపాటు జర్నీ చేస్తున్న మా డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ థాంక్యూఅన్నారు. డిస్ట్రిబ్యూటర్ సాయి కృష్ణ మాట్లాడుతూ. అనిల్ రావిపూడి వరుసగా హిట్లు తీసుకుంటూ వస్తున్నారు. తన ప్రతి సినిమాకి నేను రైటర్‌గా చేస్తూ వచ్చిన ప్రతి రూపాయిని శిరీష్ రాజుకి ఇచ్చి డిస్ట్రిబ్యూషన్‌లో పెట్టండి నాకు డబ్బులు కావాలని అడుగుతుంటాను. అనిల్ రావిపూడి సినిమా చూడాలంటే మీరు థియేటర్లో చూడండి అన్నారు.

# ఆధునికతను అందిపుచ్చుకుంటూ..

అవకాశాలను ఎవరూ ఇవ్వరు... మనమే సృష్టించుకోవాలి. అప్పుడు మనం నిలబడటమే కాదు నలుగురికి తోడ్పాటునీ అందించడం అంటారు వర్కాల శోభ. యాదాద్రి భువనగిరిడ్డి జిల్లా కొయ్యలగూడేనికి చెందిన ఆమె... నూలు, జ్యూట్ ఉత్పత్తుల తయారీతో తాను ఉప పొందుతూ మరికొంతమందికి ఆర్థిక భరోసా ఇచ్చారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితులు, సామాజిక కట్టుబాట్లు... కారణం ఏదైతేనేం ఎనిమిదో తరగతిలో చదువు మాన్పించి నాకు పెళ్లి చేశారు. అయితే, నాకు చిన్నప్పటి నుంచీ నా కాళ్లపై నిలబడాలనేది ఆశయం. అందుకే అప్పటికే దర్జీగా పనిచేసే నాన్న దగ్గర కుట్టుపని నేర్చుకున్నా అత్తింట్లోకి అడుగుపెట్టాక మగ్గంపై వస్త్రాలు నేయడం ఆరంభించా. ప్రతి పనికీ ఓ సంచీ అవసరం. అయితే, అందరూ ఉప యోగించే సింథటిక్, ప్లాస్టిక్ ఆరోగ్యానికీ, పర్యావరణానికి నష్టం కలిగించేవే మగ్గంపై నేసే నూలు వస్త్రాన్ని వాడి తాజా ఫ్యాషనరీకి అనుగుణంగా పర్యావరణ బ్యాగులు తయారు చేయాలనుకుంటున్నాను. దీనివల్ల కొందరికి ఉపాధి కల్పించడంతో పాటు సమాజానికి కొంత మేలు చేసినట్లు భావించాను. శ్రీదేవి సమభావ సంఘంలో సభ్యురాలిగా చేరారు. చేనేత వస్త్రంతో రకరకాల వినిమయ వస్తువులు తయారు చేయడం మొదలుపెట్టా.



ఇందుకోసం స్వయం సహాయక బృందంలో కొంత రుణం, మరికొంత నా పొదుపు చేసిన మొత్త సుమారు రూ.15 లక్షల పెట్టుబడితో వ్యాపారాన్ని అరంభించా. షెడ్డు నిర్మించుకుని, పది అరు కుట్టు మెషీన్లు ఏర్పాటు చేసుకున్నా. నూలు, జనపనార సంచులతో పాటు ఇంట్లో ఉపయోగిం వివిధరకాల ఉత్పత్తులనూ మార్కెట్లోకి తీసుకువచ్చాం. వాటిల్లో ఇక్కత్, కలంకారీ నూలు, జ్యూట్ వస్త్రాలు కలగలిపిన కుర్తీలు, టాప్లు, దివాన్సెట్లు, కుషన్లు, ఫ్రిజ్, టీవీ కవర్లు, ట్రావెల్ ల్యాప్టాప్ బ్యాగులెన్నో ఉన్నాయి. తక్కువ కాలంలోనే వీటన్నింటికీ ఆదరణ దక్కింది. ఈ ప్రొడక్ట్స్ ని దేశవ్యాప్తంగా సరఫరా చేయగలుగుతున్నాం. సుమారు పదిహేను మంది మహిళలకు ఉపాధి కల్పించా. కాలంతోపాటు మనమూ మారాలి. ఆధునిక అవసరాలను అందిపుచ్చుకోవాలి.. అప్పుడే మార్కెట్లో నిలబడగలమని నమ్ముతా. భవిష్యత్తులో మరింత మందికి ఉపాధిని అందించాలనుకుంటున్నా.



# సమాజంలో మార్పు కోసం..



**ఓవైపు ఆధ్యాత్మిక బోధనలు.. మరోవైపు వ్యక్తిత్వ వికాస పాఠాలు.. ఇంకోవైపు యువతలో చైతన్యం రగిలించే మాటలు.. ఇలా తనదైన ప్రసంగాలతో చిన్న వయసులోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది జయ కిశోరి. సమాజంలో మార్పు కోసం అనుక్షణం పరితపించే ఆమె ఇటీవలే మహా కుంభమేళాలో పాల్గొంది.** త్రివేణి సంగమంలో పుణ్య స్నానమాచరించి పులకించిపోయింది. ఈ సందర్భంగా తన సంతోషాన్ని పంచుకుంటూనే నేటి యువతరాన్ని ఉద్దేశించి మాట్లాడిందామె. వ్యక్తిగత, వృత్తిపరమైన ఒత్తిళ్లతో సతమతమవుతున్న నేటి యువత.. ఈ మానసిక సమస్యలను దూరం చేసుకోవాలంటే కుంభమేళా వంటి ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొనేలా మరోసారి తన ప్రసంగంతో స్ఫూర్తి నింపింది జయ. ఆమె మాటలు ఎంతోమందిని ఆలోచింపజేస్తున్నాయి.

**ఈ అనుభూతి.. మర్చిపోలేను!**

ఉత్తరప్రదేశ్లోని వారణాసిలో జరుగుతోన్న మహా కుంభమేళాలో లక్షలాది మంది భక్తులు పాల్గొని భక్తిపారవశ్యంతో పులకించిపోతున్నారు. సామాన్యులతో పాటు దేశవిదేశీ ప్రముఖులూ ఇక్కడి పుణ్యజలాల్లో స్నానమాచరిస్తున్నారు. ఈ క్రమంలోనే యువస్ఫూర్తి దాయక వక్త జయా కిశోరి కూడాఇటీవలే కుంభమేళాలో సందడి చేసింది. పుణ్యస్నానమాచరించాక మరోసారి తన ప్రసంగంతో నేటి యువతలో స్ఫూర్తి నింపిందామె. ఈ ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొనడంతో నా మనసు మునుపెన్నడూ లేనంత సంతోషంతో నిండిపోయింది. నేటి యువత ఎక్కువగా స్మార్ట్ ఫోన్లతోనే సమయం గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు వ్యక్తిగత, వృత్తిపరమైన ఒత్తిళ్లతో చాలామంది సతమతమవుతున్నారు. ఇలాంటి మానసిక సమస్యలన్నీ దూరం చేసుకొని.. జీవితంలో అసలు సిసలైన సంతోషాన్ని సొంతం చేసుకోవాలంటే కుంభమేళా.. వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలి. దైవ నామస్మరణ మనసుకెంతో హాయినిస్తుంది. నేను తొలిసారి పుష్కర స్నానం చేశాను. త్రివేణి సంగమమైన ప్రయాగలో, పవిత్రమైన గంగానదిలో స్నానమాచరించడం మర్చిపోలేని అనుభూతినిచ్చింది. ఈ పుణ్యస్నానంతో నా మనసు మరింత తేలికపడింది. నా శరీరంలోకి ఏదో కొత్త శక్తి వచ్చిన అనుభూతి కలిగింది. చదువు, ఉద్యోగం, కెరీర్ పరమైన ఒత్తిళ్ల ఎదుర్కొనే ఎంతోమందికి ఈ పాజిటివిటీ కావాలి.. అంటూ ఆధ్యాత్మిక చింతన వల్ల ఒనగూరే ప్రయోజనాల్ని గుచ్చిందీ యూత్ ఐకాన్, దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన.. వంటి అంశాలకు సంబంధించిన ఇలాంటి ప్రసంగాలతో ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతుంటుంది జయ.

**విధిని నమ్ముతా!** భవిష్యత్తులో అలా ఉండాలి.. ఇది చేయాలి.. అనుకుంటాం.. ఎన్నెన్నో ప్రణాళికలు వేసుకుంటాం.. కానీ మనం ఎన్ని అనుకున్నా జరిగేది జరగక మానదు అంటోంది జయ. ఆమె అసలు పేరు జయ శర్మ. రాజస్థాన్లోని సుజంగర్ అనే ప్రాంతంలో ఓ సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిందామె. ఆధ్యాత్మిక వాతావరణంలో పెరగడం వల్ల చిన్నతనం నుంచే ఆమెలో భక్తి భావం రెట్టింపైంది. దీంతో ఏడేళ్ల వయసు నుంచే తన తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ దగ్గర్నుంచి ఎన్నో భజనలు, భక్తి గీతాలు నేర్చుకొని ఆలపించడం ప్రారంభించారు. ఈ గీతాలు, శ్లోకాల్లోని కఠినమైన సంస్కృత పదాలను కూడా ఆమె పొల్లు పోకుండా పలకడం చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. ఇలా ఆధ్యాత్మికతపై ఆమెకున్న మక్కువే ఆమెను ప్రవచనకర్తగా, మోటివేషనల్ కోచ్గా మార్చాయి. నలుగురిలో స్ఫూర్తి నింపేలా, సానుకూల దృక్పథంతో ఎంతో ముందుకు సాగేలా ఆమె చేసే ప్రసంగాలు మందిలో ప్రేరణ కలిగిస్తాయి. నేను భవిష్యత్తు కంటే విధిని ఎక్కువగా నమ్ముతాను. మనం సన్మార్గంలో ముందుకెళ్లాలంటే ఆత్మ విశ్వాసం, సానుకూల దృక్పథం అలవర్చుకోవడం తప్పని సరి! అలాగే ఉత్తమ పేరెంటింగ్తోనే పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుంది.. ఓపిక, స్థిరత్వం, ప్రశాంతమైన మనసు.. జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలంటే ఇవే కీలకం! నాలో ఇలాంటి సానుకూల దృక్పథం అలవడడానికి భగవద్గీత పఠనం, నా జీవితాను భవాలు, కుటుంబ సభ్యులందించిన ప్రోత్సాహమే కారణం.. అంటోంది జయ. ఆయా వేదికలపై స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేసే ఆమె.. సోషల్ మీడియా వేదికగా జీవితానికి సంబంధించిన విలువల్ని బోధిస్తుంటుంది. ఇలా సమాజంలో మార్పు కోసం పరితపిస్తున్న ఈ ఆధ్యాత్మిక వేత్త భారత ప్రభుత్వం అందించిన నేషనల్ క్రియేటర్స్ అవార్డును సొంతం చేసుకుంది.



**నచ్చినట్లు ఉండడంతో తప్పేముంది?**

అయితే సభలు, సమావేశాల్లో సాదాసీదా ఆహారంతోనే కనిపిస్తుంటుంది జయ. కానీ ఇటీవల ఓ సందర్భంలో రూ.2 లక్షల విలువ చేసే టోటే బ్యాగ్తో దర్శన మిచ్చిందామె. అది చూసి చాలామంది జంతు చర్మాలతో తయారు చేసిన లెదర్ బ్యాగేమో అని పొరపడ్డారు. చెప్పేదొకటి.. చేసే దొకటి.. అంటూ ఆమెను ట్రోల్ చేశారు. అయినా సంయమనం పాటిస్తూ తనదైన రీతిలో ఈ విమర్శలకు చెక్ పెట్టింది జయ. ఈ బ్యాగ్ నేను మనసు పడి కస్టమైజ్ చేయించు కున్నా.. అది లెదర్ తయారుచేసిన బ్యాగ్ కాదు. ఇప్పుడే కాదు.. జీవితంలో నేనెప్పుడూ లెదర్ వస్తువులు ఉపయోగించలేదు. నేను సాధ్విని కాదు.. అందరిలాంటి సాధారణ అమ్మాయినే! నాకూ కొన్ని ఇష్టాయిష్టాలుంటాయి. అలా నా ఇష్టం మేరకే ఈ బ్యాగ్ను డిజైన్ చేయించుకున్నా.. నా పేరు కూడా రాయించుకున్నా. అయినా నాకు నచ్చి నట్లుగా నేను ఉండాలనుకోవడంలో తప్పేముంది? కాబట్టి నిజానిజాలు తెలుసుకోకుండా ఇలాంటి విమర్శలు చేయడం ఆపేసి చదువు, కష్టపడి సంపాదించడంపై దృష్టి పెట్టండి.. మీరు, మీ కుటుంబం సంతోషంగా ఉంటారు.. అంటూ సున్నితంగా తనపై వచ్చిన విమర్శల్ని తిప్పి కొట్టింది యూత్ స్టార్. ప్రస్తుతం 29 ఏళ్ల వయసులో తన ప్రసంగాలతో, సోషల్ మీడియా పోస్టులతో ఎంతో మందిని ఆధ్యాత్మికత వైపు నడిపిస్తోన్న జయఫ్రాఇన్ఫెక్షన్ పేజీకి 1.2 కోట్ల మందికి పైగా ఫాలోవర్లయ్యారు.

# గడువు దాటితే వాడవద్దు..



అందంగా కనిపించడం కోసం మేకప్ వేసుకుంటాం. మళ్లీ రాత్రికి దాన్ని తొలగించి నిద్ర పోతాం. ఇలా అలంకరణ ఒక్కటే ఉంటే సరిపోదు. దానికోసం ఉపయోగించే సాధనాల గడువు తేదీలూ గమనిస్తుండాలి.

అందమైన కలువలాంటి కళ్ల కోసం వాడే ఐలైనర్, మస్కారా, కాజల్ వంటివి గడువులోగా వాడేయాలి. ఎందుకంటే వీటి గడువు మూడు నెలల మాత్రమే. గడువు దాటితే ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మేకప్ కోసం వాడే బ్లష్, ఐ షాడో వంటివి ఏడాదికి మించి వాడకూడదు. పెదాలు అందంగా కనిపించడం కోసం రంగురంగుల లిప్స్టిక్, లిప్గ్లాస్లు వాడుతుంటాం కదా! వీటి గడువు కూడా ఒకటిన్నర సంవత్సరాలే. వీటిని చల్లని పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి. లేకపోతే వేడికి బ్యాక్టీరియా వాటిపై చేరే అవకాశం ఉంది. దీంతో చర్మంపై దురద, మొటిమలు వస్తుంటాయి. ఫౌండేషన్, క్లెన్సర్, మాయిశ్చరైజర్లు క్రీమ్ ఆధారితమైనవి. కాబట్టి వాటిని కనీసం 12 నుంచి 18 నెలల వరకూ ఉపయోగించుకోవచ్చు. వీటి గడువు ముగిస్తే పారేయాలే అన్న బెంగ వద్దు. పాదాలు, చేతులకు రాసుకుంటే సరి.

# స్వీట్ సమోసా




**కావలసినవి :**

మైదా, రెండు కప్పులు, బొంబాయిరవ్వ- చెంచా, నెయ్యి, పావుకప్పు, నూనె: వేయించేందుకు సరిపడా.
స్టఫింగ్కోసం : కోవా : కప్పు,
చక్కెరపొడి : అరకప్పు,
కొబ్బరిపొడి: టేబుల్స్పూను,
యాలకులపొడి: చెంచా,
బాదం, జీడిపప్పు, కిస్మిస్ పలుకులు : అన్నీ కలిపి ముప్పావుకప్పు,
పాకం కోసం : నీళ్లు, పావుకప్పు, చక్కెర : కప్పు.

**తయారీ విధానం:** ముందుగా ఓ గిన్నెలో మైదా, బొంబాయిరవ్వ వేసుకుని బాగా కలపాలి. తరవాత నీళ్లు చల్లుకుంటూ చపాతీపిండిలా కలిపి ఓ చెంచా నెయ్యి వేసి మరోసారి కలిపి పెట్టుకోవాలి. స్టౌ మీద బాణలి పెట్టి మిగిలిన నెయ్యి వేయాలి. అది కరిగాక బాదం, కిస్మిస్ జీడిపప్పు పలుకులు వేసి వేయించి తరువాత కోవా, చక్కెర, కొబ్బరిపొడి, యాలకులపొడి వేసి రెండు నిమిషాలయ్యాక దింపేయాలి. మరో గిన్నెలో నీళ్లు, చక్కెర తీసుకుని చపాతీలా వత్తి మద్యకు కోయాలి. అలా కోసిన చపాతీ ముక్క మధ్యలో ఒకటిన్నర చెంచా కోవా మిశ్రమాన్ని ఉంచి సమోసా ఆకృతి వచ్చేలా మూసేయాలి. ఇలా అన్నీ చేసుకుని రెండు చొప్పున కాగుతోన్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని రెండు నిమిషాలయ్యాక చక్కెరపాకంలో ముంచి తీయాలి.

# పండ్ల పూలసజ్జలు







మన ఇళ్లల్లో చిన్న పూలసజ్జలు ఉంటాయి. సాధారణంగా గుడికి వెళ్లేప్పుడు వాటిలో పూలూ, పండ్లూ తీసుకెళ్లాం. లేదంటే భోజనాల బల్లమీద అలంకారంగా ఉంచుతాం. ఆ పూల సజ్జలు పండ్లతో తయారైతే.. వాటిని పండ్లతో నింపి.. టీపాయ్ మీద పెడితే.. కళ్లకు విందేగా! మీరూ చేసి చూడండిలా!













# పిల్లలు పాలు తాగట్లేదా ?

పిల్లలకు పాలు బలవర్ధకమైన ఆహారం అన్న సంగతి తెలిసిందే. ఇంకా చెప్పాలంటే పుట్టగానే వారికి మొట్టమొదట అంటే ఆహారం కూడా అదే. అయితే పిల్లలు పసితనంలో తాగే తల్లిపాల ద్వారా వారి ఎదుగుదలకు కావాల్సిన పోషకాలన్నీ అందడంతో పాటు అవి వారికి ఎంతో రుచిగానూ ఉంటాయి. కానీ పెరిగే ఇచ్చే సాధారణ పాలు అంతగా రుచించిక చాలామంది పిల్లలు పాలు తాగడానికి.. తల్లిని పదే పదే సతాయిస్తారు. ఫలితంగా పాల ద్వారా వారి శరీర ఎదుగుదలకు అందాల్సిన పోషకాలు అందకుండాపోతాయి. అలాగని వారిని పట్టించుకోకుండా వదిలేయలేం. కాబట్టి రోజూ పిల్లలు తాగే పాలు మరింత రుచికరంగా తయారు చేయాలి.అప్పుడే వారు మరింత ఇష్టంతో పాలు తాగుతారు. మరి, పిల్లలకు రుచికరమైన పాలు అందించడమెలాగో తెలుసుకుందాం..



**తయారు చేయండిలా!**

పిల్లల ఎదుగుదలకు ఎంతగానో పాలు అందించే వారు ఇష్టంగా తాగాలంటే రకరకాల పండ్లతో స్మూతీలు, మిల్క్ షేక్స్గా తయారు చేసి వారికి అందించాలి. అయితే వీటి తయారీలో పండ్ల పరిమాణం కాస్త తక్కువగా, పాల పరిమాణం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎక్కువ మొత్తంలో పాలు వారికి అందించవచ్చు. అలాగే ఖిఎక్కువ తియ్యగా ఉంటే త్వరగా తాగుతారు కదా.. అని చక్కెర అధికంగా వేయకూడదు. ఎందుకంటే మొదట వారికి ఎక్కువ తీపితో అందించి.. తర్వాత క్రమంగా తీపి తగ్గిస్తే వారు ఇవి కూడా తాగలేరు. అలాగే అధిక చక్కెర వినియోగించడం వల్ల ఇతరత్రా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం కూడా ఉంటుంది. చాలామంది పిల్లలు కేవలం పాలు మాత్రమే ఇస్తే తాగరు. అందులో బాదం, పిస్తా, కుంకుమపువ్వు, చాక్లెట్.. వంటి ఫ్లేవర్లతో కూడిన శక్తిమంతమైన, రుచికరమైన పదార్థాలను కలిపితే గానీ వాటి మొహం కూడా చూడరు. అయితే కొంతమంది తల్లులు మాత్రం వీటిని పాలలో కలపడం వల్ల పాల నాణ్యత దెబ్బతింటుందని భావిస్తున్నారు. కానీ రుచి కోసం పిల్లల పాలలో కలపడానికి ప్రత్యేకంగా తయారు చేసిన కొన్ని ఉత్పత్తులు ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని ఉపయోగించవచ్చు. అలాగే పోషకాహార నిపుణులలో సలహా తీసుకుని కూడా రుచి కోసం కలిపే పదార్థాల్ని ఎంచు కోవచ్చు. ఫలితంగా పిల్లలకు పాలు రుచిగా మారడంతో పాటు పాలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి.. వంటి పోషకాలు పిల్లలకు సమృద్ధిగా అందుతాయి.

**వెన్నతో పాటే..** వెన్నతో కూడిన పాలు చాలా రుచిగా ఉంటాయి. అయితే కొంతమంది తల్లులు పిల్లలకు వీటిని నేరుగా ఇస్తే.. అందులోని కొవ్వులు శరీరంలోకి చేరి.. లేనిపోని సమస్యలకు దారితీస్తాయన్న సందేహంతో వెన్నపోటు పొడిచి అందిస్తారు. కానీ ఇలాంటి పాలు పిల్లలకు అస్సలు రుచించవు. అందుకే పాలు ఇవ్వడం ప్రారంభించినప్పుడు వెన్నతోనే ఇస్తూ.. క్రమంగా అందులోని వెన్న శాతాన్ని తగ్గిస్తే మంచిది. ఫలితంగా వారికి పాలు రుచించడంతో పాటు కొన్ని రోజుల తర్వాత వెన్న తొలగించిన పాలను తాగడానికి కూడా పిల్లలు అలవాటు పడే అవకాశం ఉంటుంది. ఇవి కలపొచ్చు. పిల్లలు ఉదయం బ్రేక్ ఫాస్ట్ గా తినడానికి ఇష్టపడే కార్న్ ఫ్లెక్స్, చాకోస్.. నేరుగా అందించకుండా.. పాలలో కలిపి ఇవ్వడం శ్రేయస్కరం. వీటిలోని రుచి పాలలోకి చేరి.. పాలు మరింత రుచిగా మారతాయి. ఫలితంగా వారు పదార్థాలను తిని. అలాగే పాలు కూడా తాగుతారు. ఇలా మీరు అందించే ఆహారంతో అటు పాలు తాగడం, ఇటు బ్రేక్ ఫాస్ట్ చేయడం... రెండూ పూర్తవుతాయి. అలాగే ఓట్మీల్, పాస్తా.. వంటి పదార్థాల్లో నీళ్లకు బదులుగా పాలను ఎక్కువగా ఉపయోగించడం కూడా మంచిదే.

# పరమశివుడి అనుమతి



**సీతాపహరణ తర్వాత రామలక్ష్మణులు** దండకారణ్యంలో సంచరిస్తుంటే. వాళ్లకో మనోహరమైన ప్రాంతం కనిపించింది. సీతమ్మవారి జాడ తెలిసేవరకూ అక్కడే నివసించాలనుకున్నా శ్రీరాముడు. అతడి సంకల్పాన్ని బలపరిచాడు లక్ష్మణుడు. సోదరా నాతో ఏకీభవించినందుకు సంతోషం. అయితే ఇదెవరిదో తెలుసుకోవాలి. వారి అనుమతి లేకుండా ఉండటం భావ్యం కాదు కదా! కనుక చుట్టుపక్కల ఎవరైనా ఉన్నారేమో చూడు, వారితో మాట్లాడుదాం అన్నాడు రాముడు. వెంటనే లక్ష్మణుడు పరిసరాలను పరిశీలిస్తూ కొంత దూరం వెళ్లగా.. ఉసిరి, మారేడు చెట్ల మధ్యన శివాలయం కనిపించింది.కానీ అక్కడెవరూ లేరు. తిరిగొచ్చి సంగతి తెలియజేశాడు. అయితే ఈ ప్రాంతానికి పరమ శివుడే అధిపతి అయ్యుంటాడు. ఆయన అనుమతి తీసుకో లక్ష్మణా అన్నాడు రాముడు. లక్ష్మణుడు శివాలయం వద్దకు వెళ్లి, శివుడి ఆజ్ఞకై అర్థించాడు. వెంటనే శివలింగం నుంచి ఉజ్వలంగా ఉన్న మూర్తి వెలువడి, అద్భుతంగా నృత్యం చేసి అదృశ్యమైంది. అలా ఎందుకు జరిగిందో, దాని భావం ఏమిటో లక్ష్మణుడికి అర్థం కాలేదు.సోదరుడి వద్దకు వచ్చి విషయం చెప్పాడు. రాముడు చిన్నగా నవ్వి. సోదరా! శివుడి ఆజ్ఞ లభించింది! కుటీరం నిర్మించు అన్నాడు. ఆజ్ఞ ఎప్పుడు లభాంచింది? ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మణుడు. లక్ష్మణా! మితిమీరిన స్వార్థం, జిహ్వా చాపలనయత్రం, కామ వికారాలే కష్టాలకు మూలం. వీటిని గనుక నియంత్రించుకోగలిగితే.. ఇక్కడే కాదు- ఎక్కడైనా సుఖంగా జీవించవచ్చు! ఈ మూడింటినీ మనం నిగ్రహించుకోగలమని పరమశివుడు గ్రహించాడు. కనుకనే నృత్య భంగిమలో దర్శనమిచ్చి తన అంగీకారాన్ని తెలియజేశాడు అంటూ వివరించాడు శ్రీరాముడు.

ఆధ్యాత్మికం

# బొమ్మలతో ఆడదాం !



పిల్లలతో సరదాగా కబుర్లు చెబుతున్నప్పుడో, చిన్ననాటి స్నేహితులు కలిసినప్పుడో... ఒకప్పుడు అది నా ఫేవరెట్ బొమ్మ, ఆ కార్టుని వదలకుండా చూసేవాళ్లంఖి అని గుర్తు తెచ్చుకుంటూ ఉంటాం కదా! తలచుకున్నప్పుడు తెలియకుండానే ఆనందం. ఆరోజులు తిరిగొస్తే బాగుంటుందన్న చిన్న ఆశ. అంతలోనే అది అసాధ్యమని తేలగానే నిరాశతోకూడిన చిన్న నిట్టూర్పు. అలాకాకుండా ఆ బాల్యం కొనసాగిద్దామా? దాన్నే కిడల్టింగ్ అంటున్నారు. ఇప్పుడది ఓ ట్రెండ్ కిడ్, అడల్ట్ కలిపి కిడల్టింగ్ పిలుస్తున్నాం. అంటే ఏమీలేదు... చిన్నతనాన్ని గుర్తుచేస్తూ మనలో ఆనందాన్ని నింపే పనులు చేయడమంటే, మెత్తగా, చూడగానే హత్తుకోవాలనిపించే టెడ్డీలంటే ఇష్టమా? ఇంకేం అవకాశమున్నప్పుడల్లా కొనుక్కోండి. కార్టూన్లంటే ప్రాణమా... హాయిగా చూసేయండి. వీడియోగేమ్లు, డ్రాయింగ్, కలర్ నింపడం, ఇసుకలో ఆడటం... మరీ ఈ వయసులో ఏం చేసిన మీమాంసలు పోక చక్కగా చేసుకుంటూ పోండి, ఊహే ఎంత బాగుందో కదా! ఇది చేసే మేలూ ఎక్కువే ఎంతైనా నచ్చిన పనులు కదా... ఉంటే తెలియకుండానే ఒత్తిడి పరారైపోతుంది. అంతేనా... వీడియోగేమ్లు, లెగోస్, బొమ్మలు గీయడం వంటివాటికి బుర్రకి పనిచెప్పాలి. దీనితో సృజనాత్మకత పెరుగుతుంది. యాంత్రిక జీవితంలో పడి ఎన్నింటిని మిస్ అవుతున్నామో కదా! ఇవి చిన్నతనాన్ని గుర్తు చేయడమే కాదు... చిన్న చిన్న వాటిల్లో ఆనందాన్ని వెతుక్కోవడమూ నేర్పుతాయి. కొన్నిసార్లు ఒక్కరమే ఆడాలనిపించదు. దీంతో మన పెద్దవాళ్లనో, స్నేహితులనో, పిల్లలతో ఆటలోకి లాగేస్తాం. ఇది తెలియకుండానే బంధాలను దగ్గర చేస్తుంది. మొత్తంగా తిరిగి చిన్నపిల్లలుగా ప్రవర్తిస్తూ జీవితంలో ఆనం దాన్ని వెతుక్కుంటామన్న మాట, ఇంటి బాధ్యతలు, ఆఫీసు ఒత్తిళ్లు అన్నీ పక్కనపెట్టి అయిపోదామా ఓసారి చిన్నపిల్లలం?

# ఛాంపియన్స్ ట్రోఫీలో..'రన్నింగ్' హీరోస్



## అత్యధిక రన్స్‌లో నెంబర్ 1గా క్రిస్ గేల్

## టాప్ 10లో భారత్ ప్లేయర్లు

**న్యూఢిల్లీ;** త్వరలోనే ఛాంపియన్స్ ట్రోఫీ-2025 మొదలు కాబోతోంది. ఈ నెల 19 నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుంది. క్రికెట్ టోర్నమెంట్ మొదలవుతుందంటే అభిమానుల కళ్లన్నీ దానిమీదే ఉంటాయి. అది ఐసీసీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ టోర్నీ అయితే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అభిమానులు రికార్డుల గురించి పలు లెక్కలేసుకుంటారు. ఇప్పటివరకూ 9 సార్లు ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించగా, ఈ నెలలో 10వ ఎడిషన్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీ హిస్టరీలో ఇప్పటి వరకూ అత్యధిక రన్స్ సాధించిన టాప్ 10 బ్యాటర్లలో ముగ్గురు టీమిండియా ప్లేయర్లు ఉన్నారు. వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్, లజెండరీ క్రికెటర్ క్రిస్ గేల్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన నెంబర్ 1 స్థానంలో ఉన్నాడు. గేల్ 17 మ్యాచ్‌లలో 791 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నాయి. 2006 లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో గేల్ 474 రన్స్ చేసి, ఆ సీజన్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. అలాగే శ్రీలంక మాజీ క్రికెటర్ మహేల జయవర్ధనే రెండో స్థానంలో ఉన్నాడు. జయవర్ధనే ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో 22 మ్యాచ్‌ల్లో 742 పరుగులు చేశాడు. ఇందులో 5 అర్ధ సెంచరీలు ఉన్నాయి. మూడో స్థానంలో భారత్ మాజీ స్టార్ శిఖర్ ధావన్ ఇండియా తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ ట్రోఫీలో 10 మ్యాచ్‌ల్లో 701 పరుగులు సాధించాడు. టీమ్ఇండియా 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ నెగ్గడంలో గబ్బర్ పాత్రే కీలకం. అందులో 5 మ్యాచ్‌ల్లో 363 పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గానూ నిలిచాడు. ఇక శ్రీలంక దిగ్గజం, వికెట్ కీపర్ కుమార సంగక్కర నాలుగో స్థానంలో ఉన్నాడు. 22 మ్యాచ్‌ల్లో 683 పరుగులు చేశాడు. టోర్నమెంట్‌లో సంగక్కర 4 హాఫ్ సెంచరీలు కూడా నమోదు చేశాడు. టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఈ లిస్ట్‌లో ఐదో స్థానంలో ఉన్నాడు. తన అసాధారణ బ్యాటింగ్, నాయకత్వ లక్షణాలతో భారత్‌కు 2003లో తొలి ఛాంపియన్స్ ట్రోఫీ అందించాడు. 13 మ్యాచ్‌ల్లో 665 పరుగులు చేశాడు. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్లలో గంగూలీది రెండో స్థానం. కాగా, ఈ లిస్టులో దక్షిణాఫ్రికా జట్టు నుంచి స్థానం సంపాదించిన ఏకైక ఆటగాడు జాక్వెస్ కలిస్. ఈ మాజీ ఆల్ రౌండర్ ఛాంపియన్స్ ట్రోఫీలో 17 మ్యాచ్‌ల్లో 653 పరుగులు చేశాడు. కాగా ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్లలో రాహుల్ ద్రావిడ్‌ది ఏడోస్థానం. ఈ టోర్నమెంట్‌లో 19 మ్యాచ్‌ల్లో 627 పరుగులు సాధించాడు. ఆస్ట్రేలియా తరఫున ఈ జాబితాలో స్థానం పొందిన ఒకే ఒక్క ఆటగాడు, దిగ్గజ కెప్టెన్ రికీ పాంటింగ్. పాంటింగ్ ఛాంపియన్స్ ట్రోఫీలో 18 మ్యాచ్‌ల్లో 593 పరుగులు చేయగా, అందులో 4 హాఫ్ సెంచరీలు, 1 సెంచరీఉన్నాయి. తొమ్మిదో ఆటగాడిగా వెస్టిండీస్ దిగ్గజం చంద్రపాల్ నిలిచాడు. టోర్నీలో 587 పరుగులు సాధించాడు. ఇందులో 5 అర్ధ సెంచరీలు సైతం ఉన్నాయి. ఇక శ్రీలంక లెజెండ్, అగ్రెసివ్ బ్యాటర్ సనత్ జయసూర్య ఈ జాబితాలో చివరిస్థానంలో నిలిచాడు. ఛాంపియన్స్‌లో అతడు 20 మ్యాచ్‌ల్లో 536 రన్స్ చేశాడు.




### మహిళల అండర్ 19 టీ20 వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో..

## విశ్వ విజేతగా భారత్ అమ్మాయిలు

### ఫైనల్లో 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా ఔట్

**న్యూఢిల్లీ;** టీమ్ఇండియా అండర్ 19 అమ్మాయిలు విశ్వ విజేతలుగా నిలిచారు. అండర్-19 టీ 20 వరల్డ్ ఛాంపియన్ టోర్నమెంట్‌లో టైటిల్ నెగ్గారు. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో నెగ్గింది. సఫారీ జట్టు నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని, టీమ్ఇండియా అమ్మాయిలు 11.2 ఓవర్లలో ఒకే 1 వికెట్ కోల్పోయి ఛేదించారు. గొంగడి త్రిష (33 బంతుల్లో 44 పరుగులు, 8 ఫోర్లు) స్వల్ప ఛేదనలో అదరగొట్టింది. సనికె చల్కె (26 పరుగులు) రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో రెనెకె 1 వికెట్ దక్కించుకుంది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 82 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్ల విజృంభనతో సఫారీ జట్టు విలవిల్లాడింది. మికీ వాన్ (23 పరుగులు)టాప్ స్కోరర్‌గా నిలిచింది. నలుగురు ప్లేయర్లు పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. టీమ్ఇండియా బౌలర్లలో త్రిష 3 వికెట్లు, పరునిక 2 వికెట్లు, ఆయూషి 2 వికెట్లు, వైష్ణవి 2 వికెట్లు, షబ్నమ్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా ఈ టోర్నీలో ఇప్పటికే సెంచరీ బాదిన త్రిష ఫైనల్‌లోనూ మూడు వికెట్లతో రాణించింది. అటు ఛేదనను కూడా దూకుడుగా ఆరంభించింది. ఈ మ్యాచ్‌లో పరుగులు చేసింది. భారత్ వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచింది.

### రంజీ ట్రోఫీలో..

## విజయంతో ముగించిన ఆంధ్ర

### 6 వికెట్ల తేడాతో రాజస్థాన్ చిత్తు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ సీజన్‌ను ఆంధ్ర జట్టు విజయంతో ముగించింది. ఎలైట్ గ్రూప్ బిలో భాగంగా జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 6 వికెట్ల తేడాతో రాజస్తాన్ జట్టును చిత్తు చేసింది. తాజా సీజన్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆంధ్ర జట్టుకు ఇదేతొలి విజయం కావడం గమనార్హం. ఓవర్‌నైట్ స్కోరు 7 వికెట్లు నష్టానికి 95 పరుగులతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రాజస్తాన్ చివరకు 39.4 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. అభిజిత్ తోమర్ (31), అజయ్ సింగ్ (30 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్సు) కాస్త పోరాడారు. ఆంధ్ర జట్టు బౌలర్లలో త్రిపురాణ విజయ్ మరో సారి 5 వికెట్లతో విజృంభించగా, పృథ్వీ రాజ్ 4 వికెట్లు తీశాడు. అనంతరం 153 పరుగుల లక్ష్య సాధనలో భాగంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 31 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసి గెలిచింది. రికీభుయ్ (76 బంతుల్లో 62 పరుగులు, 7 ఫోర్లు , 2 సిక్సులు) అర్ధశతకంతో మెరవగా, శ్రీకర్ భరత్ (4 పరుగులు, 5 ఫోర్లు), కరణ్ షిండే (35 పలుగులతో నాటౌట్, 7 ఫోర్లు) రాణించారు. ఇక రాజస్తాన్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగులు చేయగా, ఆంధ్ర జట్టు 220 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌తో కలిపి10 వికెట్లు పడగొట్టిన ఆఫ్‌స్పిన్నర్ విజయ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

## హాకీ ఇండియా లీగ్ ఛాంపియన్‌గా బెంగాల్ టైగర్స్

### 3 గోల్స్ తేడాతో హైదరాబాద్ తూఫాన్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** పది నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్, ఆ తర్వాత మ్యాచ్ మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనగా మరో గోల్ వెరసి పురుషుల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో బెంగాల్ టైగర్స్ జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. హోరాహోరీగా జరిగిన టైటిల్ పోరులో రూపిందర్ సింగ్ పాల్ కెప్టెన్సీలోని బెంగాల్ టైగర్స్ జట్టు 4-3 గోల్స్ తేడాతో హైదరాబాద్ తూఫాన్స్ జట్టును ఓడించింది. బెంగాల్ టైగర్స్ జట్టు తరఫున జుగ్‌రాజ్ సింగ్ (25వ, 32వ, 35వ నిమిషాల్లో) మూడు గోల్స్ చేసి హ్యాట్రిక్ నమోదు చేయగా, స్యామ్ లేన్ (54వ నిమిషంలో) గెలుపు గోల్ కొట్టాడు. ఇక హైదరాబాద్ తూఫాన్స్ తరఫున గొంజాలో పీలాట్ (9వ, 39వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా, అమన్దీప్ లాక్రా (26వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. కాగా ఏడేళ్ల విరామం తర్వాత హాకీ ఇండియా లీగ్‌ను పునరుద్ధరించారు. గత ఏడాది డిసెంబర్ 28వ తేదీన హాకీఇండియా లీగ్ మొదలైంది. ఇక విజేతగా నిలిచిన బెంగాల్ టైగర్స్ జట్టుకు రూ.3 కోట్లు. రన్నరప్ హైదరాబాద్ తూఫాన్స్ జట్టుకు రూ. 2 కోట్లు, మూడో స్థానంలో నిలిచిన సూర్మా హాకీ క్లబ్ జట్టుకు రూ.1 కోటి నగదు పురస్కారం లభించింది. ఈ హాకీ ఇండియా లీగ్‌లో మొత్తం ఎనిమిది జట్లు పోటీపడగా, లీగ్ దశ మ్యాచ్ ముగిశాక బెంగాల్ టైగర్స్ జట్టు 19 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. తుదకు బెంగాల్ టైగర్స్ జట్టుకే టైటిల్ లభించడం విశేషం. కాగా హాకీ ఇండియా లీగ్‌లో బెస్ట్ గోల్ కీపర్‌గా బ్రికమ్‌జీత్ సింగ్ (రూ.10లక్షలు, హైదరాబాద్ తూఫాన్స్), అప్‌కమింగ్ ప్లేయర్‌గా అర్ష్ దీప్ (రూ.10 లక్షలు, హైదరాబాద్ తూఫాన్స్), టాప్ స్కోరర్‌గా జుగ్‌రాజ్ సింగ్ (బెంగాల్ టైగర్స్, రూ.10 లక్షలు), బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా సుఖ్‌జిత్ సింగ్ (రూ.20 లక్షలు,బెంగాల్ టైగర్స్) ఎంపికయ్యారు. యూపీ రుద్రాస్ జట్టుకు ఫెయిర్ ప్లే అవార్డు లభించింది.

## తొలి టెస్టులో ఆస్ట్రేలియా గెలుపు

### శ్రీలంక చరిత్రలో 242 తేడాతో అతి పెద్ద ఓటమి

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో తొలి టెస్టులో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఆతిథ్య జట్టును ఏకంగా ఇన్నింగ్స్ 242 పరుగుల తేడాతో మట్టి కరిపించింది. తద్వారా రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కాగా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2023-25 సీజన్‌లో ఆసీస్ ఇప్పటికే ఫైనల్‌కు చేరుకుంది. అయితే, ఈ ఎడిషన్లో ఆఖరిగా రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడేందుకు శ్రీలంక పర్యటనకు వచ్చింది. ఈ టూర్లో భాగంగా రెండు వన్డేలు కూడా ఆడనుంది. ఈ క్రమంలో తొలుత గాలె వేదికగా శ్రీలంక-ఆస్ట్రేలియా జట్ల మధ్య మొదటి టెస్టు ఆరంభమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా డబుల్ సెంచరీ (232)తో చెలరేగగా, ట్రవిస్ హెడ్ మెరుపు అర్ధ శతకం (40 బంతుల్లో 57) బాదాడు. మిగతా వాళ్లలో వన్‌డౌన్ బ్యాటర్ మార్నస్ లబుషేన్ (20) మరోసారి విఫలం కాగా, కెప్టెన్ స్టీవ్ స్మిత్ అద్భుత శతకం (141)తో దుమ్మురేపాడు. ఇక టెస్టు అరంగేట్రం లోనే జోస్ ఇంగ్లిష్ సెంచరీ (102)తో మెరిసి తన విలువను చాటుకోగా, వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ క్యారీ (46 నాటౌట్) కూడా ఫర్వాలేదనిపించాడు. టెయిలెండర్లలో బ్యూ వెబ్‌స్టర్ (23), మిచెల్ స్టార్క్ (19 నాటౌట్) తమ శక్తిమేర పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 154 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 654 పరుగుల వద్ద ఉన్న వేళ ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. లంక బౌలర్లలో స్పిన్నర్లు ప్రభాత్ జయసూర్య, జెఫ్రీ వాండర్సే మూడేసి వికెట్లు దక్కించుకున్నారు. ఇక తమ తొలి ఇన్నింగ్స్ ఆరంభం నుంచే శ్రీలంక తడబడింది. ఓపెనర్లు ఒషాడా ఫెర్నాండో, దిముత్ కరుణరత్న ఏడేసి పరుగులు చేసి పెవిలియన్‌కు చేరగా, వన్‌డౌన్‌లో వచిచన దినేశ్ చండిమాల్ ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యత తీసుకున్నాడు. మొత్తంగా 139 బంతులు ఎదుర్కొన్ని 9 ఫోర్ల సాయంతో 72 పరుగులు చేశాడు. అయితే ఆస్ట్రేలియా స్పిన్నర్ అద్భుత బంతితో చండిమాల్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్ వేగంగా పతనమైంది.

# టాక్స్ ఆదాకు ఈ టిప్స్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను ఆదా చేసుకోవడానికి చాలా మార్గాలు ఉన్నాయి. కొన్ని ట్రిక్స్ పాటిస్తే మీ పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చుంటున్నారు ఆర్థిక నిపుణులు. ప్రతి సంవత్సరం ఆర్థిక సంవత్సరం చివరలో అంటే జనవరి, ఫిబ్రవరిలో పన్నులను ప్లాన్ చేయడం ఆలస్యం చేయడమే కాకుండా ఒత్తిడిని కూడా సృష్టిస్తుంది. ఈ పనిని ఆర్థిక సంవత్సరం చివరిలో చేస్తే, అది పన్ను ప్రణాళిక కాదు, పన్ను సమ్మతి. పన్ను ప్రణాళిక వాస్తవానికి పన్ను బాధ్యతను తగ్గించడానికి వ్యూహాన్ని సిద్ధం చేయడం, దీనిని ముందుగానే ప్రారంభించాలి. పన్ను ప్రణాళిక, ఆర్థిక ప్రణాళిక కలిసి ఉంటాయి. ఏడాది పొడవునా పన్ను ప్రణాళిక కొనసాగుతుంది. ఆదర్శవంతంగా ఇది




ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే ప్రారంభించాలి. మీరు మీ పన్ను పరిస్థితి, ఖర్చులు, మినహాయింపులు, తగ్గింపులు మొదలైనవాటిని పరిగణించాలి. ఇది మీ పన్ను బాధ్యత గురించి, మీపన్ను బాధ్యతను చట్టబద్ధంగా ఎలా తగ్గించుకోవచ్చో మీకు ఒక ఆలోచనను అందిస్తుంది. జీతం పొందే వ్యక్తులు అటువంటి పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. ఇది వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. సరైన పన్ను ప్రణాళికతో మీరు మీ పన్ను బాధ్యతలను చాలా వరకు తగ్గించుకోవచ్చు. పన్ను ఆదా ఎంపికల గురించి తెలుసుకోండి. చాలా మంది పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను సెక్షన్ 80సి గురించి తెలిసిందే. అయితే ఇది కాకుండా, అనేక పన్ను ఆదా ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. వీటిని పాత పన్ను విధానంలో పొందవచ్చు. ఉదాహరణకు మీరు సెక్షన్ 80సి కింద రూ.1.5 లక్షల పరిమితికి మించి పెట్టుబడి పెట్టాలనుకుంటే, మీరు సెక్షన్ 80సిసిడి (1బి) రూపంలో ఎన్‌పిఎస్‌కి సహకరించవచ్చు. దీని ద్వారా అదనంగా రూ.50,000 ఆదా చేసుకోవచ్చు. ఇది కాకుండా అనేక ఇతర ఎంపికలు కూడా ఉన్నాయి. సెక్షన్ 80సి: ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పిపిఎఫ్), ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్ (ఇఎల్ఎస్ఎస్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సి), ఉద్యోగుల ఆదాయపు పన్ను పథకం వంటి పన్ను ఆదా పెట్టుబడులకు అనేక మార్గాలను అందిస్తుంది. ఇందులో మీరు ఏటా రూ.1.5 లక్షలు ఆదా చేసుకోవచ్చు. ఆరోగ్య బీమా ప్రీమియం: స్వీయ, జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రుల కోసం ఆరోగ్య బీమా పాలసీల కోసం చెల్లించిన ప్రీమియం సెక్షన్80డి కింద మినహాయింపుకు అర్హమైనది. మీరు ఈ మినహాయింపును పొందకుంటే పన్ను బాధ్యతపెరగవచ్చు. ఎన్‌పిఎస్‌కి చేసిన విరా ళాలు సెక్షన్ 80సి కింద అందుబాటులో ఉన్న పరిమితిని మించి ఉంటే సెక్షన్ 80సిసిడి (1బి) కింద పన్ను మినహాయింపుకు అర్హులు. ఈ అదనపు మినహాయిం పును పొందక పోతే పన్ను ఆదా అవకాశాలను కోల్పోవచ్చు.

# టూవీలర్లలో కింగ్ 'హీరో జూమ్'

**ముంబై, ఫిబ్రవరి 2:** ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో నుంచి జూమ్ 160 పేరుతో కొత్త స్కూటర్ విడుదలైంది. ఇదే విభాగంలో యమహా ఏరోక్స్ 155 స్కూటర్ కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉంది. ఈ రెండు స్కూటర్ల మధ్యతేడాలు, ధర, ఇతర వివరాలను తెలుసుకుందాం. సాధారంగా దేశంలో విక్రయిస్తున్న స్కూటర్ల ఇంజిన్ సామర్థ్యం 125సీసీకి మించి ఉండదు. విదేశీ ఓఈఎంల నుంచి మాత్రమే ఖరీదైన మ్యాక్సీ స్కూటర్లు విడుదలయ్యాయి. 2021లో యమహా ఏరోక్స్‌ను 155 సీసీతో మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. ఇదిమినహా ఇప్పటి వరకూ అంత ఇంజిన్ సామర్థ్యంతో ఏ స్కూటర్ విడుదల కాలేదు. తాజాగా హీరో జూమ్ 160 సీసీ ఇంజిన్‌తో కస్టమర్ల ముందుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో దీన్ని ప్రదర్శించారు. ఈ స్కూటర్ 110, 125 మోడళ్లలోనూ అందుబాటులో ఉంది. ధర వివరాలు హీరో జూమ్ 160 స్కూటర్ ధర రూ.1.48 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. యమహా ఏరోక్స్ ధర రూ.1.49 లక్షల నుంచి రూ.1.53 లక్షల మధ్య ఉంది. ఇవన్నీ ఎక్స్ షోరూమ్ ధరలు. హీరో జూమ్ 160 సీసీ లిక్విడ్ కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ తో వస్తోంది. దీని నుంచి 8000 ఆర్పీఎం వద్ద 14.20 బీహెచ్పీ గరిష్ఠ శక్తి, 6500 ఆర్పీఎం వద్ద 14 ఎన్ ఎం టార్కును విడుదల అవుతుంది. యమహా ఏరోక్స్‌లో 155సీసీ లిక్విడ్ కూల్డ్, సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఏర్పాటు చేశారు. ఈ ఇంజిన్ నుంచి 8000 ఆర్పీఎం వద్ద 14.49బీహెచ్పీ గరిష్ఠ శక్తి, 6500ఆర్పీఎం వద్ద 13.9ఎన్ ఎం టార్కు విడుదల అవుతుంది. హీరో జూమ్ స్కూటర్ సీటు ఎత్తు 787 ఎంఎం, గ్రౌండ్ క్లియరెన్స్ 155 ఎంఎం, వీల్ బేస్ 1,348 ఎంఎంగా ఉన్నాయి. ఫ్యూయల్ కెపాసిటీ 7 లీటర్లు, స్కూటర్ బరువు 142 కేజీలు. యమమా ఏరోక్స్ స్కూటర్ సీటు ఎత్తు 790 ఎంఎం, గ్రౌండ్ క్లియరెన్స్ 145ఎంఎం, వీల్‌బేస్ 1,350ఎంఎంగా ఉన్నాయి. దీని ఫ్యూయల్ కెపాసిటీ 5.5లీటర్లు. ఈస్కూటర్ బరువు126కేజీలు.



### వాణిజ్యం

# ఎఐ ఎక్కువ వినియోగం అనర్థమే!

**ముంబై, ఫిబ్రవరి 2:** ఎఐ విషయానికి సంబంధించిన ఆరు అంశాలలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. చాట్ జీపీతో పాటు మిగిలిన ఎఐ చాట్ బాట్‌లతో కొన్ని విషయాలను ప్రస్తావించకూడదని తెలిపారు. ఇటీవల వెల్లడైన ఓ నివేదిక ప్రకారం, చాలామంది ప్రజలు ఆరోగ్య సంబంధ విషయాలపై ఎఐని ఎక్కువగాసంప్రదిస్తున్నారు. అది అందించే సూచనలు పాటిస్తున్నారు. ఎఐ చాట్ బాట్‌లు మనతో చాలా స్నేహపూర్వకంగా వ్యవహరిస్తాయి. అన్ని సమస్యలకు పరి ష్కారాన్ని చూపుతాయి. కానీ ఆరోగ్య సంబంధ విషయాల కోసం వాటిపై ఆధారపడకూడదని నిపుణులు చెబుతున్నారు. ప్రతి ఐదుగురు అమెరికన్లలో ఒకరు ఇలా ఆరోగ్య సలహాలు కోరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కింద తెలిపిన విషయాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఇమెయిల్ అడ్రస్ తదితర వ్యక్తిగత సమాచారాన్ని ఎఐ చాట్ బాట్‌లతో పంచు కోకూడదు. దాని ద్వారా మిమ్మల్ని, మీ పనులను బయటి వారు ట్రాక్ చేసే ప్రమాదం ఉంటుంది. బ్యాంకు ఖాతా, క్రెడిట్ కార్డు తదితర వాటి నంబర్లను ఎప్పుడూ ఎఐ చాట్ బాట్‌లతో ప్రస్తావించకూడదు. ఆ పిన్ నంబర్లను వాటిలో ఎంటర్ చేయకూడదు. దీనివల్ల మీ డబ్బులను దోచుకునే వీలుంటుంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆన్ లైన్ లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకు ఖాతాల పాస్ వర్డుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వీటిలో ఏఐ చాట్ బాట్‌లలో షేర్ చేసుకుంటే మీ డేటాను హ్యాక్ చేసే ప్రమాదం ఉంది.



ఎఐ చాట్ బాట్‌లతో మీ రహ స్యాలను ఎప్పుడూ పంచుకోవచ్చు. ఎందుకంటే అది వ్యక్తి కాదు, మీ రహస్యాలను తనలో దాచుకోలేదు. ఆరోగ్య సలహాల కోసం ఎప్పుడూ ఎఐపై ఆధారపడవద్దు. ఎందుకంటే అది వైద్యుడు కాదు. అలాగే ఆరోగ్య బీమా నంబర్, ఇతర వివరాలను దానిలో షేర్ చేయకండి. ఎఐలతో పంచుకున్న అన్ని విషయాలను స్టోర్ అవుతాయి. అలాగే దాన్ని ఇతరులకు పంచుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రపంచానికి తెలియకూడదనుకునే ఏ విషయాన్ని షేర్ చేసుకోవద్దు.

# మ్యూచువల్ క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్‌కు కేంద్రం ఓకే


**ముంబై, ఫిబ్రవరి 2:** ఎంఎస్ఎంఇని రంగానికి మేక్ఇన్ ఇండియా యూనియన్ బడ్జెట్ 202425 కింద నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా తయారీ రంగాలకు రుణ లభ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో మ్యూచువల్ క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పథకం నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ ద్వారా రూ. 100 కోట్ల వరకు రుణాల కోసం మెంబర్ లెండింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లకు 60 శాతం గ్యారెంటీ కవరేజీని అందిస్తుంది.



అర్హత కలిగిన ఎంఎస్ఎంఇలకు పరికరాలు, యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం చేస్తుంది. ఈ క్రెడిట్ ఎంఎస్ఎంఇని పరిశ్రమలు ప్లాంట్, మెషినరీ, పరికరాలను కొనుగోలు చేయడానికి, రంగానికి ప్రోత్సాహాన్ని అందించడానికి, మేక్ ఇన్ ఇండియా చొరవను బలోపేతం చేయడానికి అనుమతిస్తుంది. తయారీ రంగం ప్రస్తుతం భారతదేశ జిడిపికి 17 శాతం దోహదం చేస్తుందని, 27.3మిలియన్లకు పైగా కార్మికులకు ఉద్యోగాలు కల్పిస్తోందని వెల్లడించింది. 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' అనే ప్రధాని మోదీ దార్శనికత జీడీపీలో ఈ వాటాను 25 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకుందని ప్రభుత్వం పేర్కొంది.

# సైబర్ మోసాలకు ఇక చెక్..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీల నిర్వహణకు ప్రతి ఒక్కరూ పిన్ నంబరు పెట్టుకుంటారు. అయితే ఈ డిజిటల్ యుగంలో ఆన్ లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటి నుంచి రక్షణకు యాక్సిస్‌బ్యాంకు కొత్త విధానం తీసుకువచ్చింది. సురక్షితమైన బ్యాంకింగ్ కోసం దేవనాగరి పిన్‌ను ప్రారం భించింది. దేశంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతాలు ఉంటాయి. వీటి ద్వారా ఆన్ లైన్ లో ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి పిన్ నంబర్ పెట్టుకుంటారు. చాలామంది తమ పుట్టిన రోజు, పెళ్లి రోజు, పిల్లల పేర్లు, సులువుగా ఉండే నంబర్లతో దీన్ని సెట్ చేసుకుంటారు. లావా దేవీల సమయంలో గుర్తు పెట్టు కోవడానికి వీలుగా ఉంటుందని ఈ పద్ధతిని ఫాలో అవుతారు. కానీ ఇదే సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది. చాలా తెలివిగా మన పిన్ నంబర్ ను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాలలో డబ్బులను దోచుకుంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికే దేవనాగరి పిన్ విధానం అమల్లోకి వచ్చింది. సైబర్ నేరగాళ్ల సమస్యకు యాక్సిస్‌బ్యాంకు ప్రత్యేక పరిష్కారంతో ముందుకు వచ్చిం ది. దీనిలో భాగంగా దేవనాగరి పిన్ ను ఆవిష్కరించిం ది. సాంకేతికత, సంప్రదాయాన్ని మిళితం చేసి దీన్ని తీసుకు వచ్చింది. ఈ పిన్‌ను గుర్తుంచుకోవడానికి ఖాతాదారులకు వీలుగా ఉంటుంది. అదే సమయంలో సైబర్ నేరగాళ్లు ఛేదించలేరు. దేవనాగరి పిన్‌ను సెట్ చేసుకునేందుకు ముందుగా దేవనాగరిపిన్.కమ్ అనే వెబ్ సైట్‌లోకి వెళ్లాలి. మీ ఖాతాకు సెట్ చేసుకునే పేరును ముందుగానే నిర్ణయించుకోవాలి. అది మీకిష్ట మైన పుస్తకం, రుచికరమైన వంటకం, సినిమా.. ఇలా ఏదైనా కావచ్చు. వెబ్ సైట్ లో ఆ పేరు టైప్ చేయడానే మీ పిన్ సెట్ అవుతుంది. ఈ విధానంలో మీరు టైప్ చేసిన పదాలు అల్ట్రా సురక్షిత పిన్ లుగా మార్చబడతాయి. దీన్ని సైబర్ నేరగాళ్లు ట్రాక్ చేయలేరు. ఊహాజనిత సంఖ్యల పిన్ నంబర్ ను సైబర్ నేరగాళ్లు చాలా సులభంగా హ్యాక్ చేయగలరు. దేవనాగరి లిపి విషయంలో ఆ అవకాశం ఉండదు. మన ఖాతాలు సురక్షితంగా ఉంటాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.